సంపుటి : 74 సంచిక : 33 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి
13-19 జూన్ 2022
వెల : ₹15/-





## సర్వామోద నేత



# మన విద్యకు శ్రీకారం

నూతన విద్యావిధానం-2020 గురించి విద్యాభారతి జాతీయ అధ్యక్షులు దూసి రామకృష్ణతో ముఖాముఖి..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# జాగృతి

జాతీయ తెలుగు వారపత్రిక

## ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
## చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
## ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి వారపత్రికలో
చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను
మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

Jagriti Bank A/c details :
Jagriti Prakasan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

## తామెవరో, ఎటువంటి ఘనచరిత్రకు వారసులో మన భావితరాలకు తెలియాలి గదా! ఆ దృష్టితో రూపొందించినదే ఈ బాల పుస్తకమాల

# భారత భారతి




అతి తక్కువ ఖరీదులో లభిస్తున్న అత్యంత ఉపయోగకరమైన భారత భారతి పుస్తకమాలను మీ ఇంటిలో, పాఠశాలలో చదివించండి.
మీ పిల్లలు సవ్యమైనదిశలో ఎదగడానికి దోహదపడండి.

**భారత భారతి బాల పుస్తకమాలగా ఇప్పటికి వెలువడిన 169 పుస్తకాలు విడివిడిగా ఒక్కొక్కటి 15 రూపాయలు. మొత్తం సెట్ 2200 రూ॥లకే లభిస్తుంది.**

**సాహిత్యనికేతన్**
3-4-852, కేశవనిలయం,
బర్కత్‌పురా, హైదరాబాద్ - 27.
దూరవాణి : 040-27563236

**సాహిత్యనికేతన్**
ఏలూరురోడ్, గవర్నరుపేట,
విజయవాడ - 2.
దూరవాణి : 9440643348

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, 1-1-60/5, Musheerabad, RTC 'X' Road, Hyderabad-500 020. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | 9959310103 |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

హిందుత్వం మీద, భారతదేశం మీద, భారతీయ జనతా పార్టీ మీద ద్వేషం ప్రకటించడానికి ఇన్ని మార్గాలు ఉన్నాయా? ఇలాంటి ప్రతికూలత, ఇలాంటి వాతావరణం మన దేశం ఎన్నడూ చూడనిది కాదు. కానీ ఇలాంటి నిరసనను చూడడం మాత్రం ఇప్పుడే. బీజేపీ అధికార ప్రతినిధులు నుపూర్ శర్మ, నవీన్ జిందాల్ ప్రవక్త మహమ్మద్ పట్ల దైవదూషణకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఇప్పుడు అరబ్ దేశాలతోపాటు, చాలా ముస్లిం సమాజాలు భారతదేశాన్ని ఒక్కసారిగా పరమ శత్రువుల జాబితాలో చేర్చాయి. ఇక భారత ప్రతిపక్షాల సంగతి చెప్పక్కరలేదు. వాటిది పాతపాటే.

ప్రవక్త మీద ఏ విధమైన ప్రతికూల వ్యాఖ్యలు చేసినా ముస్లిం సమాజం తీవ్రంగానే స్పందిస్తుంది. ఈ విషయంలో ఆ వర్గం మనోభావాలను అర్థం చేసుకోవాలి కూడా. అర్థం చేసుకున్నది కాబట్టే పార్టీలో ఎంతో కీలకంగా ఉన్న ఆ ఇద్దరు అధికార ప్రతినిధులను బీజేపీ బహిష్కరించింది. ఈ నిర్ణయాన్ని కొన్ని ముస్లిం దేశాలు హర్షించాయి కూడా. ఇక్కడే కొన్ని అర్థంకాని అంశాలు, జవాబు దొరకవలసిన ప్రశ్నలు ఉన్నాయి.

నుపూర్ చేసిన వ్యాఖ్యలు ఆమె సొంతం కాదనీ, గతంలో జాకీర్ నాయక్ వంటివారు వెల్లడించినవేనని ఒక వాదన ఉంది. వృత్తి చేత న్యాయవాది అయిన ఈ పార్టీ అధికార ప్రతినిధికి ఏది దైవ దూషణో తెలియదని అనుకోలేం. కానీ వివాదం వచ్చింది కాబట్టి ఆ అధికార ప్రతినిధిని సమర్థించకుండా, మొండిగా వాదించకుండా బీజేపీ తొలగించింది. ఈ వాస్తవాలను ప్రపంచం ఎందుకు గుర్తించడం లేదు? వివాదాన్ని అంతర్జాతీయం చేయడం ఎందుకు? హిందువులకు ఆధిక్యభావం ఉన్నదంటూ, మైనారిటీలను అణచివేస్తున్నారంటూ అబద్ధాలు ప్రచారం చేసే అంతర్జాతీయ సంస్థలకు కనిపించని చాలా అంశాలు కూడా ఉన్నాయి. జ్ఞానవాపి మసీదు వివాదంలో ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ ఎంత హుందాగా తమ వైఖరిని వెల్లడించారో ఇంతలోనే ముస్లిం దేశాలు

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం
**మన విద్యకు శ్రీకారం**
6లో

జాతీయం
**పండిట్‌లపై కొత్త పగ**



12లో



ధారావాహిక నవల
**లంబసింగి రోడ్డు**
- డా॥ గోపరాజు నారాయణరావు
20లో

# జాగృతి

## సంపాదకీయం

మరచిపోయాయా? 40,000 మసీదులు మా ఆలయాలను కూల్చి కట్టినవేనని హిందువులు గట్టిగా వాదిస్తున్న తరుణంలో, ప్రతి మసీదు కింద శివలింగాన్ని వెతకవద్దని సర్‌సంఘచాలక్ చెప్పిన హితవు గుర్తుకు రాదేమి? కశ్మీర్‌లో మే మాసంలోనే తొమ్మిదిమంది హిందువులను వెంటాడి మరీ కాల్చి చంపారు ముస్లిం ఉగ్రవాదులు. జూన్ 6వ తేదీన ఒక ఆలయాన్ని ముస్లిం మతోన్మాదులు ధ్వంసం చేశారు. ఇది దైవ దూషణ కిందకు రాదా? లేకపోతే అసలు హిందూ దేవుళ్లను ఎంత నీచంగా తిట్టినా ప్రపంచం దానిని దైవదూషణగా పరిగణించదా? హిందూ

# ఇది వాంఛనీయం కాదు!

ఆధ్యాత్మిక చింతనలో విగ్రహారాధన ఉంటుంది. ఎప్పుడో జరిగిన చరిత్రలోనే కాదు, ఇటీవలి కాలంలో కూడా ఎన్ని హిందూ గుడులను, దేవుళ్ల విగ్రహాలను ఉన్మాదులు అపవిత్రం చేశారో ప్రపంచానికి తెలియదా? ముస్లిం దురాక్రమణదారుల అపచారాలకు అద్దం పడుతూ దేశం నలుమూలలా ఆలయాలు కనిపించే మాట నిజం కాదా? అంటే ఎన్ని లక్షల దైవదూషణలు?

కువైట్, కతార్, ఇరాన్ భారత దౌత్యవేత్తలను పిలిచి బీజేపీ అధికార ప్రతినిధి మాటలకు నిరసన చెప్పాయి. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, బెహ్రెయిన్, మాల్దీవ్స్, ఒమన్, అఫ్ఘానిస్తాన్ వెంటవెంటనే రంగంలోకి దిగిపోయాయి. కువైట్ తన మార్కెట్ల నుంచి భారతీయ ఉత్పత్తులను వెంటనే ఉపసంహరించింది. 57 దేశాల ఇస్లామిక్ రాజ్యాల కూటమి, పాకిస్తాన్ కలసి విమర్శలు గుప్పించినపుడు మన విదేశ వ్యవహారాల అధికార ప్రతినిధి దీటుగానే స్పందించారు. భారత్ అన్ని మతాల పట్ల సమాన గౌరవంతో ఉందని ఆయన చెప్పవలసి వచ్చింది. భారత ప్రభుత్వం లక్ష్యం విభజన, వివక్ష కానేకాదని స్పష్టం చేయవలసి వచ్చింది. ఆయా దేశాలలో, చాలా పాశ్చాత్య దేశాలలో హిందూ దేవతామూర్తుల బొమ్మలను చెప్పుల మీద ముద్రించినపుడు భారత్ ఎంత గొంతు చించుకున్నా ఎవరూ మద్దతు ఇవ్వలేదు. అది న్యాయమా? హిందూ దేవుళ్లను అవమానించడం, వారి మనోభావాలను గాయపరచడం ముస్లిం మతోన్మాదుల హక్కుగా ప్రపంచం భావిస్తోంది.

కొందరు విజ్ఞులు అంచనా వేస్తున్నట్టు ముస్లిం దేశాల ఆగ్రహం ప్రేరేపితమేనని నమ్మక తప్పదు. వారి మనోభావాలను గౌరవిస్తూనే, ఎవరో ప్రేరేపిస్తే, తాము సమున్నతంగా చూసే మత భావనలను దుర్వినియోగం చేయడానికి సిద్ధపడడం ఆ దేశాలకు వాంఛనీయం కాదని చెప్పక తప్పదు. ఎందుకంటే భారతదేశంలో చాలామంది ముస్లిం మతోన్మాదులు చేస్తున్న పని అదే. జ్ఞాన్‌వాపి మసీదులో వజూఖానాలో శివలింగం ఉన్నట్టు గుర్తించారు. అంటే నమాజ్‌కు వెళ్లే ముందు కాళ్లూ చేతులూ కడుక్కునే స్థలం. అక్కడ శివలింగం ఉండడం హిందువుల మనోభావాలను ఎంతగా గాయపరచి ఉంటుందో తెలుసుకోరేమి? కానీ అది ఫౌంటేన్ అని అసదుద్దీన్ వంటి కపట మైనారిటీ నాయకుడి వివరణ. నుపూర్‌ను వెంటనే అరెస్టు చేయాలంటూ ఇప్పటికే చాలామంది రోడ్డెక్కారు. దైవదూషణ అనేది ఎక్కడైనా ఏ మతానికైనా ఒక్కటే అని నమ్మితే ఇలాంటి అరెస్టులు ఇంకా చాలా జరగవలసి ఉందన్న సంగతిని అంగీకరించాలి. హిందూ దేవతలు ఎవరికి పుట్టినవాళ్లు అంటూ పరమ నీచమైన వ్యాఖ్య చేసిన పార్టీ మనుషులు కూడా భారతదేశంలో పరమత అసహనం పెట్రేగి పోతున్నదంటూ ఊగిపోతున్నారు. లక్ష్మీదేవి ఎవరికి పుట్టిందంటూ వాగిన అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్య, నిన్నగాక మొన్న ఓ ఊరేగింపులో కృష్ణుడినీ, నటరాజస్వామి భంగిమనీ పరమ నీచంగా నడిరోడ్డు మీదే తిట్టిన ఆ డీఎంకే కార్యకర్తలు చేసింది దైవదూషణేనన్న సంగతి విస్మరించవద్దు. ★

13 జూన్ 2022, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



ప్రత్యేక వ్యాసం
**ఏరువాక కావాలి 'సిరి' వాకిలి**
26లో



తృతీయ వర్ష-2022
**భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలబెడదాం..**
36లో



కథ
**ధార్మిక**
– డా॥ బి.వి.ఎన్. స్వామి
32లో



సందర్భం
**రక్తదానంపై అపోహలొద్దు**
40లో


| | | |
|---|---|---|
| రాష్ట్రంలో పాగా వేయడమే లక్ష్యం (తెలంగాణ) | - | 14 |
| ఎస్సీలు, మైనార్టీలు ఒక్కసారి ఆలోచించాలి (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ఆధ్యాత్మికం | - | 18 |
| సర్వామోద నేత (మోదీ 8 ఏళ్ల పాలన) | - | 23 |
| రైతు సంక్షేమమే లక్ష్యం (వ్యవసాయం) | - | 28 |
| కలవరించి... 'కల' వరించి... (మహిళ) | - | 30 |
| ధన్యజీవి అప్పాజీ (నివాళి) | - | 41 |
| వార్తా విశేషాలు | - | 42 |
| టెన్నిస్ బాహుబలి నదాల్ (క్రీడ) | - | 43 |
| మయన్మార్‌లో హైందవ మూలాలు (సంస్కృతి) | - | 44 |
| బాలజాగృతి | - | 46 |
| వారఫలాలు | - | 48 |
| పదరసం | - | 49 |
| తప్పక చూడాల్సిన చిత్రం 'మేజర్' (సినిమా) | - | 50 |

దశాబ్దాల పరాయి పాలనలో ఎంతో పోగొట్టుకున్న భారత్ ప్రపంచ శక్తిగా అవతరిస్తున్న తరుణమిది. అలాగే చారిత్రక తప్పిదాలను సరిచేసుకుంటున్న దేశం కూడా. ఇంతకు ముందు ఆ తప్పిదాలను సరిదిద్దుకోవడంలోనూ అలసత్వమే కనిపించింది. ఇప్పుడు అది మారింది. దేశ భవిష్యత్తును శాసించే, అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్టను నిలిపే కొత్త విద్యా విధానాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆధునిక దృష్టిని కోల్పోకుండానే, భారతీయ మూలాలను విస్మరించకుండానే రూపొందించిన విధానమిది. ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యాభారతి సూచనలతో రూపొందిన కొత్త భారతీయ విద్యావిధానం వైపు ప్రపంచ దేశాలు దృష్టి మళ్లించాయి. ఐదేళ్ల తపస్సుతో సిద్ధమైన కొత్త విద్యావిధానాన్ని జూలై 29, 2020న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. దేశంలో రాష్ట్రాలు దశలవారీగా అమలు చేయడం మొదలయింది. 1986లో చివరిసారి వచ్చిన విద్యా విధానం స్థానంలో దీనిని అమలు చేస్తున్నారు. కొత్త విధానంలో కనిపించేదే సానుకూల దృక్పథం కలిగిన పెను మార్పు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు, వృత్తి విద్యా కోర్సుల వరకు, సంస్కృతి, గ్రామీణ దృక్కోణం, వ్యక్తిత్వ వికాసం, విద్యార్థులలో సృజనాత్మక దృష్టి, మాతృభాషలో



దూసి రామకృష్ణ
(విద్యా భారతి జాతీయ అధ్యక్షులు)

**ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం ఏం చేసినా తర్జని ఎత్తడానికి ఎందరో నిరీక్షిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో 'నూతన విద్యావిధానం 2020' వచ్చింది. దీనికంటే ముందు ఈస్టిండియా కంపెనీ మొదలు, రాణి పాలనలో, స్వతంత్ర భారతదేశంలో చాలా విద్యా విధానాలు రూపొందాయి. కొన్ని ప్రత్యేక కమిషన్లు- సర్వేపల్లి రాధాకృష్ణన్ కమిషన్, మహిళా విద్యా కమిషన్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కమిషన్, మరో రెండు మహిళా విద్యా కమిషన్‌లు వచ్చాయి. హన్సా మెహతా కమిటీ, భక్తవత్సలం కమిటీ, కొఠారీ కమిషన్... ఇవన్నీ, వాటికీ 'నూతన విద్యా విధానం 2020'కీ మధ్య ప్రధాన భేదం ఏమిటి?**

చాలా ఉంది. ఆ విధానాలూ, ఆయా కమిషన్లూ కేవలం విద్యలో ఒక్కొక్క విషయానికీ, దశకీ పరిమితమైనవే. వాటి నివేదికలు ఆ మేరకే ఉన్నాయి. అంతేతప్ప సమగ్రం కావు. రాధాకృష్ణన్ కమిషన్ ఉన్నత విద్యావ్యవస్థకు సంబంధించినంత వరకే పట్టించుకుంది. మొదలియార్ కమిషన్ మాధ్యమిక విద్య గురించి నివేదిక ఇచ్చింది. 'నూతన విద్యా విధానం 2020' వాటికంటే ఎంతో సమగ్రంగా రూపొందింది. సమగ్రం అని ఎందుకు చెప్పవచ్చునంటే– ఈ విధాన రూపకర్తలు మొట్టమొదటే ఒకటి మనసులో పెట్టుకున్నారు. అన్ని ప్రాంతాలకు, అన్ని భాషలకు, మనకు అందుబాటులో ఉండే అనేక విద్యా విషయాలు, పాఠ్యాంశాలు, మన ప్రాచీన పరంపరలకు ప్రాతినిధ్యం వహించే, భారతీయ చింతన ఆధారంగా ఒక సమగ్రమైన విద్యా విధానం రావాలని ఆదిలోనే సంకల్పించుకున్నారు. అందుకే కొత్త విద్యావిధానం రాబోతున్నదని 2015 జనవరిలో ప్రకటించగానే విస్తృత చర్చ జరిగింది.

**విధాన రూపకల్పనలో ఎవరెవరు భాగస్వాములయ్యారు?**

ఈ ప్రస్థానంలో ఎంతెంత మందిని సంప్రదించారు అని ప్రశ్నించుకుంటే – మామూలుగా చెబుతారన్నమాట. రెండున్నర లక్షల గ్రామాల నుంచి సూచనలు పంపించారు. అంటే మామూలు వ్యక్తులు కూడా భాగస్వాములయ్యారు. 650 పైగా జిల్లాలు ఇందులో ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. అనేక సంస్థలూ భాగం పంచుకున్నాయి. ఈ మథనం ఎన్నాళ్లు జరిగింది? సుమారు 5 సంవత్సరాలు.

# మన వి

2015 జనవరిలో కొత్త విధానం గురించి ప్రకటించారు. విధానం సిద్ధమై, ఆమోదం పొందిన జూలై 29, 2020 వరకు సంప్రదింపుల ప్రక్రియ సాగింది. బహుశా భారతీయ విద్యారంగ చరిత్రలో ఇంత సమగ్రంగా, ఇందరి ప్రాతినిధ్యంతో ఉన్న విద్యా విధానం ఇంతవరకు తయారు కాలేదనే చెప్పుకోవాలి.

**కొత్త విద్యావిధానంలో బోధన అనే అంశంలో మౌలికంగా కనిపించే మార్పు ఏమిటి?**

దీనికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ముఖ్యంగా విద్యని పిల్లలకి చేర్చే పద్ధతుల్లో పెద్ద మార్పు తీసుకువచ్చారు. అంటే, మనం అమలు చేస్తున్న విద్యాబోధన విధానాన్ని మార్చారు. ఇంతవరకు ఉన్న పద్ధతి ఏమిటి? సర్వశిక్షపైన దృష్టి పెట్టాం. ఇప్పుడు

బోధనలకు కొత్త విధానం ప్రాధాన్యం ఇచ్చింది. నాలుగేళ్ల ఉపాధ్యాయ శిక్షణతో ఉపాధ్యాయ వ్యవస్థకు కొత్త రూపును సంతరింపచేసింది. ఇక ఉపాధ్యాయునిగా జీవించాలని కోరేవారే ఆ ఉద్యోగానికి వస్తారు.

పుస్తకాల బరువు తగ్గించి, నేర్చుకునే సామర్థ్యాన్ని ఈ విధానం పెంచబోతున్నది. ఈశాన్య రాష్ట్రాల వారు సహా, దేశం మొత్తం మీద రెండు లక్షల గ్రామాల వారు ఈ విధానంలో భాగస్వాములయ్యారు. ఎన్నో సంస్థలు సలహాలు ఇచ్చాయి. ఈ దేశంలోని 40 కోట్ల మంది విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన విధానమిది. కోటిన్నర ఉపాధ్యాయులు దీనిని అమలు చేయబోతున్నారు. ఈ విధాన రూపకల్పనలో కీలక పాత్ర వహించిన విద్యాభారతి జాతీయ అధ్యక్షులు దూసి రామకృష్ణ కొత్త విద్యా విధానం గురించి జాగృతికి ఇచ్చిన ముఖాముఖిలోని కొన్ని అంశాలు:



# ద్యకు శ్రీకారం

సమగ్రశిక్షపైన దృష్టి పెట్టాలన్న యోచన ఉంది. ఈ సర్వశిక్ష అభియాన్‌లన్నీ అందుకే వచ్చాయి. అంటే అందరిని అక్షరాస్యులను చేయాలనే కాన్సెప్ట్‌తో వెళ్లారు. దాని పర్యవసానాలను పరిగణన లోనికి తీసుకుని ఈ మార్పు చేశారు. మొత్తంగా చూస్తే ఒక పరిపూర్ణ వికసిత వ్యక్తిత్వం గురించి కొత్త విద్యా విధానం ప్రతిపాదించింది. ఇంతకు ముందు వ్యక్తిత్వ వికాసానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు తగినంత ఇచ్చారు. దానికోసమే ప్రక్రియలన్నిటికీ కూడా, గతివిధులు, చర్యలకీ, పాఠశాలలో జరిగే కార్యక్రమాలన్నిటికీ ఒక సమగ్రత తీసుకొచ్చారు. అంటే, ఇంతవరకు ఉన్న కర్రికులర్, కో కర్రికులర్, ఎక్స్‌ట్రా కర్రికులర్ లాంటి పదాలు ఇప్పుడు లేవు. ఎందుకంటే అన్నీ కర్రికులరే (విద్యా విషయికాలే). ఆడినా, పాడినా, గెంతినా, ఏదైనా మాట్లాడినా, విన్నా – అన్నీ కూడా పాఠ్యప్రణాళికలో భాగమే. జ్ఞానార్జన ప్రక్రియలో ఇక ప్రతిదీ భాగమే. తర్వాత రెండు పదాలను రూపకర్తలు పదే పదే ప్రయోగించారు. ఒకటి క్వాలిటీ ఎడ్యుకేషన్, రెండు క్వాలిటీ యాక్సెస్. అసలు కొత్త విద్యావిధానానికి యాక్సెస్ (అందుబాటు), ఈక్వాలిటీ (సమానత్వం), క్వాలిటీ (నాణ్యమైనది), అకౌంట్‌బిలిటీ (జవాబుదారీతనం) అనేవి మూల స్తంభాలుగా ఉన్నాయి. 'క్వాలిటీ క్వాలిటీ' అని పదేపదే చెప్పడంతో మొత్తం ప్రపంచమంతా దీనివైపు దృష్టిపెట్టింది. మొదటిసారిగా మన విద్యావిధానాన్ని ప్రపంచంలో అందరూ మెచ్చుకునే వాతావరణం వచ్చింది. ఇంతకుముందు కంటెంట్ పైన దృష్టి ఎక్కువ. ఇప్పుడు కాంపిటెన్సీ పైన దృష్టి ఎక్కువ. సామర్థ్యాన్ని వికసింపచేయడమే ప్రధానం. నేర్చుకోవడానికి కావలసింది అదే. అందుకే ఏం చేశారు? చిన్న చిన్న మాడ్యూల్స్ (విభాగాలు) తయారు చేసుకొని, దాని ఆధారంగా నేర్పే పద్ధతికి నాంది పలికారు. దీంట్లో ఇంకొక విశేషం ఉంది. గతం పునాదిగా, భవిష్యత్‌కు బాట వేసుకోవడానికి ఈ వర్తమానంలో చేసే ప్రయోగాలు కీలకంగా ఉంటాయి. అందుకే కొత్తకొత్త పదాలు వచ్చాయి. జ్ఞానార్జన ప్రక్రియకు అనుభవమే ప్రధానమవుతుంది. చిన్న అయినా పెద్ద అయినా అందరూ అనుభవించి నేర్చుకోవాలి. ఒక విధంగా ఇది లైఫ్ ఛేంజింగ్, మైండ్ క్రాఫ్టింగ్.



**వ్యక్తి నిర్మాణం అనే కీలక అంశాన్ని ఈ విధానం ఎలా స్వీకరించింది?**

వ్యక్తి నిర్మాణానికి అవకాశం కల్పించే విద్య అంటూ మనం ఎన్నాళ్లుగానో గోల పెట్టాం! అలాంటి వ్యక్తి నిర్మాణమే కేంద్ర బిందువుగా ఉన్న విద్యా విధానం ఈ రోజు వచ్చింది. ఇంతవరకు భారతీయమైన లక్షణాలు, సంస్కృతిని ప్రతిబింబించే విద్యా విధానం లేదు. అది ఇందులో వివిధ రూపాలతో కనిపించింది. భారతీయ శిక్షణ పద్ధతులకు స్థానం కల్పించింది. భారతీయ సంస్కృతికి ప్రాధాన్యమిచ్చింది. భారతీయ దర్శనం– ఫిలాసఫికల్ ఫౌండేషన్స్‌కు చోటు కల్పించారు. భారతీయ మనోవిజ్ఞానాన్ని కూడా మొదటిసారి పరిచయం చేశారు. మన సామాజిక పునాదులు ప్రత్యేకమైనవి. ఇంతవరకు జరిగినది అనుకరణ. కానీ మన వ్యవస్థ ప్రత్యేకమని చెప్పి, దానిపైన కూడా ఆలోచన మొదలుపెట్టి, ఆ ఆలోచనను ఆచరణలో పెట్టే పని అద్భుతంగా జరుగుతున్నది. అలాగే విద్య అందరికి అందుబాటులో ఉండేటట్టుగా, తరతమ భేదాలు లేకుండా అందరూ ఒకేచోట ఉండేటట్టుగా, డ్రాపౌట్స్‌ను

తగ్గించుకుంటూ, విద్యార్థి సామర్థ్యాన్ని పెంచుకుంటూ ముందుకు తీసుకెళ్లే పద్ధతి ఇది.

**సమాజాన్నీ, పాఠశాలనీ కొత్త విద్యావిధానం ఎలా అనుసంధానం చేస్తుంది?**

పాఠశాల అంటే ఏమిటి? సామాజిక పరివర్తనకు అదొక కేంద్రం. అది సమాజంలో విడిగా ఉండే ఒంటి స్తంభం మేడ కాదు. అలాగే సమాజానికి సుదూరంగా ఉండే ద్వీపం కాదు. బడి అంటే సమాజంలో భాగంగా ఉంటూ, సమాజాన్ని తన



మోదీ

దగ్గరకు తీసుకొంటూ, సమాజంలో మార్పునకు కృషి చేసే విస్తృత వ్యవస్థ అని మొదటి నుంచి మనదైన భావనలో ఉంది. దానికి ప్రాణప్రతిష్ఠ చేసి, పునరుద్ధరించే పని ఇందులో చేశాం. అసలు విద్యాభారతిలో ఇలాంటి ప్రయత్నం చిరకాలంగా సాగుతున్నది కూడా. ఇది స్వాగతించదగ్గది, సంతోషించదగ్గది. ఒక పెద్ద పాఠశాల అంటే 5, 6 దశలలో విద్యాలయాలకు నెలవై ఉండాలి. అందులో సెకండరీ స్కూల్స్ ఉండాలి, మిడిల్ స్కూల్స్ ఉండాలి. మధ్యలో ఉండే ప్రిపరిటరీ స్కూల్స్ ఉండాలి. అంతకంటే కింద ఉండే ఫౌండేషన్ లెవల్ క్లాసెస్ ఉండాలి. అలా ఉండే నాలుగైదు పాఠశాలలు తీసుకుని, వాటి వికాసం కోసం ఇక్కడ ఉన్న వనరులలో భాగస్వామ్యం ఇవ్వాలి. వనరులు రెండు రకాలు. మానవ సంపాదన, భౌతిక సంపాదన. వీటితో కార్యక్రమాలు, ప్రశిక్షణ ఇవన్నీ ఆలోచించాలనే కాన్సెప్ట్ మనం ఇచ్చాం. దానిపైన వ్యాసాలన్నీ రాసి అందజేశాం. కాబట్టి అలాంటి ఆలోచనకు ఈ రోజున ఒక చోటు దొరికింది. ఈ విద్యావిధానం లోనే నాలుగు రకాలైన పదాలున్నాయి. ఒకటి: సింపుల్ ఛేంజ్, రెండు: రిఫార్మ్, మూడు: మోడిఫికేషన్, నాలుగు: ట్రాన్స్‌ఫర్మేషన్. ఒక చిన్న మార్పు, ఒక చిన్న సంస్కరణ, చిన్న రూపాంతరం



అనే పరిధులకు పరిమితం కాకుండా, ఆమూలాగ్ర పరివర్తన దిశగా వెళ్లే కొత్త విద్యావిధానమిది.

**ఉపాధ్యాయుడు లేదా ఆచార్యుడు... వీరిని కొత్త విద్యావిధానం ఎలాంటి స్థానంలో ఉంచుతుంది?**

ఆచార్యుడే కదా మొత్తం విద్యా వ్యవస్థకి మూలస్తంభం వంటివారు! ఒకవిధంగా చెప్పుకోవాలంటే ఫ్రంట్‌లైన్ వారియర్. మొదటి పంక్తిలో నిలబడిన యోధుడు. ఇంత పెద్ద విధానాన్ని అమలు చేయాల్సింది ఆయనే. కాబట్టి ఉపాధ్యాయ శిక్షణ మీద నిశిత దృష్టి పెట్టాలి. మొత్తం మన దేశంలో

## గతం అయోమయం

**1960 సంవత్సరానికి కల్లా అందరికీ ఒకే ప్రాథమిక విద్య అన్న లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించారు. తరువాత 1964లో డీఎస్ కొఠారి కమిషన్ వచ్చింది. విద్యారంగంలో జాతీయ విధానం ఉండాలని ఈ కమిటీ సలహా ఇచ్చింది. ఆ ప్రకారమే మొదటి జాతీయ విద్యావిధానం 1968లో వచ్చింది.**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినది మొదలు మెకాలే విద్యా విధానం మీద విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. కానీ దానిని మార్చే ప్రయత్నం జరగలేదు. నిజానికి ఆ విద్యావిధానమే కొనసాగాలని కొన్ని పార్టీలు, వాటిని ఆశ్రయించిన మేధావులు, విద్యావేత్తలు కూడా భావించడం ఇందుకు కారణం. కానీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ/ఎన్‌డీఏ ప్రభుత్వం దేశ భవిష్యత్తును నిర్దేశించే ఈ రంగాన్ని సరిదిద్దడానికి శ్రీకారం చుట్టింది. మన పురాతన సంస్కృతిలో ఉన్న విద్యా విధానం వేరు. ముస్లిం పాలనలో రుద్దిన విద్య వేరు. ఇప్పుడు మనం



మెకాలే

అనుసరిస్తున్న విద్యావిధానానికి పునాదులు బ్రిటిష్ జాతి వేసినవే. భారతీయను మినహాయించిన ఈ విద్యావిధానాన్ని సమూలంగా మార్చడానికి ప్రయత్నం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో మూడు వందల ఏళ్లుగా భారతదేశంలో ఇంగ్లిష్, క్రైస్తవ మత వ్యాప్తి ఆధారంగా జరిగిన విద్యా సంస్కరణల గురించి కొంచెం తెలుసుకోవాలి. మనదైన విద్యను, వృత్తులను నిర్మూలించిన ఘనత మిషనరీలదే.

ఈస్టిండియా కంపెనీ పాలనలో వచ్చిన చార్టర్ 1698 ప్రకారం మిషనరీలు తమ మత ప్రచారంతో పాటు విద్యను కూడా అందించాలి. కానీ మత పరంగా తటస్థంగా ఉండడం రాజకీయంగా చాలా అవసరమని భావించి ఈ చార్టర్ అమలుకు కంపెనీ పట్టుపట్టేది కాదు. పైగా కంపెనీయే పాఠశాలలు ప్రారంభించింది. మొదటి గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ కాలంలో దేశంలో విద్యా బోధన సంస్కృతంలో జరగాలని కొందరు, పర్షియన్‌లో జరగాలని కొందరు వాదించారు. ఆంగ్లేయులు, వారి అభిమానులు మాత్రం ఇంగ్లిష్ మాధ్యమంగా జరగాలని కోరారు. ఈ వాదోపవాదాలలో ఒక ముఖ్య అంశం మరుగున పడింది. అది–మాతృభాషలో విద్యాబోధన. ఆ లోపమే ఇప్పటికీ కొనసాగుతున్నదన్న విమర్శ ఉంది. రాజా రామ్మోహన్ రాయ్ వంటి సంస్కర్తలు దేశానికి ఆధునిక విద్య అవసరమని వాదించారు. ఇంగ్లిష్ విద్యతో భారతీయ సమాజం పునరుజ్జీవనం దిశగా ప్రయాణిస్తుందని భావించారు. ఆ నేపథ్యంలోనే 1823లో ప్రభుత్వ సలహాల కమిటీని నియమించారు. కొత్త విద్యావిధానం గురించి సిఫారసు చేయడమే దీని పని. ఈ కమిటీ అధ్యక్ష హోదాలోనే టీబీ మెకాలే భారతదేశం వచ్చాడు. ఇంగ్లిష్ విద్యకు ఓటేశాడు. విజ్ఞానార్జనకు భారతీయ భాషలు చాలవని తేల్చి చెప్పేశాడు. అంతేకాదు, అరబిక్, సంస్కృతాలను కూడా పక్కన పెట్టమన్నాడు.



1.5 కోట్ల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అంత మంది గురువులను కలిగిన దేశాలు ప్రపంచంలో లేవు. ఇంత పెద్ద అధ్యాపక శక్తిని మనం సరిగా ఉపయోగించినట్లయితే ఎంత పెద్ద మార్పు వస్తుందో ఊహించలేం. కానీ ఇంతవరకు.. ఉపాధ్యాయ శిక్షణ మీద సరైన దృష్టి పెట్టలేదు. ఆ కారణంగా ఇన్ సర్వీస్ ట్రైనింగ్, ప్రీ సర్వీస్ ట్రైనింగ్; ఈ రెండూ పెద్దగా విజయవంతం కాలేదు. విద్య వ్యాపారం అయిపోతున్నది, కమర్షియల్‌గా ఆలోచిస్తున్నారు అనే దానికి టీచర్ ఎడ్యుకేషన్ కూడా ఒక తార్కాణం.

ఇప్పుడు మనం ప్రతిపాదించింది– సమగ్ర బోధకుడు. ఉపాధ్యాయ శిక్షణ నాలుగేళ్లు ఉండాలి. ఎందుకు? ఎవరైతే టీచర్ కావాలని అనుకుంటాడో అతనే టీచర్ అవ్వాలి. అంతేకాదు. ఆ శిక్షణ కాలంలో 9 నెలలు ఇంటెర్న్‌షిప్ ఉండాలి. అది కూడా 'మెంటర్' పర్యవేక్షణలో ఉండాలి. అనుభవజ్ఞులైన టీచర్ల ద్వారా ఆ మెంటర్‌షిప్ లభించాలి. లేకపోతే ఏమౌతుంది? బోధన అవసరమైనంత పటిష్టంగా ఉండదు. ఇక ఉపాధ్యాయులు చెప్పకపోవటం ఒకటైతే, కోర్సు మెటీరియల్ కూడా అలాగే ఉండటం కూడా ఈ పరిస్థితికి కారణం. వ్యవస్థలో ఉండే బలహీనతలు ఒకవైపు, నేర్పే ఆచార్యుల్లో బలహీనతలు మరొకవైపు. వీటన్నిటిని అధిగమించడానికి 4 సంవత్సరాల శిక్షణ అనివార్యమవుతుంది. అది సమగ్రంగా ఉంటుంది. 1.5 కోట్లు ఉన్న మన ఉపాధ్యాయులకు రెండు రకాలుగా తర్ఫీదు ఉండాలి. ఒకటి Continuous Professional Development. ఇవాళ వాళ్లకేదో చెప్పి వదిలేయటం కాదు. వారి వ్యక్తిగత ప్రగతి మానిటర్ చేయడానికి ఒక వ్యవస్థ ఉండాలి. అందుకే ఇలా చెప్పారు– Every Teacher must be made Accountable, Answerable, Responsible. ఈ మూటింటి గురించి ఆరా తీయకపోతే కుదరదు. అతని ప్రగతిని మానిటర్ చేయడం కోసం, తాహతను పెంచేందుకు Continuous Professional Development కోసం మాడ్యుల్స్ అని ఇప్పుడు తయారవుతున్నాయి. దానివల్ల మార్పు వస్తుంది. ఇదొక నిరంతర ప్రక్రియ. కొంతకాలం తర్వాత ఈ విధానం అమలులోకి వచ్చాక సంగతి. టీచర్స్ అందరికి పరీక్ష పెడతారు. వారిలో కనీస సామర్థ్యం ఉన్నదా? లేదా? వ్యక్తిత్వాలు ఎలా ఉన్నాయి ఇవన్నీ చూస్తారు. ఫలితాన్ని బట్టి కొంతమందిని తప్పకుండా ఎలిమినేట్ చేస్తారు.

**జనాభాలో మనది ప్రపంచంలోనే రెండో స్థానం. ఆ మేరకు విద్యార్థి జనాభా కూడా ఉంటుంది. అంటే రేపటి జాతి సంపద. కాబట్టి సంఖ్యను బట్టి అయినా గురుశిష్య బంధాన్ని కొత్త కోణం నుంచి చూడాలి. కొత్త విద్యావిధానం దాని గురించి ఏం చెబుతున్నది?**

మన విద్యా వ్యవస్థలో మొత్తం 40 కోట్ల మందికి పైగా విద్యార్థులున్నారు. అందులో 29 కోట్ల మంది సెకండరీ ఎడ్యుకేషన్‌వారే. అంగన్‌వాడీలలో 7 కోట్ల మంది ఉన్నారు. 4 కోట్ల మంది హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ఉన్నారు. వీళ్లు 4.5 కోట్లు ఉంటారన్నా ఆశ్చర్యం లేదు. ఇందులో చదువు పూర్తి చేసుకున్న వారు, ఇతరత్రా వ్యాపకాలలోకి వెళ్లిన వారు..అంటే విద్యాలయాలు వీడి వెళ్లిన వారు 2 కోట్ల మంది విద్యార్థులు ఉంటారని అనుకుందాం.



ఇందిర



రాజీవ్

తరువాత చాల్స్ ఉడ్ నాయకత్వంలో ఒక కమిటీ ఏర్పడింది. భారతదేశంలో విద్యా సంస్కరణలు తేవడం ఈ కమిటీ విధి. వంద పేరాలతో ఇతడు రూపొందించిన నివేదికను 'మాగ్నాకార్టా ఆఫ్ ఇంగ్లిష్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' అన్నారు. ఐరోపా కళలు, సాహిత్యం, తత్త్వశాస్త్రం భారతదేశంలో బోధనాంశాలను చేసింది ఈ నివేదికే. ఎవరైనా కోరితే ఇంగ్లిష్, భారతీయ భాషలను కూడా చెప్పవచ్చు. 1857లో విశ్వవిద్యాలయాల ఏర్పాటు చట్టం వచ్చి మూడు విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయి. మళ్లీ 1944లో జాన్ సార్జెంట్ నాయకత్వంలో విద్యా విధాన రూపకల్పనకు ఒక కమిటీ వచ్చింది. కానీ రెండో ప్రపంచ యుద్ధం, భారత్ నుంచి బ్రిటిష్ జాతి నిష్క్రమించడం వంటి కారణాలతో దీనిని సరిగ్గా అమలు చేయలేదు.

స్వతంత్ర భారతదేశంలో చాలా కాలం తరువాత గాని విద్యా విధాన రూపకల్పనకు ప్రయత్నం జరగలేదు. తరువాత సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ రెండు సంఘాలను నియమించాలని నిర్ణయించింది. ఒకటి విశ్వవిద్యాలయ విద్య గురించి, రెండు సెకండరీ విద్య గురించి. స్వరాజ్య సమరం సమయంలో తీసుకున్న నిర్ణయాలు, రాజ్యాంగ పరిషత్ ఆశయాల మేరకు ఆ రెండు సంఘాలను నియమించారు. 1948లో నియమించిన విశ్వవిద్యాలయాల కమిషన్ విద్య కోసం ఏర్పాటు చేసుకున్న కమిషన్ ఇదే. దీనికి సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షులు. 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత విద్య ఉమ్మడి జాబితాలోకి వచ్చింది. 1952లో సెకండరీ విద్యా కమిషన్‌ను నియమించారు. దీనికి డా. లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షుడు. బహుళ ప్రయోజనాలు సాధించే విధంగా ఉన్నత పాఠశాలలు ఉండాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. 1960 సంవత్సరానికి కల్లా అందరికీ ఒకే ప్రాథమిక విద్య అన్న లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించారు. తరువాత 1964లో డీఎస్ కొఠారి కమిషన్ వచ్చింది. విద్యారంగంలో జాతీయ విధానం ఉండాలని ఈ కమిటీ సలహా ఇచ్చింది. ఆ ప్రకారమే మొదటి జాతీయ విద్యావిధానం 1968లో వచ్చింది. త్రిభాషా సూత్రం దీనితోనే వచ్చింది. 14 ఏళ్ల వరకు బాలబాలికలకు నిర్బంధ విద్యను కూడా ఇది ప్రతిపాదించింది. 1979లో డ్రాఫ్ట్ నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్, 1986లో మరొక జాతీయ విద్యా విధానం వచ్చింది. దీనికి మెరుగులు పెడుతూ వచ్చినదే 1996 నాటి విద్యావిధానం. ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాల కల్పనకు వచ్చినది ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్ (1987). అందరికీ ప్రాథమిక విద్య అన్న ధ్యేయంతో 2000–2001 సంవత్సరంలో సర్వశిక్ష అభియాన్ విధానం వచ్చింది. ★



**మాతృభాషలో విద్యాబోధన శాస్త్రీయమైన పద్ధతిని ఎంతమంది నిపుణులు చెబుతున్నా వ్యవస్థకు తలకెక్కడం లేదు. కొన్ని రాష్ట్రాలు ఆంగ్ల మాధ్యమమే ఉండాలని మంకుపట్టు పడుతున్నాయి. మాతృ భాషలో బోధన అనేది కనీసం ప్రాథమిక స్థాయిలో అయినా ఉండాలని కోరుకుంటున్న వాళ్లు తక్కువేమీ కాదు. దీని గురించి కొత్త విద్యావిధానం ఏం చెప్పింది?**

ప్రాథమిక విద్య వరకే కాదు, అసలు 8వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరగాలన్న వాదనే మాది. నేనూ అదే చెప్పా. కానీ దురదృష్టం ఏమిటీ అంటే, మన వ్యవస్థలో విద్య ఉమ్మడి జాబితాలో ఉండిపోయింది. కొన్ని రాష్ట్రాలు వాళ్ల స్వేచ్ఛను అనుసరించి, ఇతర కారణాలతోను ఇంగ్లిష్ మీడియం అంటున్నారు. వాళ్లకి థియరీ తెలియక కాదు. పాపులారిటీ కోసం ఆలోచిస్తుంటారు. నిజానికి ఇప్పుడున్న విద్యా వ్యవస్థను నిర్వహించే వారంతా ఐఏఎస్ అధికారులే. మాతృభాష, దాని ప్రాధాన్యం, అందులో బోధన వంటి అంశాలలో ఇమిడి ఉన్న తాత్త్వికత ఏదీ వాళ్లకి తెలియదు. ఇంగ్లీషు మీడియం తప్ప మరేదీ తెలియక దాని వైపు మోజు చూపించి, వ్యవస్థను కూడా మభ్యపెడుతున్నారు. అయినా కూడా మాతృభాషలో బోధన అన్న అంశాన్ని కొన్ని రాష్ట్రాలయినా సానుకూల దృక్పథంతో ఉంటాయి. ప్రయోజనం పొందే యత్నం చేస్తాయి. ఉదాహరణకు ఒరిస్సా, బిహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ ఆ బాటలో ఉన్నాయి. కర్ణాటక కూడా ప్రయత్నిస్తున్నా, వాళ్లు ఇంగ్లీషు మీడియంకి వచ్చేశారు. ఇంకొక విషయం ఇది రికమెండరీయే గానీ, మేండేటరీ కాదు. అయినా మాతృభాషలో బోధన అన్న అంశాన్ని సానుకూలంగా కొందరైనా ఎందుకు తీసుకుంటున్నారంటే, భారతీయ భాషల మీద వెలుగు ప్రసరింప చేయడానికి ఇదొక పెద్ద అవకాశం. ఉదాహరణకు, ఈశాన్య భారత రాష్ట్రాలు. నేను పర్యటించినప్పుడు తెలిసింది, అక్కడ 180 భాషలున్నాయి. స్థానికంగా మాట్లాడే భాషలే అవన్నీ. వాటిని నిలబెట్టుకోవడానికి, వాళ్ల భాషల్లోనే వాళ్లకు పాఠాలు చెప్పుకోవడానికి అవకాశం వచ్చింది. స్థానికంగా ఉన్నవారికే ఉపాధ్యాయులుగా తర్ఫీదు ఇస్తున్నారు. ఒక విధంగా ఆ భాషలకు పునర్ వైభవం వస్తుంది. దానితో పాటు ఇంతకాలం లేని లిపిని రూపొందించే అవకాశం కూడా వచ్చింది. కాబట్టి ఇది ఈశాన్య భారతానికి లబ్ధి చేకూరుస్తున్నది. అలాగే దేశంలోని ఇతర గిరిజన ప్రాంతాలకు కూడా ఇలాంటి లబ్ధి చేకూరుతుంది. వాళ్ల వాళ్ల భాషలు పునరుద్ధరించు కునేందుకు ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించు కోవడానికి, భాషలు నేర్వడానికి అక్కడి వారు సిద్ధంగా ఉన్నారు. ఇది కూడా ఈశాన్య భారతంలోనే కనిపించింది కూడా. అక్కడ పెద్ద భాషా సదస్సు జరిగింది. సిక్కింతో పాటు, ఏడు ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు వచ్చారు. విద్యాశాఖ మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. లాంగ్వేజ్ ఎడ్యుకేషన్‌కి సంబంధించి ఏ ప్రయోగం చేయడానికైనా ఈశాన్య భారతమే ప్రయోగశాలగా ఉపయోగపడాలని వారు కోరడం విశేషం. దీనివల్ల ఏ మాత్రం మంచి జరుగుతుంది? అనడం కంటే కూడా ఒకటి జరుగుతుందని ఆశించవచ్చు. భారతీయ భాషలకు ప్రాధాన్యం పెరుగుతుంది. అంతవరకు చెప్పగలుగుతాను.

అయినా 38 కోట్ల మంది విద్యార్థులు మన బడులలో ఎప్పుడూ చదువుతూనే ఉంటారు. వీళ్లకి ఎంతమంది టీచర్స్ కావాలి? అందుకనే నూతన విద్యావిధానం నివేదికలో ‘ నో టీచర్.. నో క్లాస్’ శీర్షికతో ఓ అంశం విడుదల చేశారు. దాంట్లో 10 పాయింట్స్ ఇచ్చారు. అద్భుతంగా ఉన్నాయి. టీచర్స్ స్వయం ప్రతిపత్తికి సంబంధించిన విషయాలూ ఉన్నాయి. ఉపాధ్యాయుడి పని, సామర్థ్యానికి సంబంధించి ఉన్నాయి. కాబట్టి భారతదేశంలో వచ్చే దశాబ్ది ఉపాధ్యాయుల దశాబ్ది కావాలి(Next decade should be the decade of Teacher’s). అప్పుడే కొత్త విద్యావిధానం అమలు చేయడం సాధ్యం అవుతుంది. ఇందుకోసమని చెప్పి National proficiency Test for Teachers అని నిర్వహించాలి. దీనికోసం సచ్ఛీలురుగా పేరున్న విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రముఖులను మెంటార్స్‌గా ఉపయోగించి ఉపాధ్యాయులకు కావల్సిన ప్రేరణ, సమాచారం, కావల్సిన సూచనలు ఇస్తే విద్యావ్యవస్థ మెరుగు పడుతుంది.

**అంగన్‌వాడీలలో చదివే పిల్లలను కూడా ప్రధాన స్రవంతి విద్యా వ్యవస్థలోకి తెచ్చామని అన్నారు. అక్కడ**




**ఏడు కోట్ల మంది చదువుతున్నారంటే చిన్న విషయం కాదు. దీనితో కలిగే ప్రయోజనం ఏమిటి?**

కొత్తగా ECCE (Early Childhood Care and Education) వచ్చింది. ఇంతవరకు ఉన్న 13.77 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన స్రవంతి విద్యావ్యవస్థలో భాగం చేశాం. దీనితో ఏం జరిగింది? ఇంతవరకు తిండి పెట్టడం, నిద్ర పుచ్చడం అంటే, అంతా ఆరేళ్ల లోపు పిల్లల మానసిక భౌతిక వికాసానికి సరైన సమయంలో జాగ్రత్త తీసుకోవడం. దానికోసం కూడా ఆలోచించాలి. అది జరగనందువలన ఎంత నష్టం వాటిల్లుతుందో సైంటిఫిక్‌గా గుర్తించి, ఈ అంశాన్ని జోడించారు. కాబట్టి అంగన్‌వాడీలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం వల్ల ఇంకొక 24 లక్షల మంది టీచర్స్ తోడయ్యారు.

**ఎంత అవాంఛనీయమంటే.. 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఒక ఇన్విజిలేటర్ తాగి**

ఇంతవరకూ అన్ని దేశ భాషలకు సమాన గౌరవం అన్న ఆలోచన రాలేదు. నేను మామూలుగా అడిగే వాడిని. నా ప్రశ్నలోని హేతుబద్ధతను నేడు అందరూ ఒప్పుకుంటున్నారు. అదేమిటంటే– దక్షిణాదిన దక్షిణ భారత హిందీ ప్రచారసభ పెట్టారు. ఉత్తర భారతంలో దక్షిణ భారత ప్రచార సభలు ఎందుకు పెట్టలేదు? అలా పెట్టినట్లయితే భారతీయ భాషలన్నింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని అందరి దృష్టికి వస్తుంది.



**పరీక్ష కేంద్రానికి వచ్చాడని ఇటీవల వార్తాపత్రికలలో వచ్చింది. ఉద్యోగం నుంచి తొలగించారు. అలాంటి మనిషిని టీచర్‌గా ఎలా ఆమోదిస్తుంది సమాజం? పిల్లలకి ఎలాంటి సంకేతాలు వెళతాయి?**

ఇప్పటివరకు అమలైన విద్యారంగ పద్ధతుల్లో పెద్ద లోపం–వ్యక్తిని తీర్చిదిద్దేవీ, అందుకుపకరించేవీ అయిన అంశాలపైన దృష్టే పెట్టలేదు. ఇప్పుడు విద్యావ్యవస్థ మారింది. కానీ మార్పులో భాగస్వాము లయిన వాళ్లందరికీ ఆ మార్పు గురించి పూర్తిగా తెలియాలని లేదు. మొన్న అక్టోబర్ 5న యునెస్కో నివేదిక వచ్చింది. దాని ప్రకారంగా చూసినట్లయితే సుమారు 25% మంది టీచర్స్ అసలు విధులకే వెళ్లటం లేదు. వ్యవస్థలో ఉండే లోపాలు, పాఠ్య ప్రణాళికలో ఉండే లోపాలను పట్టించుకునే వారు లేకపోవడం, అంతా రాజీ పడిపోతున్న కారణంగా ఇవన్నీ తలెత్తుతున్నాయి. ఉపాధ్యాయులకు సాధి కారిత ఉండాలి. వారిని బాధ్యత కలిగి ఉండేటట్లు మలచాలి. మోటివేట్ చేయాలి. అన్నిటికీ మించి ఉపాధ్యాయులను అప్‌డేట్ చేయాలి. ఎందుకంటే ఇవాళ పిల్లల దగ్గర ఉండే సమాచారం టీచర్ దగ్గర కూడా ఉండడం లేదు. కానీ టీచర్ వ్యక్తిత్వం వల్ల ఆయనను గౌరవించి, విద్యార్థి ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు.

**ఇంత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులకు తర్ఫీదు, మోటివేషన్... ఇవన్నీ ఎలా? అందుకు ఉన్న మార్గాలు ఏమిటి?**

నేను మామూలుగా ప్రభుత్వంతో మాట్లాడుతూ చెప్పినదేమిటంటే, తర్ఫీదు కోసం మీ దగ్గర ఏమైనా వ్యవస్థ ఉందా? 1.5 కోట్ల ఉపాధ్యాయులకు మీరు ఎలా శిక్షణ ఇస్తారు? ఈ విషయం కంటే ముందు విద్యాభారతి ఈ విషయంలో ఏం చేస్తున్నదీ చెబుతాను. మా దగ్గర 1.75 లక్షల టీచర్స్ ఉన్నారు. వాళ్లందరికీ శిక్షణ కార్యక్రమం నేను ఏర్పాటు చేస్తున్నాను. ఈరోజు మీరు ఆలోచించే శిక్షణను మేము అప్పుడే మొదలెట్టేశామని ప్రభుత్వానికి చెప్పాం. వ్యక్తి నిర్మాణానికి సంబంధించినంత వరకు 24 అంశాలను మేం తయారు చేసి, దానికి కావలసిన సిలబస్, ఆక్టివిటీస్ అన్నీ డిజైన్ చేశాం. తర్వాత మా డొమైన్ ఒకటున్నది. 7 దశాబ్దాల నుండి మేము ఇసిసిఇ కూడా చేశాం. ఉపాధ్యాయ శిక్షణను నిరంతర ప్రక్రియగా కొనసాగించడానికి గాంధీ ధామ్‌లో మా కేంద్రం ఉంది. అక్కడ ఉపాధ్యాయులు బృందాలుగా వెళ్లి శిక్షణ పొందుతారు. ఢిల్లీలోనూ ఒక కేంద్రం ఉంది. అలాగే రాష్ట్ర స్థాయిలో ప్రతిచోటా కూడా పెద్ద పెద్ద శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. మేమంటే, మాకున్న ప్రత్యేకతలతో ఇవన్నీ ఏర్పాటు చేసుకున్నాం. ఇవన్నీ ఇతరులు చేయాలంటే చాలా కృషి ఉండాలి. సర్కార్ వారు సమగ్రంగా అమలు చేయకుంటే మిగిలిన విధానాల మాదిరిగానే కొత్త విధానం కూడా వృథా ప్రయత్నంగా ఉండిపోతుంది.

**భాషల మధ్య అనుసంధానానికి, పరస్పరం గౌరవించుకోవడానికి కొత్త విద్యా విధానం ఏమైనా అవకాశం కల్పిస్తున్నదా?**

ఇంతవరకూ అన్ని దేశ భాషలకు సమాన గౌరవం అన్న ఆలోచన రాలేదు. నేను మామూలుగా అడిగేవాడిని. నా ప్రశ్నలోని హేతుబద్ధతను నేడు అందరూ ఒప్పుకుంటున్నారు. అదేమిటంటే– దక్షిణాదిన దక్షిణ భారత హిందీ ప్రచారసభ పెట్టారు. ఉత్తర భారతంలో దక్షిణ భారత ప్రచార సభలు ఎందుకు పెట్టలేదు? అలా పెట్టినట్లయితే భారతీయ భాషలన్నింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని అందరి దృష్టికి వస్తుంది. ఇలాంటి పని చేయకుండా అన్ని ప్రభుత్వాలు ఒకే విధంగా తప్పు చేశాయి. కాబట్టి భారతీయ భాషల కోసం ఒక సంఘం.. భారతీయ భాషలన్నింటికి ప్రాధాన్యమిచ్చే పద్ధతుల కోసం ఒక యోజన ఇప్పుడు జరుగుతున్నది. దానివల్ల ఒక భాషా ప్రాంతం వారు ఇంకొక ప్రాంతానికి వెళతారు. అటు నుంచీ, ఇటు నుంచీ వివిధ కార్యక్రమాలు రూపొందుతాయి.

**మాతృభాషలో విద్యాబోధనను వెంటనే ఆశించ వచ్చునా?**

దేశంలో వెంటనే మీడియం మారిపోతుందని నేను అనుకోవట్లేదు. మీడియం మారిపోయి మాతృ భాషలోనే బోధన అంతా జరగాలి అంటే దానికి రాష్ట్రాల సహకారమే ముఖ్యం. దానికంటే ముఖ్యమైనది– తల్లిదండ్రులలో చైతన్యం రావాలి. తల్లిదండ్రుల మద్దతు లేనిదే ఎవరూ ఏం చేయలేరు. కానీ చాలామంది తల్లిదండ్రులు భ్రమల్లో ఉన్నారు. కాబట్టి సమాజాన్ని ఎడ్యుకేట్ చేయనిదే ఈ మార్పు సాధ్యం కాదు. కానీ రావలసి ఉన్న మార్పుకి ఈ ప్రయత్నం ఓ చిన్న అడుగని మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు.

**కొత్త విద్యా విధానం 2020:**

**పిల్లలలో సృజనాత్మకత గురించి ఏం చెప్పింది?**

**వృత్తి విద్యా కోర్సులకు ఎలాంటి స్థానం ఇస్తున్నది?**

**వచ్చేవారం...**





# పండిట్‌లపై కొ

**పచ్చని కశ్మీర్‌లో చిచ్చు పెట్టేందుకు దాయాది దేశం పాకిస్తాన్ శక్తివంచన లేకుండా పనిచేస్తోంది. పాకిస్తాన్ తన నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీస్ ఇంటలిజెన్స్) ద్వారా భూలోక స్వర్గమైన కశ్మీర్‌లో అల్లర్లకు పాల్పడుతోంది. అల్ ఖైదా తదితర ఉగ్రవాద సంస్థలకు అన్నివిధాలా అండగా నిలిచి కశ్మీర్‌లో రంగంలోకి దించుతోంది. పాకిస్తాన్‌లో నాయకత్వ మార్పు జరిగినా దాని బుద్ధి మారలేదు. నిన్న మొన్నటి దాకా ఇస్లామాబాద్ అధికార పీఠంపై కూర్చొన్న ఇమ్రాన్‌ఖాన్ తరహాలోనే కొత్త అధినేత షెహబజ్ షరీఫ్ పైకి శాంతి వచనాలు పలుకుతూ తెరవెనక కుట్రలతో కశ్మీర్‌లో అశాంతికి కారణమవుతున్నారు. ఫలితంగానే గత కొంతకాలంగా కశ్మీర్‌లో మళ్లీ ఉగ్రవాద కార్యకలాపాలు మొదల య్యాయి. కశ్మీరీ పండిట్లపై కాల్పుల మోత మోగుతోంది. కేవలం హిందువులే లక్ష్యంగా ఉగ్రవాదులు దమనకాండకు దిగుతున్నారు. అమాయక పౌరులను తూటాలకు బలి చేస్తున్నారు.**

ఉగ్రవాదుల ఆట కట్టించేందుకు భారత ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. కశ్మీరీ పండిట్లను కాపాడుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిన బూనారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జమ్ముకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, 'రా' (రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) కార్యదర్శి సమంత్ గోయల్, ఇంటలిజెన్స్ బ్యూరో ప్రత్యేక సంచాలకుడు ఏఎస్ రాజన్, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) దిల్‌బాగ్ సింగ్ తదితరులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ఉగ్రవాద కార్యకలాపాలను ఉక్కు పాదంతో అణచివేయాలని సూచించారు. పండిట్లను కాపాడుకోవాలని సూచించారు. అమాయక కశ్మీరీ పండిట్ల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. వారి భద్రతకు ప్రభుత్వం పూచీ వహిస్తుందని తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం సమర్థంగా తిప్పికొట్టిందని ఈ సందర్భంగా అమిత్ షా గుర్తు చేశారు.

గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న అవాంఛనీయ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నా యనడంలో సందేహం లేదు. పండిట్ల వరుస హత్యలు వారిని భయభ్రాంతులను చేస్తున్నాయి. గట్టి నిఘా, పటిష్టమైన భద్రత ఉన్నప్పటికీ ఉగ్రవాదులు రెచ్చి పోతున్నారు. అమాయక ప్రజలను తూటాలకు బలిచేస్తున్నారు. వీటన్నింటికీ తెరవెనక సూత్రధారి దాయాది దేశమన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తాజాగా కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు ఒక బ్యాంకు ఉద్యోగిని కాల్చిచంపారు. మే నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటిదాకా ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్ర మూకలు జరిపిన హత్యాకాండలో ఇది ఎనిమిదోది. మృతుల్లో ముగ్గురు విధుల్లో లేని పోలీసులు కాగా అయిదుగురు స్థానికులు ఉన్నారు. దక్షిణ కశ్మీరులోని ఇలాఖీ దేహాతీ బ్యాంకు మోహనపుర శాఖ మేనేజరు విజయ్‌కుమార్ విధుల్లో ఉండగా దుండగుడు దారుణానికి తెగబడ్డాడు. బ్యాంకు ఆవరణలోకి చొరబడిన ఉగ్రవాది అతి సమీపంలో నుంచి కాల్పులు జరిపాడు. ఈ ఘటన సీసీ టీవీల్లో రికార్డయింది. దాడిలో తీవ్రంగా గాయపడిన విజయ్ కుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించారు. రాజస్తాన్‌లోని హనుమాన్ ఘడ్ విజయ్‌కుమార్ స్వస్థలం. వారం కిందటే ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. కేంద్ర ప్రభుత్వం, జమ్ము కశ్మీర్ పాలన యంత్రాంగం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంయుక్త అజమాయిషీలో ఈ బ్యాంకు పనిచేస్తుంది. అనంతనాగ్ జిల్లాలోని కోకర్‌నాగ్ శాఖ నుంచి విజయ్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు గత ఫిబ్రవరిలోనే వివాహమైంది.

మే 31న సాంబ జిల్లాలో రజనీ బాల అనే టీచరును ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. మే 12న బద్గాం జిల్లాలో రాహుల్ భట్ అనే ఉద్యోగిని కాల్చిచంపారు. అంతకుముందు శోపియాన్ జిల్లాలో జవాన్లు ప్రయాణిస్తున్న వాహనంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు జవాన్లను ఆస్పత్రికి తరలించగా వారు కోలుకుంటున్నారు. ఇది గ్రనేడ్ దాడా లేక బ్యాటరీ పేలిందా? అనే విషయమై ఆరా తీస్తున్నట్లు కశ్మీర్ జోన్ ఇన్స్పెక్టర్ జనరల్ విజయ్ కుమార్ తెలిపారు.

**విపక్షాల రాజకీయం**

సహజంగా ఈ ఘటనను రాజకీయాలకు





ఉగ్రవాది కాల్పుల్లో మృతి చెందిన బ్యాంక్ ఉద్యోగి విజయ్‌కుమార్

గోపరాజు విశ్వేశ్వరప్రసాద్




అతీతంగా ఎవరైనా ఖండిస్తారు. కానీ వందేళ్లకు పైగా చరిత్ర గల కాంగ్రెస్ వంకర బుద్ధితో మాట్లాడింది. దీనిని శాంతిసాధనలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ పేర్కొనడం ఆయన అల్పబుద్ధిని చాటుతోంది. ఇది కేవలం కేంద్రంపై విమర్శ కాదు. కశ్మీరులో శాంతిభద్రతలు కాపాడేం దుకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న జవాన్లను కించపరచడమే అవుతుంది. అమాయక పౌరుల ప్రాణాలు కాపాడేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రవీందర్ శర్మ డిమాండ్ చేయడం విస్తు గొల్పుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిం చేందుకు కేంద్రం అక్కడ పెద్దఎత్తున బలగాలను మోహరించింది. రాష్ట్ర పోలీసులతో పాటు పారా మిలటరీ దళాలు కూడా కశ్మీర్‌లో పనిచేస్తున్నాయి. అలాంటప్పుడు పౌరుల ప్రాణాలు కాపాడేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరడంలో అర్థం లేదు. కాంగ్రెస్ నాయకుడి ప్రకటన ఏదో యథా లాపంగా, మొక్కుబడిగా చేసిన ప్రకటనలా కనపడు తోంది. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, ఆయన తనయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ (పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్) అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఈ ఘటనను ఖండిం చారు. నిజం చెప్పాలంటే వీరి ఖండన మొక్కుబడి చర్య. పరోక్షంగా పాకిస్తాన్‌కు, ఉగ్రవాద సంస్థలకు వీరు మద్దతుగా మాట్లాడుతుంటారు. పాకిస్తాన్‌తో చర్చలు జరపాలని కోరుతుంటారు. అసలు మన దేశంలో అంతర్భాగమైన కశ్మీరుపై ఇంకో దేశంతో చర్చలు జరపాల్సిన అవసరమేమిటో ఎంత ఆలో చించినా ఎవరికీ బోధపడదు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు పోలీసులను విమర్శించడంలో చూపిన దూకుడు ఉగ్రవాదులపై వీరు చూపరు. దానిని తేలిగ్గా తీసుకుంటారు. ఉదాసీనంగా వ్యవహరిస్తారు. పైగా తప్పంతా పోలీసులదేనని తేల్చి చెబుతుంటారు. అందువల్ల కశ్మీరులో అశాంతికి కొంతవరకు వీరే కారణమన్న విమర్శలను తోసిపుచ్చడం కష్టం. ఉగ్రమూకల దాడులను కశ్మీరు లోయలో శాంతి పునరుద్ధరణకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలిగించేందుకు పాక్ పన్నిన కుట్రగా రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రవీందర్ రైనా వ్యాఖ్యానించారు. పండిట్ల హత్యలను అడ్డుకోవాలంటూ అవామీ ఆవాజ్ పార్టీ కార్యకర్తలు రాజధాని శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. పండిట్లకు పటిష్ట భద్రత కల్పించాలని 'పనున్ కశ్మీర్' సంస్థ ఛైర్మన్ అజయ్ చ్రుంగూ, 'ఏక్ జుట్' పార్టీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అంకుర్ శర్మ వేర్వేరు ప్రకటనల్లో కోరారు. ఇందుకు భిన్నంగా కశ్మీరీల ప్రధాన స్రవంతి పార్టీలైన పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఎప్పుడూ కేంద్ర వ్యతిరేక ధోరణిని ప్రదర్శించడం గమనార్హం.


రాహుల్ భట్


టీచర్ రజనీ బాల

కశ్మీరులో చిచ్చుకు ఉగ్రవాద సంస్థలే కారణ మన్నది బహిరంగ రహస్యం. ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఈ విషయం తేటతెల్లం చేస్తోంది. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్ ఖైదా అమాయక యువతను తమ సంస్థలో చేర్చుకుని వారికి శిక్షణ ఇస్తున్నట్లు ఐరాస తాజా నివేదిక హెచ్చరించింది. అల్ ఖైదా ముఠాలో దాదాపు 400 మంది సభ్యులుగా ఉన్నారు. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వారిని రిక్రూట్ చేసుకుంది. వీరికి అఫ్ఘాన్‌లోని హెల్మండ్, ఘజ్ని, కాందహార్, నిమ్రుజ్, జబూల్ తదితర ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు అఫ్ఘాన్‌లో తాలిబన్ పెత్తనం నడుస్తున్నందున వారికి ఎదురులేకుండా పోయింది. ఒక్క అల్ ఖైదానే కాకుండా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలకూ అడ్డే లేకుండా పోయింది. వీటికి వనరులు పుష్కలంగా అందుతున్నాయి. దీంతో అవి కశ్మీరులో చిచ్చు పెట్టేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. అల్ ఖైదా అగ్రనేత జవహరి ఇప్పటికీ క్రియాశీలకంగా ఉంటున్నారు. అమాయక యువతకు ఉగ్రవాదాన్ని నూరిపోస్తున్నారు. భారత్‌పై అదే పనిగా విద్వేషాన్ని వారి మెదళ్లలో నింపు తున్నారు. ఇతను అఫ్ఘాన్ తూర్పు ప్రాంతంలోని జబూల్ ప్రావిన్స్‌లో ఉంటున్నట్లు సమాచారం. 2021 ఆగస్టు నుంచి ఇప్పటివరకు 8 సార్లు వీడియో సందేశాల్లో కనిపించాడు. ఇటీవల కర్ణాటకలో హిజాబ్ వివాదం తలెత్తినప్పుడు ముస్లిం మహిళలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడాడు. ఈ విషయాలను చెప్పింది భారత నిఘా సంస్థలు కాదు. స్వయంగా ఐక్యరాజ్య సమితి 'విశ్లేషణాత్మక ఆధారం, ఆంక్షల కమిటీ' తన 13వ నివేదికలో ఆధారసహితంగా ప్రస్తావించింది.

జమ్ముకశ్మీరుకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే 370 అధికరణం రద్దును పాకిస్తాన్‌తో పాటు ఉగ్రవాద సంస్థలు జీర్ణించుకోలేకపోతున్నాయి. 2019 ఆగస్టు 5న కేంద్రం ఈ అధికరణను రద్దుచేసిన నాటి నుంచి అవి అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. అధికరణ రద్దు అన్నది భారత్ అంతర్గత విషయమన్న వాస్త వాన్ని విస్మరించి పేట్రేగిపోతున్నాయి. దీంతోపాటు నియోజకవర్గాల పునర్విభజనను జీర్ణించుకోలేక పోతున్నాయి. దాని ఫలితమే ఉగ్రవాదదాడులు. అయినా ఈ తాటాకు చప్పుళ్లకు భారత్ బెదరదు. ఉగ్రవాదం పీచమణచేందుకు కృతనిశ్చయంతో ఉంది. ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా కశ్మీరీల మనసు గెలుచుకునేందుకు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఇతర రాష్ట్రాల మాదిరిగా కశ్మీరును ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు గట్టి సంకల్పంతో ఉంది. వెనకటి ప్రభుత్వాల మాదిరిగా కంటితుడుపు చర్యలతో సరిపెట్టకుండా కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు ఎంతమాత్రం వెనకాడబోదు. ఈ దిశగా ప్రభుత్వానికి బాసటగా నిలబడటం విపక్షాల విహిత కర్తవ్యం.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

# రాష్ట్రంలో పాగా వేయ

**భారతీయ జనతాపార్టీ అధిష్ఠానం తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సందర్భం వచ్చినప్పుడల్లా ఆ సందేశం ఇస్తోంది. ఈ కోణంలో నిర్ణయాలు తీసుకుంటోంది, అమలు చేస్తోంది. ఫలితంగా రాష్ట్రంలోని కాషాయ దళంలోనూ ఉత్సాహం పెరిగింది. దీంతో, అధికారపీఠంపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటి నుంచే కృషి చేస్తే వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాదన్న విశ్వాసం పార్టీలో బలపడుతోంది.**



కొద్దిరోజులుగా బీజేపీ అధిష్టానం తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న కార్యక్రమాలు గమనిస్తే రాష్ట్రంలో ఎలాగైనా కాషాయ జెండా ఎగురేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుందన్న భావనలు బలపడుతున్నాయి. తరచూ ఆ పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించడమే కాదు, ఇక్కడి నేతలకు ఢిల్లీలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఇప్పుడు బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు కూడా హైదరాబాద్‌నే వేదికగా ఎంచుకున్నారు. తాజాగా జీహెచ్ఎంసీలో బీజేపీ కార్పొరేటర్లకు, పార్టీ ముఖ్య నాయకులకు మోదీ నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ పరిణామాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

తెలంగాణలో పాగా వేసేదాకా ఈ ఆపరేషన్ కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. భారతీయ జనతా పార్టీలో ముగ్గురు ముఖ్యనేతలు గడిచిన ఒకే నెలలో తెలంగాణలో పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ (జగత్ ప్రకాశ్) నడ్డా వేర్వేరుగా రాష్ట్రంలో పర్యటించారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ రెండో విడత ప్రజా సంగ్రామ పాదయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం గత నెల 5న పాలమూరులో జరిగింది. ఈ సభకు జేపీ నడ్డా హాజరయ్యారు. ఆ తర్వాత మే 14న రంగారెడ్డి జిల్లా తుక్కుగుడలో బండి సంజయ్ ప్రజా సంగ్రామ పాదయాత్ర ముంగిపు సభ నిర్వహించారు. ఆ సభలో అమిత్‌షా పాల్గొన్నారు. ఇక, అదే నెలలో 26న హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరయ్యారు. అధికారిక కార్యక్రమమే అయినా, తాను దిగిన బేగంపేట ఎయిర్‌పోర్టులోనే భారీ స్థాయిలో బహిరంగ సభ నిర్వహించారు. పూర్తిస్థాయి పార్టీ కార్యక్రమంగా ప్రసంగించారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం పైనా, టీఆర్ఎస్ పాలనపైనా నిప్పులు చెరిగారు. ఈ ముగ్గురు నేతలు కూడా తాము పాల్గొన్న సభల్లో ముఖ్యంగా కేసీఆర్‌నే లక్ష్యంగా చేసుకున్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

పార్టీలోని ముగ్గురు ప్రధాన నాయకులు ఒకే నెలలో తెలంగాణలో పర్యటించడమంటే మాటలు కాదు. పైగా.. ప్రతీ సభనూ రాష్ట్ర నేతలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తమ అగ్రనేతల సభలు విజయవంతం అయ్యేలా కృషి చేశారు. హస్తిన నుంచి వచ్చిన అగ్రనేతలు కూడా ఏమాత్రం అంచనాలు తగ్గకుండా అధికారమే లక్ష్యంగా, టీఆర్ఎస్ పాలనను ఎండగట్టారు.

2014 జూన్ రెండో తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ చారిత్రక సంఘటనకు ఎనిమిదేళ్లు నిండాయి. ఇప్పటివరకు ఎప్పుడూ బీజేపీ జాతీయ నాయకత్వం అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించలేదు. కానీ, ఈ ఏడాది మాత్రం దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించింది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నిర్ణయం వెనుక కూడా బీజేపీ తెలంగాణలో ముద్ర వేసుకునే వ్యూహం ఉందని స్పష్టమయింది. ఇలాంటి కార్యక్రమాలు, సభలతో పార్టీ శ్రేణుల్లో ఓవైపు జోష్ నింపుతూనే మరో కీలక నిర్ణయం తీసుకుంది బీజేపీ అధిష్టానం. తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌కు రాజ్యసభ సభ్యునిగా

**పార్టీలోని ముగ్గురు ప్రధాన నాయకులు ఒకే నెలలో తెలంగాణలో పర్యటించడమంటే మాటలు కాదు. పైగా.. ప్రతీ సభనూ రాష్ట్ర నేతలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తమ అగ్రనేతల సభలు విజయవంతం అయ్యేలా కృషి చేశారు. హస్తిన నుంచి వచ్చిన అగ్రనేతలు కూడా ఏమాత్రం అంచ నాలు తగ్గకుండా అధికారమే లక్ష్యంగా, టీఆర్ఎస్ పాలనను ఎండగట్టారు.**

సుజాత గోపగోని, 6302164068



అవకాశం కల్పించింది. ఉత్తరప్రదేశ్ కోటాలో డాక్టర్ లక్ష్మణ్‌ను ఈ అవకాశం వరించింది. ఈ ఎంపిక వెనక కూడా అదే వ్యూహం ఉందంటున్నారు.

ఇక, హైదరాబాద్‌లో మరో భారీ సమావేశానికి కూడా భారతీయ జనతాపార్టీ సిద్ధమయింది. పార్టీకి అతిముఖ్యమైన జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈసారి తెలంగాణలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల అంటే జూలై 2,3 తేదీల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. హైటెక్ సిటీలో ఈ సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా హైదరాబాద్ వస్తారు. రెండు రోజుల పాటు ఇక్కడే బస చేస్తారు. ఈ సభలకు బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులందరూ తరలి రానున్నారు. అంతేకాదు, దేశంలోని 18 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 300 మందికి పైగా కీలక నేతలు పాల్గొంటారు. అంటే, రెండు రోజులపాటు హైదరాబాద్ కాషాయమయం కానుంది. సమావేశాల

# డమే లక్ష్యం

ఏర్పాట్ల కోసం ఇప్పటికే కసరత్తు మొదలయింది.

వాస్తవానికి దక్షిణాదిపై బీజేపీ చాలాకాలం నుంచి దృష్టి పెట్టింది. అయినా, ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఒక్క కర్ణాటకలో మాత్రం అధికారం చేజిక్కించుకుంది. అయితే, అక్కడ కూడా అతితక్కువ మెజారిటీతోనే అధికారాన్ని సొంతం చేసుకుంది. వచ్చే ఏడాది కర్ణాటకలో ఎన్నికలు జరుగుతాయి. అక్కడ ఈసారి కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఉంటుందన్న సంకేతాలు వస్తున్నాయి. కేరళ, తమిళనాడులో మాత్రం బీజేపీకి ఇప్పట్లో అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. కానీ, తెలంగాణలో మాత్రం పార్టీ బలపడుతోంది. దీంతో ఈ రాష్ట్రంపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది. అందుకే అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతూ, ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలుస్తోంది. తెలంగాణలో ఏ చిన్న సందర్భం ఉన్నా బీజేపీ పెద్దలు వాలిపోతున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను ఎండగడుతూ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ప్రజలను ఆకర్షించే పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. 'పోరాడి సాధించుకున్న రాష్ట్రం ఓ కుటుంబం చేతుల్లో బందీగా ఉంది. ఆ కుటుంబం నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడుతాం' అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు.

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే బీజేపీ అధిష్ఠానం తెలంగాణపై దృష్టిపెట్టింది. అయితే, ఈ స్థాయిలో దూకుడుగా వ్యవహరించలేదు. ఆచితూచి పరిస్థితులను అంచనా వేసింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా వెనుకబడి పోయింది. 2014లో బీజేపీకి ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా.. 2018 నాటికి ఆ సంఖ్య ఒక్కరికే పరిమితమయింది. గోషామహల్ నుంచి రాజాసింగ్ ఒక్కరే గెలుపొందారు. ఆ సమయంలో బీజేపీ నైరాశ్యంలో మునిగినప్పటికీ, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా పుంజుకుంది. టీఆర్ఎస్‌కు ఝలక్ ఇచ్చింది. నాలుగు లోక్‌సభ సీట్లను గెలుచుకొని సత్తా చాటింది. 2018లో ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన వాళ్లు మరుసటి సంవత్సరం ఎంపీలుగా గెలిచారు. ఆ విజయం బీజేపీకి టానిక్‌లా పని చేసింది. అప్పటినుంచి అధిష్ఠానం, ఇటు రాష్ట్ర నాయకత్వం దూకుడు పెంచాయి. దుబ్బాక ఉప ఎన్నికలో రఘునందన్ రావు గెలుపొందడం, హుజురాబాద్ ఉప ఎన్నికలో ఈటల రాజేందర్ గెలవడం పార్టీలో ఉత్సాహం నింపాయి. అలాగే, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ అధికార టీఆర్ఎస్‌కు బీజేపీ చుక్కలు చూపించింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీకి తెలంగాణలో పాగా వేస్తామన్న నమ్మకం కుదిరిందని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే అప్పటినుంచీ ఏ చిన్న అవకాశం లభించినా తెలంగాణపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెబుతున్నారు. టీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని చెబుతున్న బీజేపీ.. ఈసారి ఎలాగైనా అధికారం సాధించాలనే కసితో పనిచేస్తోంది. వచ్చే నెలలో జరగనున్న జాతీయ కార్యవర్గ సమావేశాల తర్వాత రాష్ట్రంలో బీజేపీ రాజకీయం మరింత దూకుడుగా ఉంటుందని.. బెంగాల్ తరహా పరిణామాలు కనిపిస్తాయని అంటున్నారు. ఇక, ఇప్పటికే రెండు దఫాలుగా ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో పాదయాత్ర చేసిన పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్.. ఇప్పుడు మూడో దశ ప్రజా సంగ్రామ పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నారు.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**






# ఎస్సీలు, మైనార్టీలు ఒక్కసారి ఆలోచించాలి

**జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా రాకతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. భాజపా ఏపీ శక్తి కేంద్రాల ప్రముఖులతో సమావేశమైన నడ్డా 2024 ఎన్నికలకు రోడ్ మ్యాప్ ఇచ్చారు. పోలింగ్‌బూత్‌లను పటిష్టం చేసుకోవాలని, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విభజన అంశాలు, ప్రత్యేక హోదాపై తెదేపా, వైకాపా చేసిన అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని చెప్పారు. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ వైకాపా ప్రభుత్వం చేస్తున్న అవినీతిపై పోరాటాలు ఉధృతం చేయడం ద్వారా ప్రతిపక్షంగా బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా వారికి దగ్గరవ్వాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో పార్టీని వ్యాప్తి చేయడమే కాక, ప్రతి ఒక్క వర్గాన్ని భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.**

నెల్లూరు జిల్లా అత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నికలో అభ్యర్థిగా పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్ పేరును నడ్డా ప్రకటించారు. ఈ సమావేశంలో ఆయన సూచనల్లో కులం, మతం, ప్రాంతం, వర్గం ఆధారంగా విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి వర్గాన్ని కలుపుకుపోయి విజయం సాధించడం అనే అంశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. భారత రాజకీయాల్లో కులం, మతం ప్రాధాన్యం వహిస్తాయనేది తెలిసిందే. ముస్లింలను, ఎస్సీలను ఓటుబ్యాంకుగా మార్చుకున్న కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు వారి అభివృద్ధికి చేసింది శూన్యం. ఈ వర్గాలకు భాజపా హయాంలోనే మేలు జరిగిందన్నది జగమెరిగిన వాస్తవం. దీనిని ఆయా వర్గాలు కూడా అంగీకరించాలి. కాని ఇంటికే పరిమితం చేయాల్సిన మతాన్ని ఓటుకోసం వాడి ఈ వర్గాలు తమ గొయ్యి తామే తవ్వుకున్నాయి. ఏపీలో ఈ వర్గాల పరిస్థితి చూస్తే ఎవరికైనా జాలి వేస్తుంది. వైకాపా పాలనలో కూలినాలి చేసుకునే ముస్లిం, ఎస్సీ పేదలకు కూడు లేదు. ఇసుక ఆపి, ధరలు పెంచి వారిని దెబ్బ మీద దెబ్బకొట్టారు. కేంద్రం మంజూరు చేసిన గూడును సైతం ఇవ్వక ఎండా, వానల్లో నిలబెట్టారు. ఇది ఈ వర్గాలు గమనించాలి. తమకు మేలు చేస్తున్న భాజపాను ఆదరించాలి. ఉత్తరాదిలో ఈ రకమైన మార్పు రాబట్టే నేడు ఆయా రాష్ట్రాల్లో భాజపా వరుసగా గెలుస్తూ ప్రజలను అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. ఏపీలో కూడా ఈ రకమైన మార్పు రావాలి.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

అందరూ కలిస్తేనే ప్రజలు. కాని ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి లేదు. తెదేపా, వైకాపా ప్రజల్ని కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాల పేరిట రెచ్చగొట్టి విడదీశాయి. వైకాపా హయాంలో అయితే పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యాయి. అన్యమతాలకు ప్రోత్సాహం ఇస్తూ, హిందూమతాన్ని పట్టించుకోవడం లేదు. పైగా అన్యమతస్తులు హిందూమత ధర్మంపై దాడులు చేస్తుంటే చర్యలు తీసుకోవడంలేదు.

ఒక్క వైకాపా అనే కాదు, రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు అభివృద్ధి అనే మాటను పక్కనపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాయి. దాంతో ఫలానా కులాలు, మతాలు ఆయా

పార్టీలకే మద్దతు ఇస్తున్నాయన్నది తెలిసిపోయింది. వారి ఓట్లు ఫలానా పార్టీకే వేస్తారని, ఇతర పార్టీలకు పడవనేది కూడా అందరికీ తెలిసిన విషయమై పోయింది. పోనీ ఆయా వర్గాలకు వారు ఏమైనా న్యాయం చేస్తున్నారా? అంటే అదీ లేదు. చర్చిల నిర్మాణానికి నిధులు వెచ్చించడం, పాస్టర్లు, ముల్లాలకు గౌరవ వేతనాలివ్వడం తప్ప వారికి లబ్ధి కలిగించే కార్యక్రమాలు ఒక్కటీ చేయడం లేదు. భావోద్వేగాలకే పరిమితమైన ఆయా వర్గాలు తమ నిత్య అవసరాలను, సమస్యలను మాత్రం మరచి పోతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్వయం ఉపాధి, పేదరిక నిర్మూలన కింద ఆర్థిక సహాయ పథకాలు కేంద్రం అమలుచేస్తున్నది. కాని వీటిని వైకాపా ప్రభుత్వం అమలుచేయడం లేదు. వారిని మతం ఉచ్చులో బిగించి శాశ్వతంగా పేదలుగా మగ్గిపోయేలా చేస్తోంది.

కొంతమంది క్రైస్తవులు, ముస్లింలు హిందూ ధర్మంపై చేస్తున్న విమర్శలు, దాడులను క్రైస్తవ, ముస్లిం సమాజం ఎందుకు ఖండించలేదు. అటు వంటి మూర్ఖపు పనులను ఎందుకు సమర్థిస్తున్నారు. వీరి మౌనం అందరి అభిప్రాయంగా భావించాల్సి వస్తోంది. మత వ్యవహారాల్లో ఎక్కువగా లాభపడేది చర్చి పాస్టర్లు, మసీదు నిర్వాహకులు మాత్రమే. భక్తులు ఇచ్చే కానుకలు ఈ ప్రార్థనా స్థలాల్లోని ఆచార్యులే వాడుకుంటారు.

**గుడులపై దాడులు చేస్తే ఖండించరా?**

కొంతమంది క్రైస్తవులు, ముస్లింలు హిందూ ధర్మంపై చేస్తున్న విమర్శలు, దాడులను క్రైస్తవ, ముస్లిం సమాజం ఎందుకు ఖండించలేదు. అటు వంటి మూర్ఖపు పనులను ఎందుకు సమర్థిస్తున్నారు. వీరి మౌనం అందరి అభిప్రాయంగా భావించాల్సి వస్తోంది. మత వ్యవహారాల్లో ఎక్కువగా లాభపడేది చర్చి పాస్టర్లు, మసీదు నిర్వాహకులు మాత్రమే. భక్తులు ఇచ్చే కానుకలు ఈ ప్రార్థనా స్థలాల్లోని ఆచార్యులే వాడుకుంటారు. తమ ఆదాయం కోసం వీరు హిందువులను విమర్శిస్తూ తమ వర్గంవారిలో హిందువుల పట్ల ద్వేషభావాన్ని నింపుతున్నారు. హిందూధర్మాన్ని అవమానించినా, గుడులపై దాడులు చేసినా తమకొచ్చిన లాభం ఏమిటో అన్యమతాలు ఆలోచించాలి. టిప్పుసుల్తాన్ విగ్రహం కడితే ఏమొస్తుంది? హనుమాన్ శోభాయాత్రలపై దాడులు చేస్తే ఎవరికి లాభం? ఆయా ప్రార్థనా స్థలాల యాజమాన్యాలకు తప్ప ఎవరికీ ఉపయోగం లేదు. ఎందుకంటే వీళ్లని రెచ్చగొడితేనే వారికి వారం వారం దశమ భాగాలొస్తాయి.

**ఓటుబ్యాంకు రాజకీయాలను తిప్పికొట్టాలి**

రాష్ట్రంలోని ముస్లింలు, క్రైస్తవులు సరిగా ఆలోచించాలి. ఇప్పటి వరకు ఈ రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, తెదేపా, వైకాపా ప్రభుత్వాల వల్ల తాము సాధించిన ప్రగతి ఏంటి? ఎవరి హయాంలో అయినా రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందా? మౌలిక సదుపాయాల కల్పన జరిగిందా? అనేది వారు ఒక్క సారి ఆలోచించాలి. అదే చేస్తే ఈ పరిస్థితి ఉండదు. ఉచితంగా బ్యాంకు ఖాతాలు తెరిచి ప్రభుత్వం అందించే నగదును నేరుగా లబ్ధిదారులకు చేరవేసింది ఎవరు? కట్టెల పొయ్యితో కళ్లు పోగొట్టుకునే దారుణ పరిస్థితి నుంచి ఉచితంగా గ్యాస్ సరఫరాను ఇచ్చినది ఎవరు? పేద రైతాంగాన్ని ఆదుకునేలా పెట్టుబడి సహాయాన్ని ఏడాదికి రూ. 6 వేల చొప్పున పంపిణీ చేస్తున్నది ఎవరు? ఏడాదికి రూ.5 లక్షల విలువైన ఉచిత వైద్యచికిత్సలను అందిస్తున్నది ఎవరు? అతి తక్కువ ప్రీమియంతో బీమా పథకాలు అమలు చేస్తున్నది ఎవరు? పేదలకు ఉచితంగా కరెంటు కనెక్షన్లు ఇచ్చింది ఎవరు? పేదలకు ఉచితంగా ఇళ్లు ఇస్తున్నది ఎవరు? కరోనా సమయంలో అదనంగా బియ్యం ఇచ్చింది ఎవరు? ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో వర్గానికి పలు రకాల సంక్షేమ పథకాలు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాత్రమే అందించింది. ఈ పథకాల్లో ఎక్కువగా లబ్ధిపొందుతున్నది ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు, బీసీలే. కానీ వీరు భాజపాకు దూరమయ్యారు. దీనికి కారణం ఓటుబ్యాంకు రాజకీయాలు. భాజపాపై క్రైస్తవులు, ముస్లింలను ఎగదోసే వైకాపా తమకేం చేయలేదని గుర్తించాలి.

**ఎస్సీలపై దాడులు నిజం కాదా?**

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో దాదాపు వెయ్యిమందికి పైగా మహిళలపై అత్యాచారాలు, దాడులు జరిగినట్లు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులే చెబుతున్నాయి. రోజుకో మహిళపై అత్యాచారం జరుగుతోంది. బాధితురాళ్లలో 90 శాతం మంది ఎస్సీలే. ఎస్సీల కోసం పుట్టినట్లు చెప్పే వైకాపా మూడేళ్లుగా వారికి అన్యాయం జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఎస్సీలకు స్వయం ఉపాధి పథకం కింద రూ. 14 లక్షలు విలువచేసే వాహనాలు ఇచ్చింది. కాని ఈ ప్రభుత్వం రాష్ట్రంలో అసలు ఈ పథకాన్నే అమలు చేయలేదు. ఇదే కాదు, ఇలాంటి పథకాలేవీ అమలుకు నోచుకోవడం లేదు. పేద కుటుంబాలకు చెందిన వారికి జీవనోపాధి కోసం ఇచ్చే ఆర్థిక సహాయం కూడా నిలిపివేశారు. పెళ్లిళ్లకు ఇచ్చే ఆర్థిక సహాయం కూడా ఇవ్వడం లేదు. ముస్లింల పరిస్థితీ ఇంతే. తమ కోసం ఏమీ చేయని వైకాపా ప్రభుత్వాన్ని తాము ఎందుకు ఆదరించాలో ఈ వర్గాలు ఇప్పటికైనా ఆలోచించాలి. ఈ విషయాలేవీ ఆలోచించకుండా చేసేందుకే అనవసరపు అంశాలను తెరపైకి తీసుకువస్తున్నారనేది గుర్తించాలి.

హిందువుల ఆలయాలపై దాడులు జరిగితే ఖండించకపోవడం వంటివి సమాజంలో వేర్పాటు వాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలుసుకోవాలి. ఇవేవీ తమ అభివృద్ధికి దోహదం చేసేవి కావని తెలుసుకోవాలి. సమాజంలో తాము అంతర్భాగమేనని, అందరితో కలసి వెళ్లాలనేది గుర్తించాలి. వైకాపా, తెదేపాలు చేసే ఓటుబ్యాంకు రాజకీయాల నుంచి బయటపడి అభివృద్ధి జపంచేసే భాజపాకు మద్దతు ఇవ్వాలి. ఈ నేపథ్యంలోనే భాజపా జాతీయ నాయకత్వం పార్టీని దేశవ్యాప్తంగా విస్తరింప జేయడంతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని వారిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర శాఖలకు ఆదేశాలిచ్చింది. ★



❋ పౌరాణికం ❋

# రావణ గర్వ



*(గత సంచిక తరువాయి)*

"ఏమమ్మా నేను విన్నది నిజమేనా?" మంథర అడిగింది.

నిజమే అన్నట్టూ తలూపింది కైక, "పద్నాలుగు రోజులు అనబోయేసరికి ఏదో భూతం ఆవహించినట్టుంది నన్ను. పద్నాలుగు సంవత్సరాలు అని అప్రయత్నంగా వచ్చేసింది నోట్లోంచి. ఎందుకిలా అయిందో? ఎంత ఆలోచించినా అర్థం కావడం లేదు."

మంథర మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. ఈ పద్నాలుగు రోజులు పద్నాలుగు సంవత్సరాలుగా మారినందుకు ఇప్పుడేమౌతుందో? కౌసల్య తట్టుకోగలదా? కౌసల్య ఎలాగోలా తట్టుకున్నా రాముడు లేకుండా కైక బతకగలదా? మహారాజో? ఏదో కీడు జరగబోతోందనేది సుస్పష్టం.

మంథర నుదిటి మీద చేత్తో కొట్టుకుంటూ అక్కడే నేల మీద కూలబడింది.

కాసేపటికి రాముడు రానే వచ్చాడు కైక దగ్గిరకి. మంథర తెర వెనుకకి తప్పుకుంది. తల్లి పాదాలకు నమస్కరించి అడిగాడు కైకని, "అమ్మా చెప్పండి ఏమిటిలా పిలిచారు?"

కైక రాముడికేసి చూసింది. అదే చిరునవ్వు. గుండె రంపంతో కోసేస్తున్న బాధ. రాముడితో ఎలా చెప్పడం? నోటమ్మట మాట రాక కూలబడిపోతూంటే రాముడే పొదివి పట్టుకున్నాడు కైకని.

దగ్గరే కూర్చున్న రాముడు కాసేపాగి అడిగేడు మళ్లీ, "చెప్పమ్మా? నేనేం చేయాలి?"

కైక నోరు విప్పింది,

"నువ్వు పద్నాలుగు సంవత్సరాలు అడవుల్లోకి వెళ్ళాలనీ, భరతుడిని నువ్వొచ్చేదాకా రాజుని చేయాలని అడిగాను. కానీ రామా! 'రోజులు' అని అడగబోతూంటే 'సంవత్సరాలు' అని అప్రయత్నంగా వచ్చేసింది."

చిరునవ్వు నవ్వేడు రాముడు, "అంతే కదా? దీనికే అంత వ్యథ దేనికమ్మా? నువ్వు అడిగితే నా చేత్తోనే భరతుడిని మహారాజుగా అభిషేకించి

## ఆధ్యాత్మికం

# విష్ణు ప్రియం తులసి



❋ 'మొక్క'బడి ❋

'తులానాం నాస్తు ఇతి తులసి' – ఎంత చెప్పుకున్నా, తరిగిపోని ఔషధ గుణాలున్నమొక్క తులసి. పరమ పవిత్రమైనది, శ్రీ మహాలక్ష్మీ స్వరూపం, విష్ణుమూర్తికి ప్రీతికరమైనది. తులసి మొక్క లేని ఇల్లు ఉండరాదు అంటుంది మన సంప్రదాయం. అంత గొప్ప తులసి గురించి కొన్ని విశేషాలు చెప్పుకుందాం. కఫ, వాత, పైత్య దోషాలనే మూడింటిని శృతి మించకుండా అదుపులో ఉంచుతుంది తులసి. కాలుష్యాన్ని తగ్గిస్తుంది, తులసి వాసనకు దోమలు దరి చేరవు. తులసి ఆకులు, వేర్లు, కొమ్మల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. చర్మ రోగాలను నయం చేస్తుంది. తులసి ఆకులు నమలడం చేత పంటి చిగుళ్ళ కున్న రోగాలు నయమవుతాయి. అరుగుదలను, ఆకలిని పెంచుతుంది. కఫం వలన వచ్చే దగ్గును, ఆస్తమాను తగ్గిస్తుంది. తులసి రసాన్ని తేనెలో కలిపి తీసుకోవడం వలన ఎక్కిళ్ళు తగ్గుతాయి. తులసి శరీరంలో ఉన్న ఆమాన్ని(టాక్సిన్స్/విషాలను) విశేషంగా తీసివేస్తుంది. ఈ మధ్య జరిగిన పరిశోధనల్లో.. ఒక్క తులసి చెట్టు మాత్రమే రోజుకు 22 గంటల పాటు ప్రాణ వాయువు(ఆక్సిజెన్)ను విడుదల చేస్తుందని, ఇంత గొప్ప లక్షణం మరే ఇతర మొక్కకు లేదని తేలింది. కానీ పురాణ కథ ఆధారంగా గణపతిని తులసి దళాలతో ఒక్క వినాయక చవితి నాడు తప్ప ఇంకెప్పుడు ఆరాధించకూడదు.

దోర్బల పూర్ణిమాస్వాతి

# భంగం-5

ఉండేవాడిని కదా? నా వనవాసం అంటావా? పద్నాలుగేళ్ళు ఎంతసేపు? ఇలా వెళ్ళి అలా వచ్చినట్టు జరిగిపోవూ? నువ్వేమీ మనసులో శంక పెట్టుకోకు. 'అసలు ఇలా అడుగుదాం అనుకున్నాను. అలా మాట తూలిందేం' అని సందేహించకు సుమాక్షు! అయితే వెళ్ళేటప్పుడు అమ్మ కౌసల్యని చూసి వెళ్ళవచ్చా?"

కైక కడుపు తరుక్కుపోయింది. రాముడు కత్తితో తనని నిలువునా నరికేసి ఉన్నా అంత బాధ ఉండదేమో? ఇంతటి కష్టంలోనూ రాముడి మొహంలో చెదరని చిరునవ్వెలా వస్తోంది?

'వెళ్ళొచ్చు' అన్నట్టు తల ఊపి మళ్ళీ నేలమీద కూలబడింది. కైకని చూసుకోమని పరిచారికలకి అప్పచెప్పి రాముడు బయల్దేరాడు. ముందు జరగబోయే చిత్రాతిచిత్రమైన విషయాలు చూడడానికి మంధర రాముడికి తెలియకుండా వెనుకనే బయల్దేరింది. రాముడు తిన్నగా నడుచుకుంటూ కౌసల్యని చేరాక, జరిగింది చూచాయగా చెప్పి తాను ఈ రోజే వనవాసానికి బయల్దేరుతున్నానని, తానొచ్చేదాకా జానకిని జాగ్రత్తగా చూసుకోవాలని రాముడు చెప్పడం మంధర విన్నది. అప్పుడే జరిగింది ఎవరూ కలలో కూడా ఊహించని విచిత్రం. రాముడు లేకుండా తాను బతకలేనని, రాముడెక్కడుంటే తానూ అక్కడేనని సీత కూడా బయల్దేరింది. రాముడు మరో మాటనేలోపు లక్ష్మణుడు కూడా తయారైపోయేడు. అడిగినందరికీ ఒకటే సమాధానం..రాముడు లేకుండా లక్ష్మణుడు లేడు. కైకకీ మంధరకీ కూడా జరిగిన విషయాలకి తల తిరిగిపోయింది. ఇంతటి కంగారులో కైక – మంధర అడగమన్నట్టూ – 'రాముడొక్కడే' అడవుల్లోకి వెళ్ళాలని అడగడం ఎలా, ఎందుకు మర్చిపోయిందో అటు కైకకి గానీ ఇటు మంధరకి గానీ గుర్తు రాలేదు.

నారబట్టలు కట్టుకునేటప్పుడు కౌసల్య అడిగింది రాముడిని "ఈ కోరికలు మహారాజు నీతో చెప్పినవా? లేకపోతే కైక అడిగినవా?"

"ఎందుకమ్మా అలా అడుగుతున్నావు? ఎవరైనా ఒకటే కదా నాకు?"

"కాదు, కాదు. మహారాజు ఆజ్ఞ అయితే దాన్ని అతిక్రమించే అధికారం సూర్యవంశ రాణులకి ఉంది. కానీ కైక కనక ఆజ్ఞాపిస్తే నువ్వు తప్పకుండా అడవులకి వెళ్ళవల్సిందే?" అర్థం కానట్టూ కౌసల్య కేసి చూశాడు రాముడు.

కైకే కనక నిన్ను అడవులకి వెళ్ళమంది అంటే, దాని పర్యవసానాలన్నీ ఆలోచించే నిన్ను వెళ్ళమని ఉంటుంది. కైక ఇలా అడగడంలో ఆంతర్యం నీ క్షేమం, లోకకళ్యాణం అయి తీరుతుంది. నేను నిన్ను స్వంత కొడుకులా ప్రేమించ లేకపోయినా కైక నిన్ను భరతుడికన్నా ఎక్కువగా చూసుకుంటూంది కదా? నీ వనవాసంలో ఏదోమహత్కార్యం జరగబోతూందన్న మాట. ఇంతకీ చెప్పు ఎవరు నిన్ను ఆజ్ఞాపించినది? మహారాజా? కైకా?"

"అమ్మే ఆజ్ఞాపించినది"

కౌసల్య మొహంలో దుఃఖం స్థానే నవ్వు తొణికిసలాడింది, "నేను అనుకున్న దేనన్నమాట. ఇప్పుడు మహారాజు మనసు మార్చుకున్నాసరే నువ్వు వనవాసం చేసి తీరవల్సిందే. నాకు తెలిసినంతలో ఈ ప్రపంచంలో కైక కన్నా నీ క్షేమం ఎక్కువగా కోరేవారెవరూ లేరు. నీ చేత ఏదో బృహత్కార్యం కావాల్సి ఉంది. సందేహించకుండా బయల్దేరు."

ఎవరికీ కనిపించకుండా ఈ విషయాలన్నీ వింటున్న మంధర స్థాణువై పోయింది. సవతి తల్లి కొడుకుని ఒకటి కాదు, రెండు కాదు, పద్నాలుగేళ్ళు కారడవిలోకి వెళ్ళమంటే, స్వంత తల్లి అది జరిగి తీరాలంటోంది. ఎందుకంటే ఆ సవతి తల్లి ఈ కొడుకు క్షేమం, లోకకల్యాణాన్ని దృష్టిలో పెట్టుకునే వెళ్ళమంటోందిట! రేప్పొద్దున్న భరతుడొచ్చి రాజ్యాధికారం చేపట్టేక మళ్ళీ రాముడిని నగరం లోకి రానీయకపోతే? ఈ తల్లీకొడుకులు ఎక్కడ, ఎలా బతుకుతారు? అధికారం వంటబట్టేక భరతుడు వీళ్ళిద్దరిచేతా అడ్డమైన చాకిరీ చేయించుకోడూ? ఈ ఆలోచనలు వస్తూంటే ఎవరో పక్కనుంచి కొరడా దెబ్బతో కొట్టినట్టూ మంధర అంతరాత్మ హెచ్చరించింది – రాముడంతటి వాడికి భరతుడు తమ్ముడైతే అతను అలా చేస్తాడా? అతనికీ ఉదాత్తమైన ఆలోచనలుండవూ? తనకి మల్లే, చౌకబారు ఆలోచనలు ఎలా వస్తాయి? తనలాంటి కాకులు హంస వేగం ఎలా అందుకోగలవు? సింహం కడుపున మేక పుట్టడం ఎక్కడైనా విన్నామా? ఈ కౌసల్య ఆలోచనలూ రాముడి వ్యవహారం చూస్తే వీళ్ళు మామూలు మనుషులు కాదని తెలుస్తూనే ఉంది. ఆలోచనల్లోంచి తేరుకుని చూసే సరికి రాముడు వశిష్టులవారితోనూ, మిగతా మంత్రులతోనూ మాట్లాడుతున్నాడు. చూడబోతే విశ్వామిత్రులవారు చెప్పినది నిజం కాబోతోంది. పద్నాలుగేళ్ళలో రాక్షస సంహారం జరిగితీరుతుంది కాబోలు. లేకపోతే రోజులనబోయి సంవత్సరాలు అని ఎలా అంది కైకమ్మ? కాళ్ళు నేలలో దిగిపోయి, మతిపోయినట్టూ కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది మంధర. ★

❋ తాత్వికత ❋



# మానవ సేవే మాధవ సేవ

మాంచి ఎండాకాలం. దరిదాపులలో ఒక చెట్టు కూడా లేదు. దాహం వేస్తోంది. నాలిక పిడచ గట్టుకు పోయింది. ఇంకా రెండు మైళ్ళు నడిస్తే ఊరు చేరుకుంటాను. అలానే రొప్పుతూ, ఆయాస పడుతూ కండువా తలపై వేసుకొని నడుస్తున్నాడు ఆ వ్యక్తి. ఎండ నిప్పులు కక్కుతోంది. దూరాన ఓ చెట్టు కనపడితే ప్రాణం లేచి వచ్చినట్లు అయింది. గబగబ అడుగులు పెద్దగా వేసుకుంటూ అక్కడికి చేరుకున్నాడు. ఓ పెద్ద కానుగ చెట్టు గుబురుగా ఉంది. దారంతా చల్లటి నీడనిస్తుంది. ఆ చెట్టు చుట్టూ అరుగు కట్టారు. ఒకరిద్దరు అక్కడ ఆద మరచి నిద్రపోతున్నారు. చెట్టు కిందకు చేరగానే అలసట తీరింది. 'అబ్బా ఎంత చల్లగా ఉంది. ఎవరో పుణ్యాత్ముడు వేసిన చెట్టు అనుకుంటూ చెట్టు కింద చూశాడు. ఓ కుండ కనిపించింది. వెంటనే వెళ్లి నీళ్ళు ముంచుకొని తాగాడు. 'ఆహా ఎవరో పుణ్యాత్ముడు చల్లటి నీళ్ళు పెట్టాడు, ఇక్కడ చెట్టు నాటాడు..' అనుకుంటూ విశ్రమిస్తుండగా ఓ వృద్ధురాలు కుండలో నీళ్ల పోస్తూ కనిపించింది.

ఇంతటి ఎండలో ఈమె ఎక్కడికి వెళ్లి నీళ్లు తెచ్చింది అనుకుంటూ 'అవ్వా ఇంతటి ఎండలో ఎక్కడ నుంచి నీళ్లు తెచ్చావు? ఈ వయసులో నీకు ఈ అవసరమేమిటి?' అడిగాడు. అవ్వ నవ్వి "మీలాంటి వాళ్ళ దాహార్తి తీరుస్తున్నాను. అదే నా సేవ నాయన. ఇక్కడ దరిదాపులలో చెట్లు లేకపోతే మా ముసలోడు ఈ చెట్టు నాటాడు, అక్కడ బావి తవ్వించాడు. దారిన పోయే వాళ్ళు చెట్టు కింద కూర్చుని చల్లని నీళ్లు తాగుతూ సేద తీరుతున్నారు. ఈ చెట్టు... ఆ నీళ్లే నాయనా" నా కొడుకు.. కూతురు అంటూ అవ్వ వెళ్ళింది. 'మానవ సేవే మాధవ సేవ అంటే ఇదేనేమో' అనుకుని చల్లగా సేద తీరాడు ఆ వ్యక్తి. ★

కానీ అప్పటికే గంతన్న చుట్టం పెద్దబ్బి దగ్గర లంచం తీసుకుని భూములు అప్పగించేశాడు బాస్టియన్. ఏం మాట్లాడకుండా విసురుగా లోపలికి వెళ్లి కూర్చున్నాడు బాస్టియన్. రెండు నిమిషాల తరువాత గంతన్న లోపలికి వెళ్లి బాస్టియన్ కాళ్ల దగ్గర కూర్చున్నాడు. ఎటో చూస్తున్నాడు బాస్టియన్. రెండు కాళ్లు పట్టుకుని అడిగాడు గంతన్న, "దొరా! నా భూములు నాకిప్పించండి దొరా! నన్ను అన్యాయం చేయకండి దొరా!" "ఏంట్రా లంజాకొడకా! అవి నీ భూములా? నా కన్నా ఎక్కువ తెలుసా నీకు? అవి ప్రభుత్వం వారి భూములు. నీ భూములని బుకాయించడమే కాకుండా నా మీద నువ్వు ఫిర్యాదు చేస్తావా? ఫిర్యాదు! ఏమనుకున్నావురా బాస్టియన్ అంటే?" అంటూ గుండెల మీద తన్నాడు. వెనక్కి పడిపోయాడు గంతన్న. రోడ్డు పని కోసం ఊరి వాళ్లని పంపే బాధ్యత తీసుకోవాలని శరభన్న పాలెంలో మునసబులతో పంచాయతీ పెట్టినప్పుడు నా వల్ల కాదని గంతన్న అంటే బాస్టియన్‌కి తల తీసేసినట్టయింది. ఆ కసి అలా పెరుగుతూనే ఉంది. సమయం కోసం చూస్తున్నాడు బాస్టియన్. అది తన అడ్డాలోనే దొరికింది. "ఒరేయ్!" ఒక్క ఉదుటన లోపలికి వచ్చాడు మల్లు. అతడి ఉగ్రరూపం చూసి బాస్టియన్ కొంచెం కంగు తిన్నాడు. పిళ్లై బేజారెత్తిపోయాడు.

అంత ఆవేశంతో వచ్చినా అన్నగారి పరిస్థితి చూసి జావగారిపోయాడు మల్లు. కింద పడిపోయిన అన్నగారిని పట్టుకున్నాడు. అదే అవకాశంగా మల్లు రెండు చేతులు వెనక్కి విరిచి బయట స్తంభం దగ్గరకి తీసుకుపోయి దానికి ఆనించాడు బాస్టియన్. పిళ్లై తాడు తెచ్చి కట్టేశాడు. బాస్టియన్ వెళ్లి కింద పడిపోయిన గంతన్నని డొక్కలో తన్నాడు. లేవబోతుంటే గుండెల మీద మళ్లీ తన్నాడు. వెర్రికోపంతో రగిలిపోతున్నాడు బాస్టియన్. అక్కడ కనిపించిన రూళ్లకర్ర అందుకుని మల్లు దగ్గరకి వచ్చి మోకాళ్ల మీద రెండు నిమిషాల పాటు బలం కొద్దీ కొట్టాడు. విలవిలలాడిపోయాడు మల్లు. పదో పన్నెండో దెబ్బలు, రంగురంగు మంటూ.. పక్కన చేరి పిళ్లై బూటు కాళ్లతో తన్నుతున్నాడు. అరగంట పాటు ఆ అన్నదమ్ముల మీద విరుచుకుపడి తరువాత మెడ పట్టుకుని బయటకి గెంటేశారు బాస్టియన్, పిళ్లై.

*　*　*

కొండమ్మ, సన్యాసమ్మ నేల తడుపుతున్నారు. ఆ ఇద్దరే ఉన్నారక్కడ. 'ఆ ముష్టి ముండ కొండమ్మని అక్కణ్ణుంచి పంపెయ్ రా!' అని పురమాయించాడు బాస్టియన్, కిష్టయ్యని. ముష్టి ముండ ఎవరో వెంటనే అర్థమయింది కిష్టయ్యకి. "ఏమే కొండమ్మా! ఆ పక్కన నేల తడిపేటోళ్లు తక్కువున్నారు. ఇక్కడ ఇద్దరేం చేస్తారు? నువ్వెల్లు, సన్యాసమ్మ ఇక్కడ తడుపుద్దిలే! నలుగురు పని ఒక్కత్తే చేసిపారేస్తది!" అన్నాడు కిష్టయ్య, అక్కడికి వస్తూనే. "అలాగే కిట్టయ్యా!" భయపడుతూ చెప్పి, అక్కడ నుంచి బయలుదేరింది కొండమ్మ. "అక్కడికి నీళ్లు మోసుకుపోవడం ఎందుకే! ఆ బుంగలోయి ఇక్కడే పొయ్యి!" అంది సన్యాసమ్మ. గబగబా నీళ్లు చల్లుతోందామె.

పుల్ల కోసం వెతుకుతున్నాడు కిష్టయ్య. నేలని పరీక్షించాలి మరి! "రెప్పపాటు ఉండవే! ఇది చూసెల్లు. ఇప్పుడు బేసిను దొర ఊడిపడతాడు." అంది సన్యాసమ్మ. "నిజం కదా! నేను పోతానే! నేనుండను!" అంటూ వెళ్లిపోయింది, భయంగా.. "ఏరా కిష్టయ్యా! వరికూటి బొడ్డు గాడు, ఆడే బొడ ఊరోడు. రేపైనా ఆవుపాలు తీసుకొస్తాడంటావా?" అన్నాడు బాస్టియన్. మాటలు అన్నది కిష్టయ్యతోనే అయినా, చూపులు మాత్రం తడిసిన చీర వెనుక ఉన్న సన్యాసమ్మ అవయవాల మీదే ఉన్నాయి. "ఆవుని తీసుకొచ్చి పాలు పిండి ఇవ్వకపోతే ఏం జరుగుతుందో నిన్నే కదా చూశాడు. తెస్తాడు దొరా!" అన్నాడు కిష్టయ్య. నిజమే, బొడ్డుగాడిని పిలిపించి మరీ కొట్టాడు బాస్టియన్. సన్యాసమ్మ వేగంగా నేల తడుపుతోంది. కిష్టయ్యతో మాట్లాడుతూనే సన్యాసమ్మ తనువంతా పరికిస్తున్నాడు బాస్టియన్. అలా చూస్తూనే దక్షిణం వైపు చూశాడు హఠాత్తుగా. గతుక్కుమన్నాడు. అక్కడ రోలర్ డ్రైవర్ విలియం ఓ చెట్టు కింద నిలబడి నారింజకాయ ఒలుచుకు తింటూ బాస్టియన్ నాటకం అంతా చూస్తున్నాడు.

*　*　*

"లోతుగడ్డనున్న." రెండు చేతులతో ఎత్తి పట్టుకున్న గునపాన్ని బలంగా నేలలోకి దింపుతూ పెద్ద గొంతుతో అన్నాడు ఉగ్గిరంగి రామన్న. దస్సిపోతున్న నవనాడుల్లోనూ మళ్లీశక్తిని దట్టిస్తున్నట్టుంది ఆ పదం.





# లంబసింగి రోడ్డు

9

డా॥ గోపరాజు నారాయణరావు

"వీరభద్రుడా!" చిత్రాళ్లగొప్పు పొలిమేరల్లో రోడ్డు పనిలో ఉన్న దాదాపు నూట నలభైమంది కూలీలు అన్నారు ముక్తకంఠంతో. లోయంతా ప్రతిధ్వనించింది ఆ సామూహిక గానంతో. కొండలు కూడా వంత పాడినట్టు ఖంగుమంది ఆ ప్రాంతం. వివశులై పోతారు అడవిబిడ్డలు ఆటన్నా, పాటన్నా. అక్కడ బాస్టియన్ లేదు. బాస్టియన్ లేకపోతే కిష్టయ్య, పిళ్లై కూడా పెద్దగా పట్టించుకోరు. అయినా ఇప్పుడు ఆ పాట వాళ్ల గొంతుకులలో సహజంగా పలకడం లేదు.

ఈ కష్టం నుంచి నీ బిడ్డలని కాపాడకుండా ఏమిటీ తాత్సారం? అన్న ఆక్రోశం ఆ లయకు తోడైనట్టుంది. ఆ గునపాన్నే పైకి లాగి మళ్లీ పోటు వేయడానికి ఎత్తి అన్నాడు రామన్న, "లంబసింగినున్న...."



"బాలరాకాసమ్మ....." అన్నాయి జనం గొంతుకలు. విశాఖమన్యంలో వినిపించే కొండరెడ్ల పాట. మళ్లీ అందుకున్నాడు రామన్న పాట. రెండో పదం జనమంతా కలసి అంటున్నారు.

"లోతుగెడ్డనున్న...." – "వీరభద్రుడా......!"
"లంబసింగినున్న..." – "బాలరాకాసమ్మ....."
"బోడికొండనున్న.." – "శాంబరమ్మ...."
"మాదుగులనున్న..." – "మత్స్యకంబేరమ్మ....."
"కొండకంబేరున్న.." – "నీలకంఠుడా!"
"దమ్మము సావడి..." – " మనము చేరవా......"
"ఎటు వెళ్లినారో...." – "పంచపాండగూలు!"

పాట అర్థం కాకున్నా, అందులోని లయనీ, ఆ లయకు తగ్గట్టు వేగంగా కదులుతున్న కొండజనాన్ని తదేకంగా గమనిస్తున్నాడు విలియం. కొండజనం పనిలో వేగం అతడిని విస్తుపోయేటట్టు చేస్తోంది. పెద్దపెద్ద యంత్రాలలో లయాత్మకంగా కదిలే భాగాలు గుర్తుకు వస్తున్నాయి. ఈ దశ పని పూర్తయ్యాకే రోలర్ ఎక్కిస్తాడు విలియం. ఎక్కడి నుంచో మరి, అప్పుడే వచ్చాడు బాస్టియన్. అతడు కంటపడగానే కొండ జనం గొంతులో ఊపు ఇంకా తగ్గిపోయింది. అడుగులో అడుగు వేస్తూ నడుస్తోంది బాస్టియన్ గుర్రం– నిర్మిస్తున్న రోడ్డుకు ఒక పక్కగా. చిత్రాళ్లగొప్పు ఊరు దగ్గర నుంచి ఫర్లాంగు మేర, అంటే పది గొలుసుల దూరం వరకు జరుగుతున్న రోడ్డు పనిని చూస్తున్నాడు బాస్టియన్ గుర్రం మీద నుంచే. ఎవరో తరుముకు వస్తున్నట్టే ఎవరి పని వారు వేగంగా చేస్తున్నారు వాళ్లంతా. అదే నచ్చదు బాస్టియన్‌కి. ఈ వేగం చాలదు. శరవేగంగా సాగాలంటాడు. ఈ 1922 సంవత్సరాంతానికల్లా మన్యంలో రోడ్లన్నీ సిద్ధమై పోవాలి. శరవేగం, శరవేగం అంటూ పూనకం వచ్చినట్టు ఊగిపోతున్నాడు. అందుకే ఆ బక్క కొండవాళ్ల అంత వేగంగా కదులుతున్నా తృప్తి పడలేక పోతున్నాడు. అసలు పని జరుగుతున్నట్టే ఉండదు అతని కంటికి. శారీరక శ్రమనే కాదు, గాయాల సలుపుని కూడా ఆ పాట కొద్దిగా అయినా మరిపింపచేస్తోంది. అందుకే పది రెట్ల శక్తిని ఇస్తోంది. కొందరు తట్టలతో తెచ్చి ఎర్ర కంకర చిమ్ముతుంటే, ఆ కంకర మీద కడవలతో, బుంగలతో నీళ్లు తెచ్చి అరచేతిని అడ్డం పెట్టి లాఘవంగా తడుపుతున్నారు కొందరు. మరుక్షణంలో దిమ్మిసాలు వచ్చి నర్తిస్తున్నాయి. అవే పదాలు మళ్లీ మళ్లీ అంటున్నారు వాళ్లు. "బోడికొండనున్న.. "–"శంబరమ్మ నీవు!"

"మాదుగులనున్న...... – "మత్స్యకంబేరమ్మ!" ఒకచోట నిలిపాడు గుర్రాన్ని బాస్టియన్. కాస్త పరిశీలనగా చూసిన తరువాత అర్థమైంది అతడికి. వంకర గునపాలతో చిన్నచిన్న రాళ్లను పెళ్లగించే పని నలుగురైదుగురే చేస్తున్నారు. కొండవాళ్లు వంకర గునపాలని పిలుచుకునే క్రౌబార్లు ఇక్కడి పని కోసమే ఇరవై వరకు తెప్పించాడు బాస్టియన్. ఒక కొస ఒంపు తిరిగిన గద్ద ముక్కులా ఉంటుంది. రెండో వైపు అర్ధచంద్రాకారపు బద్ద ఉంటుంది. పని వేగంగా జరుగుతున్నందువల్ల ఒక్కొక్కదాని కొసలు విరిగి పోతూ వచ్చాయి. రెండు రోజుల క్రితమే పాడైన క్రౌబార్లని నర్సీపట్నం పట్టుకువెళ్లి మరమ్మతు చేయించుకుని రమ్మని ఎదురుగానే కనిపించిన ఒక యువకుడిని ఆదేశించాడు బాస్టియన్. ఈ పని త్వరగా పూర్తి చేయించమని కిష్టయ్యని కూడా పురమాయించాడు. ఆ గిరిజనుడి పేరు బూతా ఎర్రేసు. ఊరు మర్రిపాలెం. చెట్లు కొట్టడం, నేలను కొద్దిగా చదును చేయడం, అందుకు నేలలోని చిన్నా పెద్దా రాళ్లని తొలగించడం, అప్పుడు అరడుగు మేర కంకర పోయడం, ఆపై మట్టి పొర వేయడం, చివరికి మళ్లీ ఎర్ర కంకర పొర వేసి, అప్పుడు నీళ్లు చల్లి దిమ్మిసా చేయడం రోడ్డు పనిలో కనిపిస్తాయి. కానీ నేలలో రాళ్లు తీయకుండా రోడ్డు వేస్తే ఎగుడు దిగుళ్లు కనిపిస్తాయి. ఇంజనీరు వంక పెడతాడు. "కిష్టయ్యా!" గట్టిగా అరిచాడు బాస్టియన్, గుర్రం మీద నుంచే. ఏ మూల నుంచో వచ్చి చేతులు కట్టుకుని గుర్రం పక్కగా నిలబడ్డాడు కిష్టయ్య. "ఏరా! క్రౌబార్లు ఇంకలేవా, మనకాడ?" "లేవు దొర. ఇవే ఉన్నాయి. మిగిల్నియ్యి పాడైయ్యాయి కదా దొరా!" అన్నాడు కిష్టయ్య. "రెండ్రోజులైంది చెప్పి, ఇంకా

బాగుచేయించలేదా? ఆడెవడికో చెప్పాం.... మర్రి పాలెం వాడెవడో" పేరు గుర్తుకు రాలేదు బాస్టియన్‌కి. గుర్తుచేశాడు కిష్టయ్య, "ఎర్రేసు దొర, బూతా ఎర్రేసు."

"పిలు, ఎదవని! " పళ్లు నూరుతూ అరిచాడు బాస్టియన్. చుట్టూ చూసి ఓ చోట గొప్పు తవ్వుతున్న ఎర్రేసుని గమనించి తప్పట్లు కొట్టి, చేతులు ఊపి మొత్తానికి ఇటు రమ్మని సైగ చేశాడు కిష్టయ్య. పాట వేగం జోరు పూర్తిగా తగ్గిపోయింది. ఒకరకమైన నిశ్శబ్దం ఆవరించింది. ఏదో జరగబోతోంది! ప్రతి అడవిబిడ్డ గుండె కీడును శంకిస్తూనే ఉంది. చేతిలో పలుగుని అక్కడే నేలకు గుచ్చి, తలకు చుట్టుకున్న తుండుగుడ్డ విప్పుకుని మెడలో దండలా వేసుకుంటూ గబగబా వచ్చాడు ఎర్రేసు భయపడుతూనే. పాతి కేళ్లుంటాయి. కొంచెం బలంగానే ఉన్నాడు. కానీ డస్సిపోయి కనిపిస్తున్నాడు. అతని రెప్పల చివరి వెంట్రుకల మీద కూడా ఎర్రటి కంకర దుమ్ము కమ్ముకుని ఉంది. పెరిగిన గడ్డం, దాని నిండా కూడా దుమ్ము. దీనితో మరీ నీరసంగా కనిపిస్తున్నాడు.

"ఏరా లంజా కొడకా! వంకర గునపాలు ఎందుకు పట్టుకెళ్లలేదురా? ఎవరి చంక నాకు తున్నావ్?" ఉరిమాడు బాస్టి యన్. "పొద్దున్న కూడా అడిగాను దొర. రేప్పొవచ్చులే అన్నాడు కిష్టయ్య" విషయం చెప్పాడు తడబడుతూ ఎర్రేసు. అప్పటికే వణికిపోతున్నాడతడు. "ఏరా, నన్నెప్పుడడిగావురా? దొర చెప్పాక, నన్ను అడగడం దేనికిరా? చెప్పు తీసుక్కొడతాను నాయాలా!" అంటూ అడ్డంగా బొంకాడు కిష్టయ్య.

ఎర్రేసు చెప్పిన వెంటనే వంకర గునపాలని మరమ్మతు చేయించుకు రాకపోవడంలో గొప్ప రాజ్యా ధిక్కారం కనిపించింది బాస్టియన్‌కి. సర్రున గుర్రం దిగి, ఎర్రేసు మెడలోని తుండుగుడ్డ రెండు కొసలను తటాల్న అందుకుని, మళ్లీ అంతే వేగంతో గుర్రం ఎక్కాడు బాస్టియన్. బలంగా లాగడంతో కెవ్వున అరిచాడు ఎర్రేసు. అప్పటికే అతడి పీక గుర్రం మెడకు తాసుకు పోయింది. ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. "ఎక్కడు న్నాయిరా ఆ క్రౌబార్లు?" గట్టిగా అడిగాడు కిష్టయ్యని బాస్టియన్. ఈ విషయాన్ని ఇంత తీవ్రంగా పరిగణిస్తాడన్న సంగతి, ఇది ఇంతకు దారి తీస్తుందన్న సంగతి కిష్టయ్య కూడా ఊహించలేదు. వాడు కూడా బెంబేలెత్తి పోయాడు. తడబడిపోతూ అన్నాడు. "అక్కడే దొర... మన సామాన్లన్నీ పెడతాం కదా... ఆ మామిడి చెట్టు కిందే... ఉన్నాయి." అందరిలోనూ ఆవేశం పొంగింది. పనులు వదిలేసి గబగబా గుర్రం దగ్గరకు వచ్చి, చుట్టూ మూగారు. "దొరా! ఏంటిది? సంపేత్తారా మనుసుల్ని?" గట్టిగా అరిచిందా యువతి మొదట. కోపంతో ఒక పక్క నిలువెల్లా ఒణికిపోతూనే, ఇంకోపక్క భీతితో ఆమె పెదవులు, ఇతర అవయ వాలు ఆవేశంతో కదిలిపోతున్నాయి. ఆమెను కిష్టయ్య ఏదో అనబోయాడు. అప్పుడే గిరిజనులంతా ఒక్కసారి గొంతెత్తారు. "దొరా! ఏంటీ అన్నాయం? ఆడి తప్పేంటి? వదిలెయ్ దొర. ముందు ఆణ్ణి ఒదులు... సచ్చిపోతాడు! " తలొక మాటగా అన్నారు. అవేం పట్టించుకోకుండా ఉరుముతున్నట్టు అన్నాడు బాస్టి యన్, "ఎవత్తిరిదే!" కిష్టయ్య చెప్పాడు, "ఆడిపెళ్లాం దొర!" కసికొద్దీ గుర్రం డొక్కలో తన్నాడు బాస్టియన్. ఒక్క గెంతు గెంతి పరుగు లంఘించుకుంది గుర్రం. ఆ ఊపుకి నేల మీద పడబోయాడు యెర్రేసు. గుర్రం జీనులో ఏదో తోలు పట్టీని గట్టిగా పట్టుకుని నిల దొక్కుకున్నాడు. తట్టలూ, కుండలూ, గునపాలూ పెట్టుకునే ఆ మామిడిచెట్టు అక్కడి దాదాపు వంద మీటర్ల దూరంలో ఉంది. చిరతపులి లేగదూడను లాక్కుపోతున్నట్టు పరమ కర్కశంగా లాక్కుపోతున్నాడు ఎర్రేసుని బాస్టియన్.

గుండెలు అవిసిపోయాయి కొండజనానికి. అది చూడలేక, కెవ్వున అరిచి గుర్రాన్ని అందుకోవడానికి అన్నట్టు వెనక పరుగు తీసింది ఎర్రేసు పెళ్లాం మొదట. ఆమె వెనకే పరుగుతీశారు, కూలీలందరూ. ఆ ప్రాంతంలోనే అక్కడ క్కడ ఆడుకుంటున్న పిల్లలు ఒక్కసారి ఏదో క్రూర జంతువుని దగ్గరగా చూసినట్టు భయంగా ఏడుపు మొదలుపెట్టారు ఇదంతా చూసి. ఆ చోటంతా ఏడుపులతో, పెడబొబ్బలతో, అరుపు లతో నిండిపోయింది. "దొరా... ఆపు దొరా! తప్పు కాయి దొరా! అన్నాయం దొరా! అయ్యో! గుర్రం తొక్కేస్తంది.. పడిపోతన్నడు.. కిందపడిపోతన్నాడు.. కిష్టయ్యా... నువ్వేనా చెప్పు దొరకి... ఆడు సచ్చి పోతాడు... ఇదేమన్నాయం... ఆపు... దొరా!" తలో మాట అంటున్నారు. వదిలిపెట్టడం లేదు బాస్టియన్. ఎర్రేసు గుర్రంతో సమంగా కదలలేకపోతున్నాడు. పాదాలు కొట్టుకుపోతున్నాయి. గుర్రం గిట్టల కింద తన పాదాలు పడి నలిగిపోకుండా జాగ్రత్త పడదామని కాస్త పక్కకు అడుగు వేసినా మెడ వంగిపోయి, మెదడులో చుక్కలు కనిపిస్తున్నాయి. "సచ్చిపోయాడు దేవుడోయ్! దొరా దణ్ణం పెడతాను ఒదులు దొరా!" అరుస్తో పరుగు తీస్తోంది ఎర్రేసు భార్య. వాళ్ల ఆక్రంద నలు వింటున్న కొద్దీ పైశాచికానందం పెరిగి పోతోంది బాస్టియన్‌లో. గుర్రాన్ని చర్నాకోలతో మళ్లీ బాదాడు. ఇంకాస్త వేగం అందుకుంది. "ఇదన్నాయం.. ఇదన్నాయం. ఆడు సచ్చిపోతే మేం ఊరుకోం... ఇదే చెప్పడం..." పెద్ద గొంతుతో అన్నాడు ఓ యువకుడు. గుర్రం మామిడిచెట్టు దగ్గరకొచ్చి ఆగింది. తటాల్న వదిలాడు తుండుగుడ్డని బాస్టియన్. ఒక్కసారిగా కిందపడిపోయి దొర్లాడు ఎర్రేసు. రెండు పాదాలు బాగా కొట్టుకుపోయి రక్తం ఉబికి, ఎర్ర కంకర దుమ్ముతో కలుస్తోంది. బాధతో ముఖం కందగడ్డలా మారిపోయింది. భయంతో పొగిలి పొగిలి వస్తోంది దుఃఖం. "తీసుకెళ్లి బాగు చేయించు. ఎలా వెళతావో.. ఇక్కడున్నట్టుగా రావాలి. సాయంత్రానికి కనిపించాలి!" గట్టిగా అరిచాడు బాస్టియన్ క్రౌబార్లని చూపుడు వేలితో చూపిస్తూ. అప్పటికే నాలుగైదు అడుగుల దూరంలో వచ్చి నిలబడున్నారు అడవి బిడ్డలు. అందరిలోనూ ఆవేశం. అందరికంటే ముందే కనిపిస్తోంది ఎర్రేసు భార్య.

చటుక్కున గుర్రం దిగి, వడివడిగా నడిచి వెళ్లి ఆమె చెంప మీద బలంగా కొట్టాడు బాస్టియన్. అలాగే చతికిల పడిపోయిందామె. "ఏరా.... ఏంట్రా... దండెత్తుకొచ్చారు? ఫితూరీయా? ఫితూరీ చేస్తారా? చెప్పండ్రా! రండి, తిరగబడండి! సిపాయిల తిరుగుబాటేంట్రా ఇది? ఏంటీ... వెంటపడి పరిగెట్టు కొచ్చారు? అన్నాయమా? ఊరుకోరా?! ఏం చేస్తార్రా! ఏం చేస్తార్రా..." అంటూ చర్నాకోల తీసుకుని గొడ్లను బాదినట్టు బాదడం మొదలు పెట్టాడు బాస్టియన్, బండబూతులు తిడుతూ. ఒక మృగంలా మారి పోయాడతడు. హడలిపోయారు గిరిజనులు. ఓ కట్టె తీసుకుని బాస్టియన్‌కు తోడయ్యాడు కిష్టయ్య. మళ్లీ వంద గజాల అవతల పని జరుగుతున్న చోటు వరకు కొడుతూ తీసుకువెళ్లారు ఆ ఇద్దరు. ఇక్కడ ఎర్రేసు శక్తంతా కూడదీసుకుని లేస్తున్నాడు. కాళ్లు పని చేయడం లేదేమోనని అనిపించింది. తిమ్మిరెక్కిపోయి నట్టయింది. రెండు నిమిషాలు పట్టింది నిలబడ డానికి. కుంటుతూ వెళ్లాడు. ఒక్కొక్క క్రౌబార్‌నీ తీసి కట్ట కట్టడానికి ఉద్యుక్తుడవుతున్నాడు, మెడ బాధనూ, పాదాల మంటనూ లెక్క చేయకుండా. విలియం, అతడి సహాయకులు తమాషా చూస్తున్నారు.

(ఇంకా ఉంది)

గుండెలు అవిసిపోయాయి కొండజనానికి. అది చూడలేక, కెవ్వున అరిచి గుర్రాన్ని అందుకోవడానికి అన్నట్టు వెనక పరుగు తీసింది ఎర్రేసు పెళ్లాం మొదట. ఆమె వెనకే పరుగు తీశారు, కూలీలందరూ. ఆ ప్రాంతంలోనే అక్కడ క్కడ ఆడుకుంటున్న పిల్లలు ఒక్కసారి ఏదో క్రూర జంతువుని దగ్గరగా చూసినట్టు భయంగా ఏడుపు మొదలుపెట్టారు ఇదంతా చూసి. ఆ చోటంతా ఏడుపులతో, పెడబొబ్బలతో, అరుపు లతో నిండిపోయింది.



మే 30 నాటికి మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టి సరిగ్గా ఎనిమిదేళ్లు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 12 ఏళ్లు, ప్రధానిగా 8 ఏళ్లు కలిపి ఆయన మొత్తం రాజ్యాంగ పదవుల్లో కొనసాగిన కాలం 7541 రోజులు. గత ప్రధానులెవ్వరూ ఇంతకాలం రాజ్యాంగ పదవుల్లో కొనసాగలేదు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో మోదీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప నేతగా ఎదిగారు. భాజపాలో ఆయన ఇప్పుడు తిరుగులేని నేత. పార్టీని గతంలో ఎన్నడూ లేని రీతిలో సమున్నత స్థానంలో నిలిపారు. ముఖ్యంగా బీజేపీ ఉనికేలేని ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ అధికారంలోకి రావడం నిజంగా అద్భుతం. అయితే దక్షిణాదిలో పార్టీ ఇంకా వెనుకబడే ఉంది. గతంలో ఎవరూ కనీసం కలలో కూడా ఊహించని అయోధ్యలో రామమందిర నిర్మాణం సుసాధ్యం, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణం, 35ఎ రద్దు (ఆగస్టు 5, 2019), పౌరసత్వ సవరణ చట్టం (పొరుగు దేశాల్లో మైనారిటీలకు మనదేశంలో పౌరసత్వం కల్పించే చట్టం), త్రిపుల్ తలాక్ చట్టం (ఆగస్టు 1, 2019) మొదలైనవి ఆయన ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు. ఇక మిగిలింది ఉమ్మడి పౌరసత్వ చట్టం అమల్లోకి తేవడం. కొవిడ్-19 మహమ్మారిని మోదీ ప్రభుత్వం ఎదుర్కొన్న తీరు ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకుంది. సెప్టెంబర్ 18, 2018న పీఓకేపై సర్జికల్ దాడులు నిర్వహించడం; ఫిబ్రవరి 26, 2019న జరిగిన పుల్వామా దాడులకు ప్రతీకారంగా బాలాకోట్ ఉగ్రవాద శిబిరాలపై మన వైమానికదళ దాడులు.. మోదీ సాహస నిర్ణయాలకు ఉదాహరణలు.



# సర్వామోద నేత

మెజారిటీ, మైనారిటీలు ముఖ్యంగా హిందువులు, ముస్లింల మధ్య నిరంతరం జరిపిన చర్చల ఫలితంగా మత సంబంధ చట్టాలు, త్రిపుల్ తలాక్, సిటిజన్‌షిప్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ వంటివి అమల్లోకి తీసుకురావడం సాధ్యమైంది. అయోధ్య వివాదానికి పరిష్కారం లభించింది. బాబ్రీ కట్టడం కూల్చివేత తీవ్రస్థాయి చట్ట ఉల్లంఘన అని సుప్రీంకోర్టు గతంలో పేర్కొన్నప్పటికీ చర్చల వల్ల కలిగిన సానుకూల ఫలితాలు, అయోధ్యలో రామాలయ నిర్మాణానికి బాటలు వేశాయి. అయోధ్య స్ఫూర్తితో ఇప్పుడు కాశీ, మధుర, ఢిల్లీల్లో దేవాలయాలపై మసీదులు నిర్మించారంటూ పిటిషన్లు దాఖలు చేయడానికి దోహద పడింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న 370వ అధికరణను రద్దుచేయడం మోదీ కీర్తి కిరీటంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. నిజానికి 1990 నుంచి జమ్ముకశ్మీర్‌లో హింస జీవనంలో ఒక భాగంగా మారిన నేపథ్యంలో ఇక్కడ ఏవిధమైన అల్లర్లకు తావులేకుండా, అంతర్జాతీయంగా ఏ విధమైన ఒత్తిళ్లు లేకుండా 370 అధికరణను రద్దుచేయడం నిజంగా మోదీ సాధించిన అద్భుత విజయం.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

**సంస్కరణలతో ముందడుగు**

ఎనిమిదేళ్ల క్రితం మోదీ 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' నినాదంతో ప్రధానిగా దేశ పగ్గాలు చేపట్టారు. ఇందులో భాగంగా 2024-25 నాటికి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందించాలన్నది కూడా లక్ష్యం. ఇందుకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) అమలు, ఉజ్జ్వల యోజన, జన్‌ధన్ యోజన వంటి వాటితోపాటు పాలనాపరంగా అనేక మార్పులు అమల్లోకి తెచ్చారు.

దేశంలో కనిపిస్తున్న మార్పులకు మోదీ ప్రభుత్వం చేపట్టిన 8 కీలక సంస్కరణలు ప్రధాన కారణం. 1. నోట్ల రద్దు, 2. జీఎస్‌టీ (దేశంలోనే అతిపెద్ద పన్ను సంస్కరణ, ఒక దేశం-ఒక పన్ను అనేది దీని విధానం. ఇది దేశంలో అమల్లో ఉన్న బహుళ పన్ను వ్యవస్థను రద్దు చేసి, ఒకే పన్ను విధానాన్ని అమల్లోకి తెచ్చింది. జీఎస్‌టీ నమోదు తప్పనిసరి చేయడంతో ప్రభుత్వానికి అత్యధిక

మొత్తంలో పన్ను ఆదాయం లభిస్తోంది). 3. ఉజ్వల పథకం: దేశంలోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఐదుకోట్ల మంది మహిళలకు ఉచిత ఎల్.పి.జి. కనెక్షన్ సదుపాయం కల్పించడం. 2016, మే నెలలో ప్రభుత్వం దీన్ని అమల్లోకి తెచ్చింది. 2018లో ఈ పథకాన్ని మరో ఏడు కేటగిరీలకు చెందిన మహిళలకు కూడా విస్తరించి లక్ష్యాన్ని 8 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లక్ష్యాన్ని గడువుకు ఏడునెలల ముందే సాధించడం విశేషం. 2021-22లో కేంద్రం మరో కోటి ఎల్.పి.జి. కనెక్షన్లను విడుదల చేసింది. దీన్నే ఉజ్వల 2.0 అని వ్యవహరిస్తున్నారు. 4. ఇన్‌సాల్వెన్సీ, బ్యాంక్‌రప్టీ కోడ్ (దివాలా చట్టం-2016), 5. ఆర్.ఇ.ఆర్.ఏ. (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ), 6. జన్‌ధన్ ఆధార్ మొబైల్ (జెఏఎం). దీన్ని 2014-15 ఆర్థిక సర్వేలో మొట్టమొదటిసారి ప్రతిపాదించారు. 2016 నుంచి ప్రభుత్వం జన్‌ధన్‌ను లబ్ధిదారుల ఆధార్, మొబైల్ నెంబర్లకు లింక్ చేయడం మొదలుపెట్టింది. అట్టడుగున ఉన్నవారిని కూడా ఆర్థికంగా అనుసంధానించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యం. నిజంగా ఇది గొప్ప మార్పు. ముఖ్యంగా కొవిడ్ సమయంలో, లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా సహాయాన్ని జమచేయడానికి ఉపయోగపడింది. 7. కార్పొరేట్ పన్నులో కోత: గత 28 సంవత్సరాల్లో ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద పన్ను కోత ఇది. 2019 సెప్టెంబర్ నెలలో, అంతకు ముందు 30 శాతం ఉండగా దాన్ని 22 శాతానికి తగ్గించింది. అంతర్జాతీయంగా పోటీపడేందుకు, దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉద్దేశించిన చర్య ఇది. 8. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం: 2019, ఆగస్టు 30న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ బ్యాంకుల విలీనాన్ని ప్రకటించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల బలోపేతానికి ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

**ద్రవ్యోల్బణం నుంచి ఎగుమతుల దాకా..**

మోదీ ప్రభుత్వం ఏర్పడే నాటికి అంటే 2014లో దేశంలో ద్రవ్యోల్బణం 8.33%. భరించదగ్గస్థాయి ద్రవ్యోల్బణం 2-6 శాతంగా ఆర్.బి.ఐ. పేర్కొన్న దాని కంటే ఇది ఎక్కువ. అయితే 2022 ఏప్రిల్‌లో






రిటైల్ ద్రవ్యోల్బణం 7.99%కు చేరుకోవడంతో, ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చేందుకు ఆర్.బి.సి. వడ్డీరేట్లను 40 బేసిక్ పాయింట్లకు, క్యాష్ రిజర్వ్ రేషియోను 0.50%కు పెంచడం ద్వారా ఉపశమన చర్యలు చేపట్టింది. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు దేశంలో నిరుద్యోగం 5.4 శాతంగా ఉంది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సమాచారం ప్రకారం ఇది 2016లో 8.72 శాతానికి పెరిగి నప్పటికీ, మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 2017లో 3.3%కు పడిపోవడం గమనార్హం. అన్ని రంగాల వారికి ఉపాధి కల్పనలో ప్రభుత్వం విజయం సాధించిందనే చెప్పాలి. తర్వాత కొవిడ్ ఉపాధి పరిస్థితులను మరింత తలక్రిందులు చేసింది. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు దేశ ఎగుమతులు 310.1 బిలియన్ డాలర్లు కాగా దిగుమతులు 447.6 బిలియన్ డాలర్లు. తర్వాతి సంవత్సరాల్లో ఈ ఎగుమతులు ఏటా 300 బిలియన్ డాలర్లకు అటూ ఇటూ కొనసాగగా, 2022లో వీటిని 400 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. షెడ్యూలుకు 8 రోజుల ముందే ఆ మార్కును దాటడం విశేషం.

మోదీ ప్రభుత్వ హయాంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గణనీయంగా పెరగడం విశేషం. 2021-22లో ఇవి 83.57 బిలియన్ డాలర్లు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాం కంటే ఇవి సగటున రెండింతలు అధికం. ఈ ప్రత్యక్ష పెట్టుబడుల్లో (ఎఫ్.డి.ఐ.)లో సింగపూర్, యు.ఎస్, మారిషస్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ దేశాల వాటా 76%. మరి 2014లో ఈ ఎఫ్‌డిఐలు 16.05 బిలియన్ డాలర్లు మాత్రమే. 2014-15లో దేశ తలసరి ఆదాయం రూ.86,484 ఉండగా, 2019-20 నాటికి ఇది రూ.1.32లక్షలకు చేరుకొని, 2022 నాటికి రూ.1.50 లక్షలకు పెరిగింది. దేశ ప్రజలు 2014తో పోల్చినప్పుడు ప్రస్తుతం 73% అదనంగా సంపాదిస్తుండటం విశేషం. 2014-15లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్ట మొదటిసారి 2014 మే 16న బి.ఎస్.ఇ. సెన్సెక్స్ 25,000 మార్క్‌ను దాటగా, తర్వాతి నాలుగేళ్లలో 35,000 మార్క్‌ను దాటేసింది. మోదీ రెండోసారి అధికారంలోకి రాగానే ఇది 40,000 మార్క్‌ను దాటి రికార్డు సృష్టించింది.

మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో దేశ జి.డి.పి. 7.5%గా నమోదైంది. అయితే కొవిడ్ విపత్తు నేపథ్యంలో 2020 నాటికి ఇది 4.2%కు పడిపోయింది. కొవిడ్-19 మహమ్మారి మనదేశాన్ని మాత్రమే కాదు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేసింది. లాక్‌డౌన్‌ల పుణ్యమాని అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 2020 నాటికి 3.7 ట్రిలియన్ డాలర్లకు కుంచించుకు పోవడం గమనార్హం. క్రమంగా కొవిడ్ దెబ్బ నుంచి కోలుకొని అన్ని రంగాలు కుదుట పడుతున్నందుకు సూచనగా 2022 తొలి త్రైమాసికంలో దేశం గతంలో ఎన్నడూ లేనివిధంగా 20.1% వృద్ధిని నమోదు చేసింది. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఈ సంతోషాన్ని నిలువనీయలేదు. ఈ యుద్ధం అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో ప్రపంచం మరో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇందుకు మన దేశమూ మినహాయింపేమీ కాదు. ఇటీవల భారతీయ స్టేట్‌బ్యాంక్ ఇచ్చిన నివేదిక ప్రకారం బేవరేజెస్, ఇంధనాలు, రవాణా వంటి వాటి ధరలు 52% పెరిగాయి. ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ ప్రైజెస్ (ఎఫ్‌ఎంసీజీ) రంగంలో ఇన్‌పుట్ ధరలు ఒక్కసారిగా 7% పెరిగాయి. కొవిడ్ సమయంలో పెరిగిన ధరలు వినియోగదారులను షాక్‌కు గురిచేయగా, ఈ ఏడాది గోధుమ దిగుబడి తగ్గుతుందన్న అంచనాల నేపథ్యంలో భారత ప్రభుత్వం గోధుమ ఎగుమతులపై నిషేధం విధించాల్సి వచ్చింది. అంతేకాదు పెట్రోల్ ధరల






తగ్గింపు కూడా పెరుగుతున్న ధరలకు ముకుతాడు వేసే చర్యల్లో భాగమే.

**రాజకీయ విజయాలు**

ఈ ఎనిమిదేళ్లలో భాజపా రాజకీయంగా ఎనిమిది కీలక విజయాలు సాధించింది. 2014 మే నెలలో బీజేపీ ఆరు రాష్ట్రాల్లో అధికారంలో ఉండగా 2022 నాటికి 22 రాష్ట్రాలకు విస్తరించింది. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో దెబ్బతిన్నప్పటికీ, ఆ పార్టీ ఆసక్తికరమైన పురోగతి చూపింది. ప్రస్తుతం పార్టీ దేశంలో 70 కోట్ల మంది ప్రజలను పాలిస్తుండగా, 12 రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రెస్ ముక్త్ భారత్‌కు పిలుపునివ్వడం ద్వారా 2014లో అధికారంలోకి వచ్చిన పార్టీ, దీన్ని నిజం చేయడానికి ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోలేదు. మరోమాటలో చెప్పాలంటే ఈ ఎనిమిదేళ్ల కాలంలో భాజపా ప్రగతి కాంగ్రెస్‌తో పోలిస్తే విలోమాను పాతంలో కొనసాగింది.

భాజపా దెబ్బకు ప్రస్తుతం కాంగ్రెస్ కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పార్టీ ఇంకా బలపడాల్సి ఉంది. ఈ రాష్ట్రాల్లోని 129 ఎంపీ స్థానాలు కేంద్రంలో అధికారానికి కీలకం. 2024లో భాజపా అధికారం లోకి రావడానికి ఈ రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు సంపాదించడం పార్టీకి అవసరం. ఇక రాజ్యసభ సీట్ల విషయానికి వస్తే 2014లో కాంగ్రెస్ నేతృత్వం లోని యూపీఏ కంటే ఎంతో వెనుకబడిన భాజపా 2022 నాటికి 100 సీట్ల మార్కును దాటే అవకాశ ముంది. 2014లో రాజ్యసభలో భాజపా బలం 55 సీట్లు మాత్రమే. ప్రస్తుతం ఎగువసభలో ఆ పార్టీ బలం 95. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ 20 సీట్లను నిలుపుకొని 91 స్థానాలకు చేరవచ్చు. అయితే ఏడు నామినేటెడ్ సీట్లు ఖాళీగా ఉండటంతో, పార్టీ వంద మార్కుకు సమీపానికి వచ్చే అవకాశాలున్నాయి. ఎన్‌డీఏయేతర పార్టీలైన బీజేడీ వంటి వాటి సహాయంతో జులైలో జరిగే రాష్ట్రపతి ఎన్నికల్లో గట్టెక్కవచ్చు.

**విదేశీ పర్యటనలు**

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు మోదీ 28 దేశాల్లో పర్యటించారు. అత్యధికంగా ఏడుసార్లు పర్యటించింది అమెరికాలో. రష్యా, ఫ్రాన్స్, జర్మనీల్లో ఐదుసార్లు పర్యటించారు. దేశప్రధానిగా ఆయన ఇప్పటివరకు 114 విదేశీ పర్యటనలు జరిపారు.



అయోధ్యలో నిర్మించనున్న శ్రీరామమందిరం

హ్యూస్టన్, టెక్సాస్‌ల్లో మద్దతు దారులతో, బ్రిటన్, ఆస్ట్రేలియాల కిక్కిరిసిన పార్ల మెంట్‌ల్లో ప్రసగించడం నిజంగా చారిత్రకం. 2017లో ఇజ్రాయిల్‌లో పర్యటించారు. ఈ దేశంలో పర్యటించిన భారత తొలి ప్రధాని నరేంద్రమోదీ మాత్రమే. ఇది ఇజ్రాయిల్‌పై భారత్ వైఖరిలో మార్పును స్పష్టం చేసింది. అదేవిధంగా 2018లో పాలస్తీనాలో కూడా పర్యటించి, ఆ దేశాన్ని సందర్శిం చిన మనదేశ తొలి ప్రధానిగా రికార్డు సృష్టించారు.

**అంతుపట్టని వ్యూహాలు**

మోదీ వ్యవహారశైలి చూస్తే ఒక ప్రత్యేక లక్ష్య సాధన దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్టు తెలుస్తుంది. అయితే ఆయన వ్యూహాన్ని ముందుగా అంచనా వేయడం కష్టం. నోట్ల రద్దును మనదేశంలో చాలా మంది విమర్శించారు. కానీ ఆ దెబ్బకు పాకిస్తాన్ విలవిలలాడిపోయింది. దొంగనోట్ల ముద్రణతో కశ్మీర్‌లో ఉగ్రవాదులకు ఫండింగ్ చేస్తున్న పాక్‌కు నోట్ల రద్దు అశనిపాతం. దీనికి తోడు ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న దేశంగా పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్‌లో, అంతర్జాతీయంగా దోషిగా నిలబెట్టడంలో మోదీ ప్రభుత్వం విజయం సాధించింది. అప్పటినుంచే పాక్ పతనం ప్రారంభమైంది. ఇక వియత్నాం–చైనాల మధ్య సముద్ర జలాల్లో చమురు అన్వేషణపై వివాదం కొనసాగుతోంది. చైనా కట్టడికి వియత్నాం చమురు అన్వేషణ బాధ్యతను భారత్‌కు అప్ప గించింది. ముడిచమురును భారత్‌కు ఎగుమతి చేస్తోంది. ఆ విధంగా చైనాపై, భారత్ పైచేయి సాధించింది.



చైనాతో అంటకాగుతున్న పాక్‌కు, పెరుగుతున్న భారత్–యూఎస్ సంబంధాలు పెద్ద దెబ్బ. ఇప్పుడు పాక్‌ను పట్టించుకునే స్థితిలో అమెరికా లేదు. పాక్–ఆఫ్ఘాన్ సంబంధాలు దెబ్బతింటున్నాయి, ఇదే సమయంలో చాపకింద నీరులా భారత్ ఆ దేశ ప్రజలకు అవసరమైన సహాయం చేస్తోంది. ఇది కూడా మోదీ మార్క్ వ్యూహమే. దక్షిణాసియాలో సార్క్ సదస్సును రద్దుచేసి తన శక్తి ఏంటో మోదీ ప్రపంచానికి చూపారు. ఆసియాలో భారత్ ఆధిపత్యాన్ని కొనసాగింపజేయడంలో మోదీదే కీలకపాత్ర.

ప్రతి దేశానికి శత్రువులుంటారు. కానీ భారత్‌కు పాకిస్తాన్, చైనా మాత్రమే శత్రువులు. మిగిలి దేశాలన్నీ మిత్రులే. దేశాలతో జరిపే చర్చల్లో మోదీలోని నిజాయతీ వాటిని కట్టిపడేస్తుంది. కాదనకుండా తలూపడమే అవి చేసేపని. ఇదే వ్యవహారశైలితో ముస్లిం దేశాలను పాక్‌కు వ్యతిరేకంగా మార్చి తనను తాను గొప్ప రాజనీతిజ్ఞుడిగా నిరూపించుకున్నారు. బద్ధ శత్రువులైన రష్యా, అమెరికాలతో వ్యవహరించ గల ఏకైక దేశం భారత్ మాత్రమే. మరి ఈ ఘనత మోదీకే దక్కుతుంది. ప్రపంచ రాజకీయాల్లో కేంద్రస్థానం వహించే స్థాయికి భారత్‌ను తీసుకెళ్లారు. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని పాలించిన ప్రధానులకు ఎవరి ప్రత్యేకత వారికున్నప్పటికీ, ఇంతటి దార్శనికత, రాజనీతిజ్ఞత, సుస్థిరంగా పెరుగుతున్న ప్రతిష్ఠ, దేశీయంగా అద్భుత ఛరిష్మా కలిగిన అద్భుతనేత నరేంద్రమోదీ మాత్రమే.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

# ఏరువాక కావాలి

నాగరికత ఎంత ముందుకు సాగుతున్నా నాగలి (రైతు) లేనిదే మనుగడే లేదు. పుడమిని పుత్తడిగా మార్చే అన్నదాతకు పండుగ రోజు. సమాజం కడుపు నింపేందుకు లాభనష్టాలు, కష్టసుఖాలకు అతీతంగా తన పనులకు పునరంకితమయ్యే రోజు. ప్రకృతి పగపట్టినా, ఏలికలు పట్టీపట్టనట్లు వ్యవహరించినా ఆరుగాలం శ్రమకు నడుంకట్టే రోజు. వ్యవసాయంలో తోడూ నీడగా నిలిచే పశుసంపదకు, ప్రధానంగా బసవన్నలకు కృతజ్ఞతలు చెబుతూ సమాదరించుకునే రోజు. అదే 'ఏరువాక' పున్నమి. జ్యేష్ఠ పౌర్ణమి. 'హలపూర్ణిమ, వృషభపూర్ణిమ'గా పిలుచుకునే ఇది రైతులకే కాదు, ఆకలి తీర్చేది కనుక అందరికీ పండుగే.



ఇంచుమించు దేశమంతటిపైనా నైరుతి రుతు పవనాల ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా తెలుగు నాట సహా అనేక ప్రాంతాలలో జ్యేష్ఠ మాసంలో వానాకాలం ప్రారంభమవుతుంది. దేశంలో సుమారు 70 శాతానికి పైగా వర్షపాతం నైరుతి రుతుపవనాల వల్లనే ఏర్పడుతున్నందున దేశమంతా ఏరువాక పున్నమిని జరుపుకోవడం గమనార్హం. దానికి పేరు ఏదైనా సందర్భం ఒకటే. వేదకాలంలోనూ ఈ పండుగ ప్రసక్తి కనిపిస్తుంది. అప్పట్లో ఇంద్ర ఆరాధన ఎక్కువగా ఉండేదని తెలుస్తోంది. హాలుడి 'గాథా సప్తశతి'లోనూ ఏరువాక గురించి కథలు ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయలూ ఏరువాక సందర్భంలో రైతులను సమాదరించినట్లు తెలుస్తోంది. 'ఔత్తరాహులకు హోలీ, వసంత పంచమీలు ప్రత్యేకాభిమతములు. తమిళులకు పొంగల్ ముఖ్య పండుగ. ఆంధ్రులకు ఉగాది, ఏరువాక పున్నమి ముఖ్యమైనవి' అన్నారు సురవరం ప్రతాపరెడ్డి తన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథంలో. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో దీనిని 'దవన పున్నమి'గా పేర్కొన్నారు. కారుపున్నమి, కృషిక పున్నవి లాంటి పేర్లతో వ్యవహరించే ఈ పండుగను తెలంగాణలో 'ఏరొక్క పండుగ'గా జరుపుకుంటారు. అయినవారిని, ఇతర ఊళ్లలోని బంధువులను పిలుచుకోవడమూ ఉంది. ఆర్థిక సంవత్సరం, విద్యాసంవత్సరం మాదిరిగానే వ్యవసాయ పనులు చేసేవారికి (జీతగాళ్ల) ఏరువాక పున్నమినాడే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

పంచభూతాత్మకమైన ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించడం, వ్యయసాయ పనుల ఆరంభానికి ముందు పూజ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. అదే ఏరువాక. 'ఏరు' అంటే నాగలి, 'వాక' అంటే దున్నడం. (ఏరు అంటే ఎద్దులను కట్టి పొలం దున్నడానికి సిద్ధంచేసిన నాగలి అని అర్థం). పొలం పనుల ప్రారంభాన్నే 'సస్యారంభం, కృష్యారంభం' అని జ్యోతిష్యశాస్త్రం పేర్కొంటోంది.

తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాలతో అరక దున్నడంతో వ్యవసాయ పనులు మొదలవుతాయి. అన్నదాతలు కలసి చేసుకునే పండుగ ఏరువాక పున్నమి. వారు సామూహికంగా ఎద్దులను పొలాలకు తోలుకు వెళ్లి దుక్కి దున్నుతారు. 'కాపులందరు వేగ కూడి రావాలి/గాదెల్లో విత్తనాలు దండిగా తేవాలి/గంపల్లో విత్తనాలు దండిగా తేవాలి/మృగశిర చిందించె ముసలెద్దు రంకేసె/దుక్కిటెద్దుల దెచ్చి అరక కట్టాలి/దున్నిన చేలన్నీ మిన్నగా పండాలి.' అనే పాటలో ఏరువాకకు సన్నద్ధత, రైతుల ఆశలు కనిపిస్తాయి. 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్నా/నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా' అనే కొసరాజు రాఘవయ్య వారి ప్రసిద్ధ చిత్ర గీతం.. సకాలంలో పొలం పనులు చేపట్టవలసిన అవసరాన్నీ చాటి చెబుతోంది. 'మానవ కృషికి మాధవ కృప' తోడు కావాలంటారు. అప్పుడే సత్ఫలితాలు వస్తాయి. అందుకే ఏరువాక పండుగ నాడు వరుణదేవుడిని పూజిస్తూ...

*'వానల్లు కురవాలి వానదేవుడా వరిచేలు పండాలి వానదేవుడా*

*పన్నెండు ధాన్యాలు వానదేవుడా బండమీద పండాలి వానదేవుడా*

*బీదసాదసాకాలి వానదేవుడా పేదసాద సాకాలి వానదేవుడా....'* అని వేడుకుంటారు.

**హలపూర్ణిమ**

నాగలిని ధైర్యానికి, కష్టపడే మనస్తత్వానికి ప్రతీకగా, ఎద్దులు, ఇతర పనిముట్లు, రైతు శక్తి సామర్థ్యాలను నైపుణ్యానికి చిహ్నాలుగా చెబుతారు. నాగలిని పట్టడమంటే భగవంతుడు వాన రూపంలో కల్పించిన పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడమే. అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ శక్తివంచన లేకుండా పాటుపడుతూ మనిషి మనీషి కావాలని 'ఏరువాక' ప్రబోధిస్తోంది. నాగలిని భుజాన వేసుకోవడం అంటే సమాజానికి నాలుగు మెతుకులు పెట్టేందుకు నడుం కట్టడమే.

ఏ కాస్త సహాయం పొందినా కృతజ్ఞతలు చెప్పడాన్ని సంస్కారంగా భావించినట్లే, జీవనాన్ని ఇస్తున్న నాగలికి సర్వదా రుణపడి ఉండాలనుకుంటుంది రైతు (కర్షక)లోకం. నాగలిని కేవలం వస్తువుగా కాకుండా ప్రాణ సమానంగా పరిగణిస్తూ నాగలి గొర్రుకు

# 'సిరి' వాకిలి

పూజాదికాలు నిర్వహించడం మన సంస్కృతి ఔన్నత్యం. శుద్ధోదన మహారాజు కపిలవస్తులో ఏరువాకను ప్రారంభిస్తూ కర్షకులకు బంగారు నాగళ్లను బహూకరించినట్లు చెబుతున్న ఐతిహ్యమే నాగలి ఉన్నతికి నిదర్శనం. ఈ పండుగ సందర్భంగా కొన్ని ప్రాంతాలలో ఊరి బయట గోగునారతో 'తోరణం' కడతారు. రైతులు ఆ తోరణాన్ని చెర్నాకోలతో కొట్టి దొరికిన నారను ఎద్దులకు, నాగళ్లకు కడతారు. దీనివల్ల వ్యవసాయం, దానివల్ల సంపద వృద్ధి చెందుతాయని విశ్వాసం.

**'వృషభ పూజ'**

ఏరువాక పున్నమిని 'వృషభపూజ' అంటారు. 'పాలిచ్చే గోవులకు పసుపు-కుంకుం, పనిచేసే బసవన్నకు పత్రి పుష్పం' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒక చిత్రగీతంలో పేర్కొన్నట్లు.. ఆనాడు ఎద్దులకు స్నానం చేయించి వాటి కొమ్ములకు రంగులద్దుతారు. కాళ్లకు గజ్జెలు కడతారు. పసుపు కుంకుమలతో అలంకరించి హారతులు పడతారు. పులగాన్ని నైవేద్యంగా పెడతారు. వాటితో పొలంలో దుక్కి దున్నిస్తారు. తొలిదుక్కి సమయంలో కొందరు రైతులు కాడికి ఒక పక్కన ఉంటూ ఎద్దులతో సమానంగా నడుస్తారు. తమ జీవనంలో తమకు అండగా ఉండే మూగజీవాల పట్ల అభిమానాన్ని అలా చాటుకుంటారు. ఆ రోజున పశువుల కొట్టాలను శుభ్రపరచి, ముగ్గులెట్టి, ధూప దీపాలను పశువులకు చూపుతారు. పశువులతో ఊరేగింపులు నిర్వహించడం, వాటితో ఆలయాలలో ప్రదక్షిణలు చేయించడం లాంటివి కొన్నిచోట్ల కనిపిస్తాయి.

**ఏరువాక పాటలు**

జానపద సాహిత్యంలో ఏరువాక, నాగలి పాటలకు ప్రాధాన్యం ఉంది. ఏరువాక ఆరంభంలో కర్షక లోకం ఆనందోత్సాహాలతో పాడుకునే గీతాలు ఆ సాహిత్యంలో కనిపిస్తాయి.

*'ఏరువాకొచ్చింది ఏరువా కమ్ము/యేరులు నదులు పొంగి వెంబడొచ్చాయి/నల్ల మేఘాలలో నాట్యమాడింది/కొండగుట్టల మీద కులు కులాడింది/ఇసుక నదిలో బుసలు కొట్టింది/ పాడుతూ కోయిల పరుగులెట్టింది/ఆడుతూ నెమలి అలసి పోయింది', 'అటక మీద గంప అందుకోవయ్య/విత్త నాలు దీసి విరగజిమ్మవయ్య/మృగశిరా కార్తిలో ముం చెత్తు వాన/ కలపరా అబ్బాయి కొత్త దూడల్ని/కట్టరా అబ్బాయి కొత్త నాగళ్లు/దున్నరా ఓ అయ్య దుక్కుల్లు మీరు/ ఒకగింజ కోటియై వర్ధిల్లు మీకు/ఏరువాక సాగి ముసురుకోవాలి/కొత్త పంటలు మనకు కోరుకోవాలి.'*
అంటూ దుక్కులు మొదలెట్టమంటూ సాగే పాట.

ఏ కాస్త సహాయం పొందినా కృతజ్ఞతలు చెప్పడాన్ని సంస్కారంగా భావించినట్లే, జీవనాన్ని ఇస్తున్న నాగలికి సర్వదా రుణపడి ఉండాలను కుంటుంది రైతు (కర్షక)లోకం. నాగలిని కేవలం వస్తువుగా కాకుండా ప్రాణ సమానంగా పరిగణిస్తూ నాగలి గొర్రుకు పూజాదికాలు నిర్వహించడం మన సంస్కృతి ఔన్నత్యం.



అష్టవిధ నాయికలలో ఒకరైన ప్రోషిత భర్తృక (దూరదేశాలలో ఉన్న భర్త గురించి ఆలోచించే నాయిక)కు సమాంతరంగా ఒక జానపద యువతి విరహానికి ఏరువాక పున్నమి సందర్భాన్ని అన్వయించే గీతం ఒకటి. ఏరువాక రైతన్నకు ఎంత ప్రాణప్రదమో దూరాన ఉన్న తన బావ కూడా అంతేనట.

*'తొలకరి ఒక మబ్బు తొంగి చూసింది*
*మబ్బులో ఒక మెరుపు మెరసి పోయింది*
*పెరటిలో ఒక జల్లు కురిసి వెలిసింది*
*జల్లులో నా మనసు జారిపోయింది*
*ఏరువాక నాటి కేదాది దాటింది*
*ఎదురు చూచిన గుండె చెదిరిపోయింది*
*పిట్టపిట్టా ముద్దు పెట్టుకున్నాయి*
*గోవులన్నీ ఇల్లు చేరుకున్నాయి*

* * *

*ఏటి ఒడ్డున నేను పాటబాడే వేళ*
*నవ్వుతూ నా బావ పువ్వులేరేవేళ*
*కొంటె కోయిల పైన కూత కూసే వేళ*
*బావొచ్చి నాతోటి బాసలాడాలె*
*ముద్దొచ్చి నాతోటి మురిసిపోవాలె*
*ఏరువాకమ్మ మాకెదురు రావాలె*
*తలవంచి మము చూచి దీవించి పోవాలె'*
అంటూ ఏరువాకతో పాటే తానూ వస్తాదని, రావాలని ఆశిస్తూ ఆ మరదలు పాడుకున్న గీతం ఈ పండుగ ప్రసిద్ధికి ఓ ఉదాహరణ.

**సేద్యమంటే జూదమేనా...!**

అయితే సేద్యం చెప్పుకున్నంత గొప్పగా లేదని మాధ్యమాలలో నిత్యం వచ్చే రైతు ఘోష వార్తలను బట్టి తెలుస్తోంది. వ్యవసాయాన్ని 'జూదం'గా భావించి దాని నుంచి ఇతర రంగాలకు మళ్లుతున్న వారూ ఉన్నారు. చాలా వరకు వ్యవసాయ భూములు స్థిరాస్థి వ్యాపారంగా మారుతున్న తీరు తెలిసిందే. వ్యవసాయాన్ని వీడి భూములను 'సొమ్ము' చేసుకుంటూ గ్రామాంతరం వెళ్లేవారిపైనా, రైతుశక్తిని తక్కువగా అంచనా వేసే వారి పైనా....

*'పొలాలమ్ముకొని పోయేవారూ*
*టౌనులో మేడలు కట్టేవారూ*
*బాంకులో డబ్బు దాచేవారూ*
*నీశక్తిని గమనించరు వారూ...*
*పల్లెటూళ్లలో చెల్లనివాళ్లు*
*పొలిటిక్సుతో బ్రతికేవాళ్లు*
*ప్రజాసేవయని అరచే వాళ్లు*
*ఒళ్లు వంచి చాకిరికి మళ్లరు..'* అని దశాబ్దాల క్రితమే తన గీతంలో చురకలు వేశారు కవి కొసరాజు. అయినా రైతు దిగులు పడవలసిన అవసరం లేదని, రోజులు మారి 'రైతే రాజు' కాగలడంటూ....
*'పదవులు స్థిరమని భ్రమిసే వాళ్లే/ఓట్లు గుంజి నిను మరచేవాళ్లే/నీవే దిక్కని వత్తురు పదవోయ్..'* అనే ఆశా భావంతో భరోసా ఇచ్చారు. ఆ భరోసా నిజం కావాలని ఆశిద్దాం. ★





# రైతు సంక్షేమమే

**2014లో కేంద్రంలో నరేంద్రమోదీ మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. రైతు ఆర్థిక స్థితిగతుల్ని పెంపొందించేందుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఇ-నామ్, పీఎం కృషి షించాయీ యోజన వంటి ఎన్నో పథకాల అమలు ద్వారా రైతు అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం రైతు అభివృద్ధి కోసం 2014 నుంచి చేపడుతున్న వివిధ పథకాల గురించి తెలుసుకుందాం!**

**పీఎం పంటల బీమా పథకం**

దీనిని 2018లో ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు దీని కింద ఊరట లభిస్తోంది. ఈ పథకానికి శ్రీకారం చుట్టాక ఇప్పటి దాకా 37.52 కోట్ల మంది రైతులు నమోదు చేసుకున్నారు.




రూ.1.2 లక్షల కోట్ల పరిహారంగా అందుకున్నారు. (జూన్, 2022)

**పీఎం కిసాన్ సమ్మాన్ నిధి**

దేశంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో 2019 ఫిబ్రవరి 21న నగదు బదిలీ పథకం ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిటి) కింద అర్హులైన రైతుల ఖాతాలకు ఏటా మూడు విడతలుగా రూ.6,010 జమ చేస్తున్నారు. ఈ మేరకు 2022 ఏప్రిల్ 25 వరకూ మొత్తం 11.3 కోట్ల మందికి పైగా రైతుల ఖాతాలకు రూ.1.82 లక్షల కోట్లు జమ చేశారు.

**ఇ-నామ్ పథకం: వ్యవసాయోత్పత్తులకు పోటీ ధర పొందడంలో తోడ్పాటు**

రైతులు తమ ఉత్పత్తులపై లాభసాటి ధర పొందడమే లక్ష్యంగా పారదర్శక ఆన్ లైన్ వేలం విధానాన్ని రూపొందిస్తూ 'ఇ-నామ్' వేదిక ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 11, 801 మండీలు దీనికి జోడించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి 1.73 కోట్ల మంది రైతులు, 3.21 లక్షల మంది వ్యాపారులు కమీషన్ ఏజెంట్లతో పాటు 2,113 రైతు ఉత్పత్తిదారు సంస్థలు ఈ పోర్టల్లో నమోదయ్యాయి. 2022 మార్చి 22 నాటికి రూ.1.82 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార లావాదేవీలు సాగాయి.

**స్వామిత్వ పథకం**

2021 ఏప్రిల్ 21న ఈ పథకం ప్రారంభించారు. దీని కింద రైతుల భూమి సంబంధిత యాజమాన్య హక్కు కార్డుతోపాటు





# లక్ష్యం

సదరు వ్యవసాయ భూమి రికార్డులు డిజిటల్ రూపంలో తయారవుతాయి. ఇది 2025 నాటికి దేశమంతటా అమలవుతుంది. 2022 మే 1 నాటికి దాదాపు 1.35 లక్షల గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి కాగా, 31 వేల గ్రామాల్లో 36 లక్షలకు పైగా ఆస్తి కార్డులు జారీ అయ్యాయి.

**కిసాన్ క్రెడిట్ కార్డు**

వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుంచి రైతుకు విముక్తి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018 జూలై 1న 'కిసాన్ క్రెడిట్ కార్డు' పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికింద సింగిల్ విండో బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా సులభ షరతులతో రూ. 3 లక్షల దాకా రుణం అందుతోంది. రూ. 3.38 లక్షల కోట్ల మేర రుణం మంజూరు పరిమితితో దేశవ్యాప్తంగా 2022 ఏప్రిల్ 25 వరకూ 3.05 కోట్ల కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేశారు. ఈ పథకం కింద రైతుపై వడ్డీ భారం సంవత్సరానికి కేవలం 4 శాతమే.

**కనీస మద్దతు ధర పెంపు**

ప్రభుత్వం కనీస మద్దతు ధరతో ధాన్యం, గోధుమలు కొనుగోలు చేస్తోంది. ఈ మేరకు 2022–23 రబీ మార్కెటింగ్ కాలానికి గాను 2022 ఏప్రిల్ 21 వరకూ 137 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమ కొనుగోలు చేశారు. అలాగే 2021–22 ఖరీఫ్ కాలానికిగాను 757.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతులు పంట సాగుకు పెట్టిన ఖర్చుకన్నా ఒకటిన్నర రెట్లు అధికంగా రబీ పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించారు. రైతుల ఆదాయం పెంచే దిశగా దేశంలో 10 వేల రైతు ఉత్పత్తిదారు సంస్థలు ఏర్పాటు కానున్నాయి. వీటికి 5 సంవత్సరాలపాటు ప్రభుత్వ సహాయం అందిస్తుంది. ఈ మేరకు 2022 ఏప్రిల్ నాటికి 2315 ఎఫ్‌పీఓలు నమోదయ్యాయి.

**జాతీయ వెదురు కార్యక్రమం**

పునర్ వ్యవస్థీకృత జాతీయ వెదురు కార్యక్రమానికి 2018 ఏప్రిల్ 25న మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీనికింద వెదురు సాగు కోసం ప్రభుత్వం రైతులకు రూ.50 వేల దాకా సబ్సిడీ ఇస్తుంది. సన్నకారు రైతులకు ప్రతి మొక్క పైనా రూ.120 సబ్సిడీ ఇచ్చే విధంగా నిబంధన రూపొందించారు. భారతదేశం ఏటా 14 మిలియన్ టన్నుల వెదురును ఉత్పత్తి చేస్తుంది.




**పకడ్బందీగా మార్కెట్ వ్యవస్థ**

రైతులు పండించే పంటలు సకాలంలో మార్కెట్‌కు చేరేవిధంగా శీతల గిడ్డంగుల సౌకర్యం సహా 'కిసాన్ రైలు' పథకం ప్రారంభించారు. దీనికింద 2022 మార్చి 25 వరకూ కిసాన్ రైలు 2190 ట్రిప్పులు పూర్తి చేసింది.

ఇక 2020 ఆగస్టులో 'కృషి ఉడాన్ 1.0'; 2021 అక్టోబరులో 'కృషి ఉడాన్ యోజన 2.0' ప్రారంభమయ్యాయి.

**భూసార నిర్వహణ**

భూసార పరీక్ష ఆధారిత సూక్ష్మ పోషకాల నిర్వహణను ప్రోత్సహిస్తూ ప్రవేశపెట్టిన ఈ పథకం కింద 2018–2019 నుంచి 2020–2021 వరకూ 5.67 కోట్ల మంది రైతులు లబ్ధి పొందారు. తదనుగుణంగా 2022 ఏప్రిల్ 19 వరకూ దేశవ్యాప్తంగా 22.19 కోట్లకు పైగా భూసార కార్డులు రైతులకు పంపిణీ చేశారు.

**పీఎం కిసాన్ సంపద యోజన**

ఈ పథకాన్ని 2015 మే 3వ తేదీన రూ.6 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. కాగా, ప్రస్తుతం రూ.4600 కోట్ల అదనపు అంచనా వ్యయంతో 2025–2026 వరకు దీనిని పొడిగించారు. దీనికింద ఇప్పటివరకూ మెగా, మినీ ఫుడ్ పార్కులు, ఆహార పరీక్ష ప్రయోగశాలలు సహా 1088 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది.

**జాతీయ గోకుల గ్రామం కార్యక్రమం**

దేశీయ సమీకృత పశుగణాభివృద్ధి కేంద్రాలుగా 16 గోకుల గ్రామాల ఏర్పాటు కోసం ఈ కార్యక్రమం కింద 2022 మార్చి 31 వరకూ నిధులు మంజూరు చేయగా, గత మూడేళ్లలో వివిధ రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలకు దాదాపు రూ.2082 కోట్లు విడుదల చేశారు.

**ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన**

ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పేరిట 2015–16లో ఒక సామూహిక పథకంగా ఇది ప్రారంభమైంది. ఇందులో సత్వర సాగునీటి లభ్యత కార్యక్రమం కూడా అంతర్భాగంగా ఉంది. దీని కింద ఉద్యమ తరహాలో పనులు చేపట్టిన 99 పెద్ద ప్రాజెక్టులలో ప్రస్తుతం 46 పూర్తయ్యాయి. ఈ 2021 మార్చి వరకూ గల సమాచారం మేరకు 50.64 లక్షల హెక్టార్ల భూమికి అదనపు నీటిపారుదల సౌకర్యం కల్పించారు.

*'ది న్యూ ఇండియా సమాచార్' నుంచి*

# కలవరించి... 'కల' వరించి..

ఆశలూ,ఆశయాల కలయిక సివిల్ సర్వీస్. కేంద్రంలో లేదా రాష్ట్రంలో కీలక ప్రభుత్వ / అధికారాలు, ఐ.ఏ.ఎస్, ఐ.ఎఫ్.ఎస్, ఇలా పౌరసేవలన్నింటా అగ్రగణ్యం. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏటా నిర్వహించే పరీక్షల (లిఖిత, మౌఖిక) ఉత్తీర్ణతే యువత కలల్ని పండిస్తుంది. దేశంలోని ఆబాల గోపాలన్నీ ఎంతగానో ఆకట్టుకునే ఆ ఎంపికలు ఈసారి కూడా పలు రీతుల రికార్డులు సృష్టించాయి. తొలి మూడు ర్యాంకుల విజేతలుగానూ ఘనపతాక ఎగురవేసి వనితా శక్తికి తిరుగేలేదని చాటి చెప్పారు శ్రుతిశర్మ (ఉత్తరప్రదేశ్), అంకిత (కోలకతా), గామిని (చండీగఢ్). అతివలు టాప్ ర్యాంకర్లుగా నిలవడం ఇదేమీ కొత్త కాకున్నా, ఒకటీ రెండూ మూడు స్థానాలూ వారినే వరసగా వరించడం దరిదాపు దశాబ్దాకాల వ్యవధిలో ఇదే ప్రథమం, ప్రధానం.



శ్రుతిశర్మ

సివిల్స్‌లో నిరుటి ఫలితాలకు సంబంధించి, 177 మంది మహిళలు ర్యాంకుల్ని కైవసం చేసుకున్నారు. నాలుగేళ్ల కిందట యూపీఎస్సీ పరీక్షల విజేతలు మొదటి పాతిక మందిలో ఎనిమిది మంది మహిళామణులే. ఇప్పుడైతే వరస స్థానాలు మూడింటినీ ఆడపిల్లలే సంపాదిం చడం, అందులో తమదైన విశిష్టత చూపడమే జయజయహో అనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ శతాధిక విజేతలను ఇప్పటిదాకా తీర్చిదిద్దిన మల్లవరపు బాలలతది మరింత ప్రత్యేకత. తాజా ఫలితాల్లోనూ ఏకంగా 14 మందిని ర్యాంక్ సాధకులుగా నిలబెట్టిన తనది ఎంతైనా విలక్షణత. మరీ ముఖ్యంగా దేశంలో అమ్మాయిల పరంగా గత పరీక్షల్లోనూ సగానికి పైగా సందర్భాల్లో వారే మొదటి ర్యాంకర్లు. 2015-2017 మధ్య ముదితలే తొలి ర్యాంకులందుకోవడం ఇంకెంతో విశేషం. జాతీయంగా; తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌ల రీత్యా ర్యాంకర్ల నేపథ్యాలు చరిత్రాత్మకాలు, స్ఫూర్తిదాయకాలు, ఆదర్శప్రాయాలు. వాటిల్లో కొన్నింటిని సమీక్షించుకుంటే, భారతీయుల్లోని ప్రతి ఒక్కరి హృదయమూ స్పందనతో నిండితీరుతుంది. ఘనవిజయమంటే ఆ ర్యాంకర్లదే. విజేతలంటే నూటికి నూరు శాతమూ వారే!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

అఖిల భారత స్థాయిలో అత్యంత ఉత్తమ ర్యాంకర్ సాధించిన శ్రుతి శర్మది సివిల్స్‌లో ద్వితీయ యత్నం. యూపీలోని బిజ్‌నార్ స్వస్థలమైనా చదువంతా దేశ రాజధాని ఢిల్లీలోనే. ఆధునిక చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యు యేట్. రోజూ వార్తాపత్రికలు చదువుతూ, సొంతంగా నోట్సు రాసుకుంటూ, ఇష్టపడి సివిల్స్ పరీక్షలు రాసిన ఆమె గెలుపు రహస్యం-స్వయం ప్రేరణ. తొలి ప్రయత్నం సఫలం కాకున్నా, అందులో నుంచే పాఠం నేర్చుకుని అగ్రగామిగా నిలిచి గెలిచిన శ్రుతి ఒకే ఒక్క మాట అన్నారు... 'నిత్యసాధన'. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోనే ఆర్థికశాస్త్రం (ఆనర్స్) డిగ్రీ చేసిన అంకితా అగర్వాల్ ఇచ్ఛాపూర్వకంగా ఎంచుకుంది మాత్రం రాజనీతిశాస్త్రం, విదేశీ సంబంధాలు. అందుకే తన ఆలోచనా పరిధి నానాటికీ విస్తరించి రెండో ప్రయత్నంలోనే రెండో ర్యాంక్ వచ్చేలా చేసిందన్నారు. రోజులో సగభాగం చదువులోనే గడిపిన తనకు వనితాశక్తి నిరూపణే జీవితాశయం. తదుపరి ర్యాంకర్ గామినీ సింగ్లా చదువుకుంది బీటెక్ అయినా, ఐచ్ఛిక పాఠ్యాంశం సామాజికశాస్త్రం. ఈ ఎంపికకు కారణం ఏమిటని అడిగితే 'సమాజ సాంకేతికత' అని ఒక్క ముక్కలో బదులిచ్చారు. 'అమ్మా నాన్నా వైద్యాధికారులు. చూశారా, వైవిధ్యమంతా మా కుటుంబంలోనే ఉంది' అంటూ నవ్వులు చిందించారు. పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నప్పుడే తన దృష్టికోణం విస్తారంగా మారిందన్నారు. అంకితభావం అమ్మాయిల సహజ లక్షణం, ప్రోత్సాహం తోడైతే ఎంతైనా ఎదుగుతారనేందుకు తానే నిదర్శనమన్నారామె.

**దీక్షాదక్షతల నెలవు**

తెలుగు అభ్యర్థుల సివిల్స్ సత్తా అసాధారణం. పదిమంది పైగా వందలోపు ర్యాంక్‌ల్లో నిలిచారు. ఉభయ రాష్ట్రాల నుంచీ పదుల సంఖ్యలో ఎంపికయ్యారు. భాగ్యనగరం సైనిక్‌పురివాసి ప్రియంవదది పదమూడో ర్యాంకు. తెలంగాణ నుంచి ఆమె టాపర్. మహారాష్ట్రలో ప్రభుత్వ ఉద్యోగి అయిన నాన్న అశోక్ మదాల్కర్ తనకు స్ఫూర్తి. ఫలితంగా ముంబయి నుంచి పట్టా పొంది, బెంగళూరులో ఎంబీఏ చేశారు. దశలవారీగా సన్నద్ధత కొనసాగించి లక్ష్యం చేరుకున్న ఆ వనిత సమయపాలనకే సమాధిక ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఇంటర్వ్యూ కోసం హైదరాబాద్ పోలీస్ ఉన్నతాధికారి మహేశ్ భగవత్ ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు సభ్యురాలిగా చేరారు. మరో ర్యాంక్ విజేత సంజనది కూడా హైదరాబాద్ నగరమే. బీటెక్ స్వర్ణపతక సాధకురాలు. ర్యాంక్ సాధనలో భర్త హర్ష ఉత్సాహ ప్రోత్సాహాలు ఎన్నో ఉన్నాయి. సివిల్స్ శిక్షణ సమయంలో ఆయనే ఆమెకు మెంటార్! వేరొక ర్యాంకర్ శ్రీపూజ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా. ఆమె బీటెక్ చదువు కర్ణాటకలో. సివిల్స్ పరీక్షల ముందు రోజంతా చదువుతూ, పాఠ్యాంశ విశ్లేషణలు కొనసాగిస్తూ, తనదైన పటిమను నిరూపించారు. ఒకప్పుడు సివిల్స్‌కు ప్రయత్నించిన తండ్రి కలను తనయగా నెరవేర్చాన్నప్పుడు శ్రీపూజ కళ్ల నుంచి ఆనందబాష్పాలు! ఇంకా సాహిత్య, కిరణ్మయి, స్నేహ, మనీషా, శ్రీలేఖ, అనన్యప్రియ, అంబిక, చైతన్య, మౌనిక, పవిత్ర మరెందరో నారీరత్నాలు. పూసపాటి సాహిత్యది విశాఖ ప్రాంతం. ఫార్మసీ చదివిన ఆమెకి సివిల్స్‌లో ఇది ఆరో యత్నం. 'ప్రతిసారీ నాలో పంతం పెరుగుతూ వచ్చింది. అపజయానికి జవాబు చెప్పాలన్న గట్టిపట్టుదలతోనే పగలూ రాత్రీ మనసు పెట్టి చదివి, చివరికి నెగ్గాను' అన్నారు. ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో.సాహిత్యం మీద ఎంతో అభిమానంతో తాత, రచయిత పూసపాటి కృష్ణంరాజు తనకీ పేరు పెట్టారన్నారు. పేరు ప్రఖ్యాతులు నిలబెట్టానన్న సంతృప్తి, సంతోషాలు ఈ విజేత

మాటల్లో ప్రస్ఫుటమయ్యాయి. ఇతర వాటి కంటే ఇండియన్ ఫారిన్ సర్వీసులంటేనే తనకు మక్కువ ఎక్కువన్నారు.

**శ్రమించి సాధించిన తీరు**

అనన్య ప్రియదీ ఆరో ప్రయత్నం. ఏ దశలోనూ నిరాశకు తావివ్వకుండా కష్టపడి చదివి సాధించారు. వరంగల్ ప్రాంతీయురాలైన ఆమె చదివింది ఆర్కిటెక్చర్. ఈ చదువుకోసమే తల్లిదండ్రులతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రి అందించిన ప్రోత్సాహబలంతో, ఆరోసారి యత్నంలో గెలుపు సంపాదించుకున్న అమ్మాయి మౌనిక. చదువంతా హైదరాబాద్ నగరంలోనే. తల్లి భద్రాచలంలో పెట్రోలు బంకు నిర్వాహకురాలు. బీఫార్మసీ చేసి, కొంతకాలం జర్మనీలో రీసెర్చి సాగించి, అటు తర్వాత శ్రమించారు. ఆఖరికి జీవితాశయం నెరవేర్చుకున్న దీక్షాదక్షురాలు. అరుగుల స్నేహ సొంత ఊరు నిజామాబాద్. తల్లి ఒక్కరే కుటుంబానికి ఆధారమైన స్థితిలో, అనేక కష్టనష్టాలకు ఎదురొడ్డి నిలిచారు వనిత. కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకున్న అమ్మకు కాంట్రాక్టు ఉద్యోగం రావడం, ఆ అధికారిక పత్రంపై ఐఏఎస్ సంతకం చూడటం ఈమెలో స్ఫూర్తిని నింపాయి. ఆ మాతృమూర్తి నిరంతర తోడ్పాటుతోనే స్నేహ సైతం తన కలను ఫలింపచేసుకున్నారు.

**సవాళ్లకు సమాధానాలు**

సివిల్స్ పరీక్షలంటే అడుగడుగునా పోటాపోటీ. ఈసారి ఐదు లక్షల మంది రాస్తే, తుదిదాకా నిలిచి వడపోతల్లో గెలిచి, ఎంపికైనవారి సంఖ్య 685. వీరిలో నాలుగోవంతు అతివలే ఉండడం ఎంతైనా దృఢమైన వ్యూహ రచనతో ర్యాంకును వశం చేసుకున్నారు. బ్రెయిలీ లిపి సాయంతో చదువుకుని ప్రభుత్వ ఉపాధ్యాయిని అయిన ఆయుషిదే తరగని చెదరని ఘనత. చరిత్రను బోధించే ఈమె దేశవ్యాప్తమైన సివిల్స్ పరీక్షలో 48వ ర్యాంకును కైవసం చేసుకోవడం చరిత్రను సృష్టించడమే! దిల్లీ పరిసరాల్లోని పల్లె రాణిఖేడా నివాసిని. పుట్టుకతోనే రెండు కళ్లూ కనిపించని విధి వైచిత్రి. అయినా శ్యాంప్రసాద్ ముఖర్జీ కళాశాలలో బి.ఎ. చేసి, సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చరిత్ర ప్రధానాంశంగా ఎం.ఎ. చదివి, అటు తర్వాత దశాబ్దంగా టీచర్ ఉద్యోగం చేస్తున్నారు ఆయుషి. అనంతర కాలంలో సివిల్స్ ర్యాంకర్‌గా వెలుగుతున్న తనకి ఇప్పుడు 29 ఏళ్లు!! దివ్యాంగుల పరంగా నేటి సమాజ దృక్పథం



అంకిత అగర్వాల్



గామిని సింగ్లా



శిక్షకురాలు బాలలత

సివిల్స్‌పై బెంగళూరులో శిక్షణ పొందారు. ప్రస్తుత గెలుపుతో ఐఎఎస్ అర్హత సాధించిన తాను ఆ అధికారిణిగా తనవంతు సేవలు అందిస్తానంటున్నారు.

భాగ్యనగరానికీ సంబంధించిన కొప్పిశెట్టి కిరణ్మయిది తెలంగాణ రాష్ట్రంలో రెండో ర్యాంకు. తొలి యత్నంలో 573, తర్వాతి ప్రయత్నంలో 633వ ర్యాంకు లొచ్చిన ఆమె అనంతర కృషి పర్యవసానంగా ఇప్పుడు 56వ ర్యాంకు సాధించారు మరి. ఉస్మానియాలో ఎమ్.బీ.బీ.ఎస్, ఎమ్.ఎస్. సర్జన్ తన వృత్తి నేపథ్యం. సూర్యాపేట ప్రాంతీయురాలు చైతన్యరెడ్డికి 161వ ర్యాంకు. నీటిపారుదల శాఖ అధికారిణిగా పనిచేస్తూనే సివిల్స్ పరీక్షలు రాసి విజయ కిరీటం అందుకున్నారు. తన ఈ గెలుపును ప్రముఖంగా సోదరుడు రవికిరణ్‌కి అంకితం చేశారీమె. జూబ్లీహిల్స్ నివాసిని పవిత్ర హైదరాబాద్, బెంగళూరుల్లో చదివారు. సివిల్స్ ఇంటర్వ్యూ మునుపు ఆరు మార్కుల తేడాతో దక్కకుండా పోయిందని బాధపడకుండా అవిశ్రాంతంగా పరిగణనీయం. ప్రాథమిక, ప్రధాన, మౌఖికాల్లోనే కాదు; జీవిత పరీక్షల్లోనూ స్త్రీలే కృతార్థులు. ర్యాంకర్లలో ఒకరైన శివాంగి మెట్టినింట హింసను ఎదుర్కొన్నారు. పుట్టింటికి తిరిగొచ్చి తనవారి పరిపూర్ణ అండదండలతో నెగ్గి ఈ అధికారిక హోదాను సొంతం చేసుకొన్నారు. ఈమెది హాపూర్ (ఉత్తరప్రదేశ్). పెళ్లయ్యాక కట్నం వేధింపులు ఎక్కువయ్యాయి. కలలన్నీ కల్లలవడంతో తల్లిదండ్రుల దగ్గరికి చేరాల్సి వచ్చింది. సామాన్య కుటుంబం. తనకు చిన్నారి పాప. ఇన్నీ ఆందోళనలూ, సందేహాలూ సమస్యల మధ్యనే సివిల్స్ రాసి ర్యాంకు అందుకున్నారీమె. 'పరీక్షలు ఎదురవడం, వాటిని తట్టుకుని నిలబడటం నాకు అలవాటైంది' అనడం తన ధీరతకు ప్రతీక. ఎక్కడా ఎటువంటి శిక్షణ లేకుండానే సివిల్స్ టాప్ టెన్‌లో నిలిచిన ఆణిముత్యం ఇషిత. ఈమెది దిల్లీ. తల్లిదండ్రులది పోలీసుశాఖ. వనితా సాధికారతకు పరితపించే ఈ పాతికేళ్ల యువతి మద్రాసులో పీజీ చేశారు. స్వయం శిక్షణ, సంపూర్ణ ఆత్మవిశ్వాసం, మారాల్సిన అవసరం ఎంతో ఉందన్నది ఆమె నిశ్చిత అభిప్రాయం.

**ధన్యచరిత బాలలత**

ఆత్మశక్తి, విశ్వాసాలే రెండు కాళ్లుగా సదా ముందడుగు వేస్తున్న; అందరితోనూ వేయిస్తున్న మల్లవరపు బాలలత జీవితం చరితార్థం. సివిల్ సర్వీసు పరీక్షలకు హాజరయ్యే తెలుగు రాష్ట్రాల అభ్యర్థులందరికీ ఈ హైదరాబాద్ మణిదీపిక చిర పరిచిత ఆత్మీయురాలు. తమ శిక్షణనిచ్చిన వారిలో ఇప్పటికే వందమంది విజేత స్థానాల్ని అలంకరించారు. ఇటీవల ఫలితాల్లోనూ 14 మంది ర్యాంకర్లు ఈమె శిష్యులే! ఈ గుంటూరు ప్రాంతీయురాలు న్యాయశాస్త్రం విద్య వరకూ ఎప్పుడూ ప్రథమురాలే. తొలి యత్నంలోనే ఆనాడు ర్యాంకు సాధించి అధికారిణిగా ఉంటూనే సివిల్స్ అభ్యర్థులకు మార్గదర్శకురాలిగా వ్యవహరిస్తూ, హైదరాబాద్‌లో శిక్షణ సంస్థ స్థాపన ద్వారా మెంటార్ స్థానాన్ని సుస్థిరం చేసుకున్న బాలలత ధన్యచరితురాలు. ★

కథ

మనిషి వాక్యం ఫలిస్తుందా, మనిషి దృష్టి చెడ్డదా! నిజమేనన్నట్లుంది గుడి స్థితి. ధ్వజస్తంభం విరిగింది. గోపురం ఒరిగింది. తలుపులు విరిగాయి. మెట్ల బండలు పగిలి లోపలి కెళ్లడం కష్టంగా ఉంది. మండపం గర్భగుడిలోకి విస్తరించింది. నవగ్రహాలు వెలవెల బోతున్నాయి. మూలవిరాట్టు చిన్నబోయి ఉన్నాడు. అయ్యగారు ఏమయిందు? ఆలోచిస్తూ గుడివైపు ఒక అడుగు వేయగానే, కాకి ఒకటి తన్నిపోయింది. మొండిగా గుడిలో అడుగేశాను. ఊరి జనంతో కిటకిటలాడిన గుడి, గబ్బిలాల వాసనతో నిండింది. అయ్యగారి కొడుకు ఏమయిండు? ఆలోచిస్తూ రెండడుగులు వేశాను. తెగిపడిన గుడిగంట పై కూచున్న కోతి భయంకరంగా అరిచింది. వెనకడుగు వేశాను.

ఆరోజు ఊర్లో జరుగుతున్న ‘గుడిసభ’కు హాజరవ్వాలని బయల్దేరాను. దశాబ్దం క్రితం వదిలి వెళ్లిన ఊర్లోకి మళ్ళీ ఇప్పుడే ప్రవేశించడం. పొట్టచేత పట్టుకొని ఊరు విడవడం మంచిదయింది. ఇక్కడే ఉంటే నా జీవితం కూడా గుడిలాగా బండల పాలయ్యేది. ఊరునే పట్టుకొని ఉన్న కొంతమంది

# ధార్మిక

## డా॥ బి.వి.ఎన్. స్వామి



పెద్దలనుండి రమ్మని కబురొచ్చింది. “ఒకప్పుడు ధూపదీపనైవేద్యాలతో కళకళలాడిన గుడి పాడు బడింది. దాన్ని బాగు చెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మీ సలహా సహకారాలు కావాలి. మన ఊరు వాళ్లందర్నీ పిలుస్తున్నాం. మీరు కూడా రండి.” అని ఫోన్ కాల్ వచ్చింది. స్థిరాస్థులు, చరాస్థులు ఏవి లేకున్నా ఊరు నన్ను తల్లిలా పెంచి పోషించింది. అమ్మరెక్కల కష్టం మీద సాకింది. అమ్మకు అన్నివిధాల అండగా నిలిచింది ఊరు. ముఖ్యంగా ‘అమ్మగారు’, ఆమె కొడుకు, నేను ఒకే తరగతి. అట్లా ఎప్పుడూ వాళ్లింటికి వెళ్ళేది. ఎక్కువగా వాళ్లింట్లోనే ఉండేది. నాటి కాలాన పౌరోహిత్యంతో వాళ్ల కడుపులు సగం నిండేవి. వాళ్లతో పాటు నా కడుపు సగం నిండేది. అంతా అమ్మగారి చలవ. వాళ్లను కలవడానికే బయల్దేరాను. “గుడిసభ” ఒక నెపం.

పంచాంగం చేతపట్టుకొని అయ్యగారు దిక్కులు చూస్తున్నారు. “వత్తులు” చేసుకుంటూ అమ్మగారు కూర్చున్నారు. వాళ్లిద్దర్నీ చూడగానే కడుపులో దేవినట్టయింది. ఎత్తయిన తంతెల మీద ఉన్న వాళ్ల పెంకుటిల్లు, నేలబారు అయింది. రోడ్డు ఎదిగింది. ఇల్లు దిగబడింది.

‘‘అయ్యగారు! నమస్కారం’’ చేతులు జోడించాను.

“ఎవరూ? శేఖరా!” అరిచినట్లుగా అంది అమ్మగారు

“బాగున్నారా అమ్మా”

“ఏం బాగు నాయనా, ఒంటరి పక్షుల మయ్యాం”

“నరేష్ లేడా? ఏం చేస్తున్నాడు ? వాడికి పెళ్లయిందా? చాలా ఏళ్లయింది చూడక.”

“వాడు పట్నంలో ఏదో పనికి కుదిరిండు. సత్రం భోజనం, మఠం నిద్ర అన్నట్లుంది వాడి బతుకు. ఇంతకూ నీవెప్పుడు తిన్నవో.” అంటూ లేచింది.

‘‘వాడు భ్రష్టుపట్టిపోయాడు’’ అరిచిండు అయ్యగారు. అతని కంఠంలో కోపం తాండవించింది. భయం వేసింది. నరేష్ ఏం చేస్తున్నట్లు? కోవెల లాంటి ఆ ఇల్లు పాడుబడ్డ గుడిలా ఉంది. ఆ ఇల్లు ఇట్లా ఎందుకయింది?

పొయ్యిలో నుండి పిల్లి ఇప్పుడే లేచినట్లుంది. ఒళ్లు విరుచుకుంటుంది. సెల్‌ఫోన్‌లో సమయం మధ్యాహ్నం రెండు చూపిస్తుంది. అమ్మగారు రెండు చేతులా జామపళ్లు తెచ్చి ఇచ్చింది. దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏమివ్వగలను వీరికి? అనిపించింది.

“అమ్మా, ఈ రోజు నరేష్ వస్తడా”

“రావాలె, వస్తడు. గుడిసభ జరుగుతుంది. తప్పక వస్తడనుకుంటున్న” అంటూ ఇంట్లోకెళ్లింది.

నాకళ్లు పూలసజ్జ కోసం వెతికాయి. వాళ్లది రెండు గదుల ఇల్లు. ఈ గదిలోనే ఏదో ఒక మూలకు ఉంటుందని మనసు చెబుతుంది. కళ్లు నాలుగు చెరగులా గాలించాయి. ఆ మూలన గోడకు దిగిన కట్టెకొయ్యకు వేలాడుతూ సజ్జ కనిపించింది. అది ఉరితాడుకు వేలాడుతున్న మనిషిలా ఉంది. ఆ సజ్జకు, అమ్మకు ఉన్న బంధం గుర్తుకొచ్చింది. ప్రతిరోజు పూలసజ్జ నిండా పూలు ఏరి తెచ్చేది అమ్మ. వాటిని అమ్మగారు మాలలుగా కుట్టేది. వాటిని గుడి ముందు పెట్టుకొని, తృణమో, ఫణమో సంపాదించేది అమ్మ. వచ్చిందాంట్లో ఎంతిస్తే అంత అమ్మగారు పుచ్చుకునేది. “రామక్కా! నువ్వు పూలు తెస్తేనే కదా, నేను మాల అల్లేది” అనే అమ్మ గారి మాటలో



సహజన్యాయం తొణికిసలాడేది. అమ్మ కూలి పనికి పోయిన రోజు పూలసజ్జ వెలవెల బోయేది. ఈ పనులతో నిమిత్తం లేకుండా, నా కడుపు కొబ్బరి ముక్కలతో, పప్పు బెల్లాలతో, ప్రసాదంతో ఎల్లప్పుడూ నిండేది. అమ్మ పోయింది. నేను ఊరు విడిచిపోయాను ఉన్న ఊర్లోనే అమ్మగారు అనాథ అయ్యారు. నరేశ్ ఉండీలేనివాడెట్లా అయ్యాడు?

"నాయనా, నీళ్లు తాగు" అంటూ రాగి చెంబు నిండా నీళ్ళు తెచ్చిచ్చింది అమ్మగారు.

పళ్ళు, నీళ్లు పక్కన పెట్టి, కాళ్ళు కడుక్కోవడానికి ఇంటి వెనకకు వెళ్లాను. మట్టికుండలు స్వాగతిం చాయి. సొట్ట పోయిన చెంబొకటి పేదగా పలకరించింది. జామచెట్టు ఆప్యాయంగా ఆహ్వానించింది. చల్లటి నీళ్లు మెడపైన ముఖంపైన పడగానే అలసట మటుమాయమయింది. కాళ్ళు, చేతులు కడిగి, ఒళ్లు విరుచుకుంటూ పైకి చూసాను. ఒక్కసారి ప్రపంచం గిర్రున తిరిగినట్లయింది. ఎదురుగా, జామచెట్టు కొమ్మల్లో ప్రశాంతంగా కూర్చుని ఉంది కోతి. ఇది గుడికోతి కాదుకదా! అనుకుంటూ అక్కడి నుండి జారుకున్నాను.

ఇంట్లోకి చేరేసరికి "వాడీరోజు రానీ, కాళ్ళు చేతులూ విరిచి కూచోపెడుత. పట్నంలో వాడు చేసేపని తక్కువ. వెలగబెట్టే నిర్వాకం ఎక్కువ" హుంకరిస్తున్నాడు అయ్యగారు.

"నాయనా పండ్లు తిని నీళ్లు తాగు కడుపు చల్లబడుతుంది." అంది అమ్మగారు.

పండ్లు, నీళ్లు ముందుపెట్టుకొని కింద కూర్చు కున్నాను. "కూర్చుండ మా ఇంట్ల కుర్చీలు లేవు." కవితాపంక్తి గుర్తుకొచ్చింది.

"అమ్మా మీ భోజనం అయిందా"

"ఈ రోజు మంగళవారం కదా, ఒక్కపొద్దు మాకు"

జామ ముక్క గొంతుకడ్డం పడ్డట్టయింది. వెంటనే నీళ్ళు తాగిన. ఇంటిముందు కాకి అరుపులు వినిపించాయి.

"పొద్దున నుండి కాకి అరుస్తుందెందుకో" విసుక్కున్నాడు అయ్యగారు.

"శేఖర్ వస్తున్నాడని ముందే తెలిపింది. కాని మనకది అర్థం కాలేదు" అంది.

"ఇప్పుడు కూడా అరుస్తున్నదెందుకు?" అసహనంగా అన్నాడు.

"నరేష్ వస్తున్నాడని కావచ్చు"

అమ్మగారి పాజిటివ్ వైఖరి స్థిమితత్వాన్ని పంచింది. జామపండ్లు, మంచినీళ్లు కడుపు నింపాయి.

"అమ్మగారు! అద్దాలు కుట్టడం అయిందా" అంటూ వచ్చిందొకావిడ.

"రేపు తీసుకోండి"

"ఈసారి ఆలస్యం అయింది.

"అవును కొంచెం ఆరోగ్యం బాగాలేదు"

"రేపైతే తప్పనిసరి ఇవ్వండి. ఇవ్వాళ్లేదో గుడిసభ జరుగుతుందట. ఎందుకు?

"గుడిని బాగుచేయాలని అంటున్నారు. ఏమైతదో చూద్దాం...

"సరే. నేను రేపు వస్త" అంటూ వెళ్లింది.

"అమ్మా! ఈ ముసలితనాన అద్దాలెందుకు కుడుతున్నరు." అన్నాను.

"పౌరోహిత్యంతో కడుపునిండడం లేదు. ప్రతిరోజు ఒక్క పొద్దులుండలేం కదా" అంది.

"ఎంత అడిగినా, నరేష్ గురించి చెప్పడం లేదు మీరు" ఉక్రోషంతో అన్నాను.

"చిన్న కులంలోపుట్టిన నీవు మంచి గుణ వంతుడివయ్యావు. పెద్దకులంలో పుట్టిన వాడు జులాయి వెధవయ్యాడు"

"మంచి, చెడులకు కులాలుండవు. మనుషులకు ఉండక తప్పవు. అందుకే కులాతీత సమాజం కోసం కలకంటున్నాం"

"నీ మాటలు నాకు అర్థం కావడం లేదు. నరేష్ మాత్రం కట్టుతప్పి వ్యసనాల పాలయిండు. చేతికి రాకుంటయిండు" ఆ రంధి అయ్యగారి ఆరోగ్యం చెడింది"

"గుడి పాడుబడ్డట్టయింది. ఎందుకు?"

"అయ్యగారు తన జీవితాన్నంతా గుడికి ధార పోసిండు. గుడి ప్రాంగణాన్ని, దేవతా విగ్రహాలను, తనే స్వయంగా శుభ్రం చేసేవారు. ఊర్లోని కొందరు ధర్మకర్తలుగా మారి ధూప దీప నైవేద్యాలకు నిధులు సమకూర్చారు. అయ్యగారి ఆరోగ్యం చెడింది. ధర్మకర్తల్లో ఒకరు కాలం చేశారు. కొందరు పిల్లల దగ్గరికని పట్నం వెళ్ళారు. అలా అందరూ గుడికి దూరం అయ్యారు. గుడిపాడు బడింది. కూలింది. చెడ్డపనులకు వేదిక అయింది. స్త్రీల ఆర్తనాదాలకు నెలవయింది. నిత్యం తొణికిసలాడే జీవచైతన్యం అంతరించి, అక్కడ శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది. పూర్వ వైభవం

మళ్లీ ఎప్పుడో....." అంటూ నిట్టూర్చింది.

"అమ్మగారు! నాకు తీర్థం ఇవ్వండి" అంటూ లేచిండు.

ఇంట్లో కెళ్లింది. దేవుడిముందున్న తీర్థ పరిక రాల్ని, పాత్రల్ని తీసుకొంది. బయట కొచ్చింది. ఉద్ధరిణితో తీర్థం ఇస్తూ,

**"అకాల మృత్యు హరణం**
**సర్వవ్యాధి నివారణం**
**సమస్త పాప క్షయకరం**
**శ్రీ విష్ణు పాదోదకం, పావనం శుభం"**

అంటూ దీవించింది. తీర్థం కళ్ల కద్దుకొని సేవించాడు. రెండు ఐదువందల నోట్లను తీర్థ పరికరాల మధ్య ఉంచి ఆమెకు పాదనమస్కారం చేశాడు. ఆమె గుండె ఎందుకో నీరయింది. ఆ నీరు ఆమె కళ్ల నుండి జారి అతని తలపై పడింది. అది వ్యాఖ్యకు అందని దృశ్యం. అది హేతువుకు అందని బంధం.

ఆ పల్లెకు బస్సు సౌకర్యం కలగడం అభివృద్ధి. ఆ ఊర్లో రెండే పెద్ద కూడళ్ళు. ఒకటి మసీదు కూడలి. రెండవది బొడ్రాయి కూడలి. మసీదు కూడలే బస్టాండు చౌరస్తా అయింది. బొడ్రాయి కూడలి తెలంగాణ చౌరస్తా అయింది. ఆ ప్రాంత గ్రామ సభల్లాంటివి అక్కడే జరుగుతాయి. గుడిసభ అక్కడే జరుగుతుంది. టెంటు, మైకు, కుర్చీలు, భక్తి పాటలతో ఆ ప్రాంతం హోరెత్తిపోతోంది. వేదిక మిలమిలలాడుతుంది. దానిపై రెండు వరసల కుర్చీలు ఎదురుచూస్తున్నవి. ఊరి ప్రజలు ఒక్కొక్కరే వచ్చి కూర్చుంటున్నరు. అంతా నలభై వయసు దాటినవారే. నిర్వాహకుల రూపంలో యువకులు హడావిడి చేస్తున్నరు. అక్కడ అనేక సంగతులు జ్ఞాపకాలుగా వ్యాపిస్తున్నయి. రకరకాల ఊహలు పురుడు పోసుకుంటున్నవి. బోలెడన్ని వార్తలు నానుతున్నవి. "పెద్దయ్యగారు వస్తున్నాడట". "ఆయన రాసిన పుస్తకం అందరికి ఇస్తడట", "ఆయన రాసింది మనకు అర్థమయితదా". "ఆయన ఊరి బాగుకోసమే రాస్తడు, పనిచేస్తడు, "ఉద్యోగమచ్చి జరంత తెల్లగ బతుకుతుండు. లేకపోతే చిన్నయ్య గారి లెక్కనే చిన్నపంచె భుజానేసుకుని కూసుంటుండె." "సభలు, సాహిత్యం అనుకుంటూ తిరుగుతడట'', "ఈ సభకూడా ఆయన పూనుకుంటేనే జరుగుతుందట", "ఆయన దేశాలు పట్టుకుని తిరుగుతుంటే ఆయన భార్య ఇల్లు చక్కపెట్టుకుంటదట', "ఆ ఇంటికి చుట్టాల తాకిడి ఎక్కువట", "ఆ ఇంట్లో ఎప్పుడు పది మందికి తక్కువ కాకుండా భోజనాలు చేస్తరట", "అయ్యగారి చేతికి ఎముకలేదట" "చేసి, చేసి అమ్మగారి చేతులు అరిగినయట'' "చిన్నయ్యగారు గుడిని తప్ప, కొడుకును పట్టించుకోలేదు". "పోరడు తెలివి గల్లోడే కాని సోపతుల తోటి చెడిపోయిండు". "చిన్నయ్య గారు జల్దే కూలబడ్డడు"."అమ్మగారు కుట్టే విస్తార్లు– ఊర్లో దొరికే ఉప్పు పప్పు ఆ ఇంటికి ఆధారం అయినవి''. ''నరేష్ గాడు మంచోడైతే గుడి చేసుకుంటుండే, ఇల్లు మంచిగుంటుండే". నరేష్ గురించి వినపడగానే నా చెవులు నిక్కపొడు చుకున్నవి. "వాణ్ణి బాగుచేసేవాడెవ్వడు?" అనే ప్రశ్న తొలిచింది. "కావు కావు" మంటూ కాకి అరుస్తూ వెళ్లింది.నా ఒళ్లు ఝల్లుమంది.

"కొద్దిసేపట్లోనే సభా కార్యక్రమం మొదలవు తుంది'' అని ప్రకటించారు. ఊరి సర్పంచ్. గ్రామప్రజలు అందరూ వచ్చారు. ఊరు విడిచి వెళ్లిన వాళ్లలో కొందరు కనిపించారు. ఒకరిద్దరు తప్ప అందరూ కొత్తగా అనిపించారు. నిర్వాహ కులు హడావిడిగా ఉన్నారు. కాసేపటికి కారులో పెద్దయ్య గారు, అతని భార్య దిగారు. వారితో చిన్నయ్యగారు అమ్మగార్లు కూడా దిగారు. వాళ్లను సాదరంగా తీసుకొచ్చారు. పెద్దయ్యగారు వేదిక ఎక్కుతే మిగతా వాళ్లు ముందు వరుసలో కూర్చున్నారు. నేను వెళ్లి వాళ్ల వెనకాలే కూర్చున్నాను. సభ ప్రారంభ మయింది. వక్తలు మాట్లాడ ుతున్నారు. మైకులు వేదెక్కు తున్నవి. వేదిక పైన ఉన్నవారు ఒకరితో ఒకరు, కొందరు వారిలో వారు ముచ్చట్లాడు తున్నారు. శ్రోతలకు పరీక్ష, వక్తలకు ఆటవిడుపు అన్నట్లుంది పరిస్థితి. ప్రజల్లో నుండి అరుపులు వినిపిస్తున్నవి. చివరికి పెద్దయ్యగారు మాట్లాడటానికి నిలుచున్నాడు.




"అందరికి నమస్కారం మాట్లాడిన ప్రతివారూ ఆలయ పునరుద్ధరణకు సుముఖంగానే ఉన్నారు. ఆధ్యాత్మిక, వ్యాపార, ఉపాధి, మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతత, ఆటపాటలు, సంస్కృతి, సంప్రదాయం, మంచి చెడుల విచక్షణ, నైతిక శిక్షణ, పురాణ కాలక్షేపం, విశ్రాంత స్థలం, ఆహ్లాదకర వాతావరణం ఇవన్ని ఒకచోట దొరికే చోటు గుడి. అదొక బహుళ సదుపాయ లోగిలి. అలాంటి దాన్ని మనం పోగొట్టుకున్నాం. దానికి గల కారణాలను అన్వేషించడం కంటే, తిరిగి సాధించుకునే సంకల్పం చెప్పుకోవడం ఉత్తమం. అందులో భాగంగానే ఈ సభ. ఇది గుడి కోసం జరిగే సభ. భారత రాజ్యాంగం ఆదేశించినట్లు, శిథిలాలయాలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వం ద్వారా ఆ పని సాధించడానికి మన ప్రజాప్రతినిధులు పాటుపడాలి. నిధుల సమీకరణకు దాతలు ముందుకు రావాలి. ఈ పనులన్నీ జరపడానికి ఆలయ కమిటీని ఏర్పరచుకుందాం. కేవలం సభ జరుపుకొని చేతులు దులుపుకుంటే లాభం లేదు. ఆచరణకు నడుం కడదాం. "ధూపదీపనైవేద్యాలకు కావల్సిన డబ్బు కోసం అధికారులతో సంప్రదిద్దాం. అందుకు యువకులు ముందుకు రావాలి. కులాతీత మతాతీత స్థలంగా గుడిని మార్చుదాం. కనపడే డబ్బు, వస్తువులు, ఎంత ప్రధానమో కనపడని నీతి, రీతి అంతే ప్రధానం, వీటిని సాధించడానికి, మనిషి ప్రవర్తనను తీర్చిదిద్దడానికి ఆధ్యాత్మిక ప్రాంగణం అవసరం. అందుకోసం ఇప్పటి నుండే పని ప్రారంభిద్దాం." అని కూర్చున్నాడు.

"ఆలయ పునర్నిర్మాణానికి, నావంతు బాధ్యతగా మొదటి వ్యక్తిగా వెయ్యి రూపాయలు విరాళం ఇస్తున్నాను" అని చిన్నయ్యగారు ప్రకటించారు.

వేదిక పై ఉన్నవారు ఆశ్చర్యంలో మునిగారు. ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. పెద్దయ్యగారు కమిటీని ప్రకటించారు. అమ్మగారు, తన కొంగుకున్న రెండు ఐదువందల నోట్లను చిన్నయ్యగారికి అందించారు. దాన్ని కమిటీ వారికిచ్చారు. ఒక్కొక్కరు తమ విరాళాల్ని ప్రకటించారు. అప్పటికప్పుడు కొంత డబ్బు పోగుపడింది. ఆ బలంతో ముందు చేయాల్సిన పని నిశ్చయమైంది. అమ్మగారి చేయి మంచిది. గుడిపని ఆమెతో మొదలైంది. ఇది కొనసాగి పూర్తి అయితదనే నమ్మకం కుదిరింది. మనసులోనే ఆమెకు నమస్కరించి, నా వంతు విరాళం అందించాను. వచ్చిన పని పూర్తయింది. పట్నం బయల్దేరే ముందు అమ్మగారి సెల్‌నెంబర్ తీసుకున్నాను. గుడిపనులు చకచకా జరుగుతున్నవనే విషయం తెలుస్తుంది.

అయ్యగారు, అమ్మగారు ఇద్దరు ఊరువదిలి వెళ్ళారని తెలిసింది. ఆశ్చర్యపోయి అమ్మగారికి ఫోన్ చేశాను.

"అమ్మా! ఎందుకట్లా చేశారు"

"ఊర్లో జరుగుబాటు కరవైంది"

''ఈ ముసలితనాన కొత్త చోట ఎలా ఉంటున్నరు"

"పౌరోహిత్యం కడుపునింపటం లేదు. ఉన్న ఊర్లో కొత్తపని చేయ మనసొప్పలేదు. చిరిగిన చిన్నపంచె తప్ప అయ్యగారికి మిగిలిందేమీ లేదు. నేను చేసే పనులు వేన్నీళ్లకు చన్నీళ్లలా ఉండేవి. అవి కడుపు నింపడం లేదు."

"ప్రస్తుతం ఏం చేస్తున్నారు"

"పెద్దయ్య గారింట్లో ఉంటున్నము. అక్కయ్య రమ్మన్నది"

"వారికి ఇబ్బంది కలగదా"

"అక్కయ్య వాళ్లింట్లో ఎప్పుడూ పదిమంది ఆశ్రితులుంటరు. వారి ఇల్లొక ధర్మసత్రం. పెద్దయ్యగారి కొరకు వచ్చే పోయే వాళ్లతో ఇల్లు సందడిగా ఉంటది. పనంతా అక్కనే చేసుకుంటది. కుటుంబ భారం నెత్తిన వేసుకొని మోస్తుంది. వారాలు చేసుకుని చదివే అబ్బాయిలు, రోజుకొకరు వస్తుంటరు. మొసమర్లని పని ఉంటది. అక్కకు చేదోడు, వాదోడుగా ఉన్నట్లుంటదని ఇక్కడే ఉంటున్నం."

"అమ్మగారు! ఎప్పటి కయినా మీరు ఊరికి వెళ్ళాలె. సొంత కాళ్లపై నిలబడి బతకాలె. అందుకు నేనేమైనా సహాయం చేయగలను. నన్ను మీరు ఆదేశించండి. చెప్పిన పని చేస్తాను."

"కడుపున పుట్టిన కొడుక్కు లేని దయ నీకు ఉండడం నేను చేసుకున్న పుణ్యం. మా అక్క అందరి లాంటిది కాదు. ఆమె తన దగ్గరున్న డబ్బుతో మా బంధువుల పిల్లల "ఉపనయం" చేయించింది. తనకు ఆడపిల్లలు లేరని, పెళ్లి చేయలేని స్థితిలో ఉన్న బంధువుల అమ్మాయి పెళ్లి తను దగ్గరుండి చేయించింది. చక్కటి పొదుపరి. వ్యవహార కర్త. ఉన్నన్నాళ్లు అక్కదగ్గరే ఉండి, ఆమె చేసే పనుల్లో పాలుపంచుకుంట. దానివల్ల పుణ్యం దక్కడమే కాదు. మా ఇద్దరి కడుపు కూడా నిండుతుంది."

"సరే, అమ్మా నీ కడుపున పుట్టక పోయినా నీ పెంపకంలో పెరిగిన వాణ్ణి. నీ కోసం ఏ సహాయం అయినా చేయగలను" అంటూ సెల్ పక్కన పెట్టాను.

ఏడాది కాలం గిర్రున తిరిగింది. మధ్య మధ్యన అమ్మగారి క్షేమ సమాచారాలు తెలుసుకోవడం అలవాటయింది. గుడి పనులు వేగం పుంజుకున్నాయి. దాదాపు పని పూర్తికావచ్చని తెలిసింది. ఊరివాళ్లు అయ్యగారిని రమ్మని కబురు పెడితే వెళ్లాను. ఆగమశాస్త్రం ప్రకారం అయ్యగారు దగ్గరుండి పనులన్నీ చేయిస్తున్నారు. కూలిన భాగాల్ని పునరుద్ధరించారు. గుడి ప్రారంభానికి ముహూర్తం

"కడుపున పుట్టిన కొడుక్కు లేని దయ నీకు ఉండడం నేను చేసుకున్న పుణ్యం. మా అక్క అందరి లాంటిది కాదు. ఆమె తన దగ్గరున్న డబ్బుతో మా బంధువుల పిల్లల "ఉపనయం" చేయించింది. తనకు ఆడపిల్లలు లేరని, పెళ్లి చేయలేని స్థితిలో ఉన్న బంధువుల అమ్మాయి పెళ్లి తను దగ్గరుండి చేయించింది. చక్కటి పొదుపరి. వ్యవహార కర్త. ఉన్నన్నాళ్లు అక్కదగ్గరే ఉండి, ఆమె చేసే పనుల్లో పాలుపంచుకుంట. దానివల్ల పుణ్యం దక్కడమే కాదు. మా ఇద్దరి కడుపు కూడా నిండుతుంది."



నిర్ణయించారు. ఆలయ కమిటి సమావేశమయింది. ప్రారంభానికి పెట్టాల్సిన ఖర్చును లెక్కతేల్చి డబ్బును అయ్యగారికిచ్చారు. ధూపదీపనైవేద్యాలకు, సంప్రోక్షణాది కార్యాలకు, అలంకరణకు కావాల్సిన సామాగ్రి తెప్పించారు. ప్రారంభ కార్యక్రమానికి కబురొచ్చింది. సంతోషంగా వెళ్లాను. పచ్చ తోరణాలతో, రకరకాల పూలమాలలతో గుడి ప్రాంగణం కాంతులీనుతుంది. గుడి పని, పైనపడగానే అయ్యగారి ఆరోగ్యం బాగైనట్లుంది. గర్భగుడిలో అయ్యగారి మొహం కళకళ లాడుతుంది. ప్రారంభోత్సవం పూర్తయింది. అన్నదాన కార్యక్రమం మొదలయింది. ఊర్లో వాళ్లందరు ఆనందంగా పాల్గొన్నారు. ఉమ్మడి పండగ ఊరంతటికి సంతోషాన్ని పంచింది. పిల్లా పాపా అందరు దైవదర్శనం చేసుకొని ఒక కొత్త తృప్తితో వెళ్ళారు. ఆలయకమిటీ సభ్యుల కళ్లల్లో విజయగర్వం తొంగిచూసింది. అయ్యగారు, అంతటా తానై తిరిగారు. తినకున్నా కడుపునిండినట్లు కనిపించారు. సాయంత్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో "ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం" ఉందని ప్రకటించారు. సమావేశానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాను. అంతవరకు అమ్మగారి వద్ద ఉండి వెళ్ళాలనుకుని వారి ఇంటికి వెళ్లాను.

"రా నాయనా" అంటూ ఆహ్వానించింది.

"అమ్మా, బాగున్నారా. ఈ రోజు అయ్యగారి మొహం అందంగా కనిపించింది"

"నిజమే పని వల్లే మనిషిలో జీవచైతన్యం తొణికిసలాడుతుంది. భోజనం చేశావా."

"గుళ్లోనే చేశాను. ఇపుడు గుడి మునుపటిలా ఉంది"

"గుళ్లోని దైవానికి ధూపదీపనైవేద్యాలకు, అర్చకునికి జీతం ఇవ్వడానికి శాశ్వత నిధి ఒకటి ఉంటే బాగుండేది"

"ఇప్పుడు జరిగే సమావేశంలో ఈ ప్రస్తావన తెస్తా"

"నీవే బాగా ఆలోచించి, సలహా ఇవ్వు. అది గవర్నమెంట్ పని అంటున్నారు" బేలగా అంది.

"ఎందుకమ్మా ఆ విషయం నేను చూసుకుంటా" ధీమాగా అన్నాను.

కాసేపు కూర్చుండి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్ళాను. అప్పటికే అక్కడ కొంతమంది ఉన్నారు. రావాల్సిన వారు వచ్చారని అనుకున్నాక సమావేశం మొదలయింది. కమిటీ కోశాధికారి లెక్కలన్ని పూసగుచ్చినట్లు వివరించాడు. ప్రధాన కార్యదర్శి ఆ ఏడాదంతా జరిగిన విషయాల్ని నివేదిక రూపంగా విన్నవించాడు. ఒకరిద్దరు జరిగిన అభివృద్ధి గురించి తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు. చివరగా అధ్యక్షుడు మాట్లాడుతూ రెండు సమస్యల్ని ముందుంచాడు. (1) ప్రతినెలా అర్చకుని జీతభత్యాలు, (2) ప్రతినెలా ఆలయానికి పెట్టాల్సిన ఖర్చులు. ఈ రెండింటిని ఎట్లా అధిగమించాలో తెలియట్లేదన్నాడు. ఈ రెంటికి కలిసి నెలకు పదివేలు అవసరమని అంచనాకు వచ్చారు. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే సహాయంతో గవర్నమెంటు ద్వారా ఇప్పిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చాడు. అప్పటి వరకు డబ్బులు లేకుండా పని జరిగేదెలా? అని కమిటీ ప్రముఖులు తలలు పట్టుకున్నారు.

"ఒక సంవత్సరం పాటు గుడి ఖర్చు కొరకు నెలకు రెండువేలు నేను ఇస్తాను" అన్నాను.

నాలాగే మరికొందరు ముందుకొచ్చారు. తాత్కాలికంగా సమస్య పరిష్కారమయింది. సంధ్యాకాలం సమీపించింది. అందరి వద్ద సెలవు తీసుకొని బస్టాండ్‌కు బయల్దేరాను. "మళ్లీ ఎన్నాళ్లకో వచ్చేది'' అనుకొని మధ్యలో గుడికి వెళ్లాను. అస్తమిస్తున్న సూర్యకాంతిలో గోపురం కొత్తరంగు లద్దుకుంది.

గుడిలో అడుగుపెట్టగానే, ధ్వజస్తంభంపైనున్న కాకి ఎగిరిపోయింది. గుడి మండపంలో అడుగెట్టగానే, అక్కడున్న కోతి మెల్లగా పక్కకు తప్పుకుంది. కళ్లు మూసుకొని పది నిమిషాలు ధ్యానించాను. తనువు మనసు తేలికయ్యాయి. ఇంటికి పయనమయ్యాను. ★

ప్రతి సంవత్సరం శిక్షావర్గ జరుగుతూ ఉంటుంది. కరోనా వలన ఈ రెండేళ్లు ఆగింది. కానీ సంఘ కార్యం ఆగలేదు. మైదానంలో శాఖలు ఆగాయి. కానీ స్వయంసేవకుల ఇళ్లలో జరిగాయి. అయితే సంఘ కార్య స్వరూపం మారింది. కరోనా పీడితులకు సేవ చేయడమే సంఘ కార్యం అయింది. సంపూర్ణ హిందూ సమాజంతో కలసి లక్షలాది మంది స్వయంసేవకులు కొవిడ్ సమయంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు చేశారు. ఆ విధంగా కూడా వారికి తగిన శిక్షణ లభించింది. ఇక్కడ ఈ రోజు తృతీయవర్ష శిక్షార్థులు దండ, నియుద్ధ, సమత వంటి శారీరక ప్రదర్శనలు చేశారు. ఇవన్నీ మనకు వివిధ రకాలుగా కనపడినా ఈ దేశాన్ని పరమవైభవ స్థితికి చేర్చడానికి కావలసిన యోగ్యతను సంపాదించి పెట్టే ప్రశిక్షణగా భావించాలి. ఈ కరోనా కాలంలో సంఘ కార్యం ఆగకపోగా ఇంకా పెరిగింది. రామజన్మ భూమి నిధి సంగ్రహణ పనిలో నాలుగు కోట్లకుపైగా

# భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలబెడదాం..




నాగపూర్‌లోని రేషింబాగ్ మైదానంలో మే 9 నుంచి జూన్ 2 వరకు తృతీయ వర్ష సంఘ శిక్షావర్గ జరిగింది. ముగింపు కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పరమపూజనీయ సర్ సంఘచాలక్ శ్రీ మోహన్‌జీ భాగవత్ పాల్గొని స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు. మోహన్‌జీ ఉపన్యాసం పాఠకుల కోసం యథాతథంగా..

గ్రామాల నుండి మనం నిధి సేకరించాం. దీని ఫలితంగా ఇక్కడ జరుగుతున్న ఈ తృతీయ వర్ష సంఘ శిక్షావర్గకు ఇప్పుడున్న సంఖ్యకు రెట్టింపు సంఖ్య రావడానికి తయారయ్యారు. కానీ ఇక్కడ అంతమందికి ఒక్కసారిగా ప్రశిక్షణ ఇవ్వడం సాధ్యం కాదు. అందుకని ఈ వర్గలో సంఖ్యను పరిమితం చేశాం. మిగిలినవారి కోసం మరొక వర్గ నిర్వహించ వలసి ఉంది.

ప్రపంచమంతా భారతమాతకు జైకొట్టాలి అనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలన్నీ జరుగుతున్నాయి. మనం విశ్వవిజేతలం కావాలనే ఆకాంక్ష మనకు లేదు. కాని అందరినీ కలుపుకుపోవాలనేదే సంఘ కార్య స్వభావం. అనాది కాలం నుండి భారత్ ఇదే అనుసరిస్తున్నది. 75 సంవత్సరాల స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరుపుకుంటున్నాం. ప్రాచీన కాలం నుండి మన అస్తిత్వమంతా రంగురంగులుగా భిన్నత్వంతో నిండి ఉన్నదని, అదే శాశ్వత సంపూర్ణం (ఏకమేవ అద్వితీయం) అని, అదే సత్యావిష్కారమని భావించాలి. దీని ఆధారంగానే మనం ఆనందాన్ని పొందాం. ప్రపంచాన్ని మనదిగా అనుకొన్నపుడు ప్రపంచం కూడా ఆ సంతోషాన్ని పొందేట్లు చేయాలి. దానినే అందరూ అనుసరించాలి.

సత్యం, కరుణ, పవిత్రత, ఆధ్యాత్మిక సాధన (తపస్సు) అనేవి మన ధర్మానికి నాలుగు పాదాలు. ఈ నాలుగు విలువలు మన ప్రజలు ఆచరించి చూపారు. అదే మన రాష్ట్ర జీవనం అయింది. మనమంతా భాష, పూజ కారణంగా ఒకే రాష్ట్రీయులం (జాతీయులం) కాలేదు. ఒకచోట ఉన్నాం కనుక కాలేదు. **(ఏతద్దేశ ప్రసూతస్య... పృథీవ్యాం సర్వమానవాః)** అన్నట్లు మనుష్య జీవనం ఎలా ఉండాలి? ప్రపంచం నుండి ఎవరు వచ్చినా మనలో ఉన్నత ప్రమాణాలు కలిగిన వారుగా కనపడాలి. అలాంటి జీవనం మనం కలిగి ఉండాలి. ప్రపంచంలో ప్రాచీన దేశవాసులుగా ఇది మన బాధ్యత. ఇలాంటి సమాన ఉద్దేశం భారతదేశం లోని అన్ని సంప్రదాయాలవారు, అన్ని భాషలవారు, అన్ని ప్రాంతాలవారు, ఆహారం, వస్త్రధారణలో భిన్నత్వం కలిగినవారితో పాటు వివిధ కారణాలతో విదేశాలకు వలస వచ్చి పూజాపద్ధతిని స్వీకరించిన వారిలోనూ మనఃపూర్వకంగా ఇదే లక్ష్యం ఉంటుంది. ఎందు కంటే వారు భారతీయులు కనుక. ఇది ప్రపంచానికి చాలా అవసరం. ఇలా అందరినీ కలుపు కొని వెళ్లే మనలాంటి విధానంతో సమానమైనది ప్రపంచంలో మరెక్కడా లేదు. ప్రపంచంలో సిద్ధాంతం ఉంది కాని అభ్యాసం, అనుభవం లేదు. ఈ అభ్యాసం, అనుభవం అనే పరంపర ఈనాటికీ మన దేశంలో నిరంతరంగా వస్తున్నదే తప్ప ఎటువంటి పరిస్థితి లోనూ ఆగలేదు. ఇదే మన ఆధ్యాత్మికత. ఇటువంటి ఆధ్యాత్మికతపై నిలబడే ఈ ధర్మాన్ని హిందూధర్మం అని అంటున్నా వాస్తవంగా ఇది మానవ ధర్మం, విశ్వధర్మం అవుతుంది. యుగయుగాలుగా ఈ భూమిలో ధర్మ సంరక్షణ జరిగింది. హిందూ భూమిలో ఈ పరంపరలో పనిచేస్తున్నవారిని ప్రపంచ దేశాలవారు హిందువులని అంటున్నారు. కనుక ఇది హిందూధర్మం. ఈ భూమిలో మనం నివసిస్తున్నాం. ఈ భూమి మనల్ని సంరక్షిస్తుంది. మన దేశం చుట్టూ పర్వతాలు, సముద్రం ఉన్నాయి. కనుక ఆ రోజుల్లో బయటి దేశాలవారు రావాలంటే చాలా కష్టం. అందువల్ల ఇక్కడ పుట్టి పెరిగిన మనం, మన సంరక్షణకై ఇతరులతో పోరాడే అవసరం రాలేదు. ఎంత గొప్ప సమృద్ధిని, విశేషమైన రక్షణను మన మాతృభూమి కల్పించింది. దీని ఆధారంగా సత్యాన్ని ఆవిష్కరించి ప్రపంచానికి అందించడానికి అవసరమైన సద్గుణ సంపద కలిగిన సంఘటిత సమాజం రూపొందింది. దాని ఆధారంగా రాష్ట్ర (దేశ) నిర్మాణం చాలా ప్రాచీనకాలంలోనే జరిగింది.

**'ఓం భద్రమిశ్చంతరుషయః.... తద్దైస్మై దేవా ఉపసన్నమంతు'**

మన దేశాన్ని బలసంపన్నంగా చేయడం ద్వారా విశ్వ కల్యాణాన్ని కాంక్షించిన మన రుషులు, మునులు అనంత శ్రమలకోర్చి తపస్సు చేశారు. అంతేగానీ తమ స్వార్థం కోసం కాదు. అలాంటి రుషులు, మునులు మన సమాజానికి ఆధారం. కాని కాలచక్రం మారుతూ వస్తున్నది. ఒక్కసారి అనుకూలత (మంచి), మరొక్కసారి ప్రతికూలత (చెడు) సంభవించాయి. ఒక్కోసారి ప్రపంచానికి సంస్కృతిని అందించి పాలించాం. ఒక్కోసారి విదేశీయులతో పీడనకు గురయ్యాం. తిరిగి మనం ప్రపంచంలో ముందు వరుసలో నిలబడాలి. ఈ సనాతన దేశానికి మనం వారసులం. ఇదే ధర్మం సమన్వయాన్ని నేర్పుతుంది. సంతులనాన్ని ఇస్తుంది. అందరినీ కలుపుకుంటూ, అందరి ఉన్నతి కాంక్షిస్తూ, అందరి అభివృద్ధిలో తన అభివృద్ధిని దర్శించుకుంటేనే అది ఉన్నత స్థితి అవుతుంది. ఈ మొత్తాన్ని మనం తిరిగి స్థాపించాలి. దేశ ప్రయోజనం ఇందులోనే ఉన్నది. స్వాతంత్ర్యంలోని 'స్వ' ఆధారంగా మనదైన తంత్రాన్ని అనుసరిస్తూ ప్రపంచాన్ని ఆ దిశలో అనుసరింపచేయాలి. ఈ కార్యాన్ని పాలించడానికి సత్యాన్ని అనుభూతి పొంది, తెలుసుకొని జీవించేవారు కావాలి.

ధర్మ సంరక్షణ రెండు రకాలుగా జరుగుతుంది. ధర్మం పట్ల ఆక్రమణ జరిగితే రక్షించడం, దానికోసం పోరాడవలసి వస్తే పోరాడడం, బలిదానం కావడం జరుగుతుంది. కనుక ధర్మాచరణ కావాలి (ఆచార

ప్రభవో ధర్మః). మన మధ్య ప్రేమ, ఆనందం, ఒకరి పట్ల ఒకరికి సంవేదన కావాలి. భిన్నత్వాన్ని సహజమైనదిగా భావించాలి. భిన్నత్వాన్ని విడివిడిగా చూడవద్దు. మన మధ్య ఘర్షణ ఉండవద్దు. ప్రపంచానికి ఇవ్వడానికి ఇలాంటి సత్యం మన దగ్గర ఉంది. దానిని ప్రపంచానికి అందించే సమయం ఆసన్నమయింది కూడా. దాని కోసం మనం తయారు కావాలి. సత్యం స్వయంగా నిలబడలేదు. సత్యానికి శక్తి ఆధారం కావాలి. శక్తి లేకుండా మనలను ప్రపంచం గౌరవించదు. మనం ఎవరినీ గెలవాలని అనుకోం. కాని ప్రపంచంలో దుష్టశక్తులు ఉన్నాయి. అవి మనని ఓడించాలని చూస్తున్నాయి. వారి ఆలోచనల్లో ఎటువంటి మార్పు రాలేదు.

అందుకని శక్తిని మనం ఆరాధించాలి. ఎవరైనా ఆధ్యాత్మికతను వదిలి, కేవలం భౌతికవిద్యను అభ్యసిస్తే అంధకారంలోకి వెళతారు. కనుక భౌతిక జ్ఞానం ఆధారంగా జీవితంలో వచ్చే సమస్యలను ఎదుర్కొంటే యశస్వి అవుతాడు. ఆ విధంగా పొందిన యశస్సును ఆధ్యాత్మిక విద్యనభ్యసించడం ద్వారా సార్థకత సాధిస్తాడు. సార్థకత లేకుండా యశస్సు (విజయం) సాధ్యం కాదు. విజయం పొందడం పశువులకు కూడా సాధ్యమే. కీర్తి లేకుండా సార్థకత లేదు. సార్థకత లేకుండా యశస్సుకు అర్థం లేదు. భారతీయులకు ప్రేమను పంచడం తెలుసు. సంఘంలో స్వయంసేవకులు ప్రేమను తమ హృదయంలో నింపుకుని ఇంటింటికి వెళుతుంటారు. హిందుత్వం మనది అనే భావనను నరనరాలలో జీర్ణించుకొనేటట్లు చేయాలి. అహంకారాన్ని మరచిపోయి అందరినీ తమవారిగా చేసుకోవాలి. స్వయంసేవక్ దీని కోసం తయారవుతాడు. కాని అన్ని విషయాలకు శక్తి అనేది మన అధిష్ఠానం కావాలి. సత్య ఆధారమైన నీతి కావాలి.

**'విద్యా వివాదాయ ధనం మదాయ– జ్ఞానాయ దానాయ చ రక్షణాయ'**

విద్య, ధనం, శక్తి దుష్టులలో ఉంటే వారు ఇతరులను బాధలకు గురిచేస్తారు. అదే మంచి వారిలో ఉంటే ఇతరుల బాగుకు ఉపయోగిస్తారు. ఈ నీతిని ఉపయోగించకపోతే శక్తి ప్రమాద కరంగా తయారవుతుంది. రష్యా ఉక్రెయిన్‌ను ఆక్రమించింది. రష్యా దగ్గర శక్తి ఉంది కనుక ఉక్రెయిన్‌లోకి వెళ్లింది. రష్యాను ఆపడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు. మీరు యుద్ధంలో ప్రవేశిస్తే అణుబాంబును ప్రయోగిస్తామని రష్యా బెదిరిస్తున్నది. కొన్ని దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందిస్తు న్నాయి. ఉక్రెయిన్‌కు తమ ఆయుధాలనిచ్చి సహాయం చేస్తున్నవారి హేతువు వెనుక పవిత్ర భావం ఉందా? లేదు. గతంలో భారత్‌–పాకిస్తాన్ యుద్ధం జరిగినపుడు వాళ్ల ఆయుధాలు పరీక్షించుకొనేందుకు సరఫరా చేశారు. నేడు ఉక్రెయిన్‌కు సహకరిస్తున్న వారి పరిస్థితి కూడా ఇంతే.



వేదికపై మాననీయ శ్రీ మోహన్‌జీ, ముఖ్యఅతిథి మాననీయ శ్రీ కమలేశ్ పటేల్ (మధ్యలో ఉన్నవారు), తదితరులు

కాని శక్తిశాలి దేశాలు కూడా ఉన్నాయి. వాటి భాష మనలాగే ఉంది. శాంతి ద్వారా ఐకమత్యంగా ఉందామంటున్నాయి. మనం అనే భావనతో, మనమంతా ఒకటే అనే భావనతో మెలుగుదాం అనే ధర్మం, నీతి వారి దగ్గర లేవు. వాటి దగ్గర సైన్యం ఉంది, సంపద ఉంది కాని తమ స్వార్థం కోసమే వీటన్నిటినీ ఉపయోగించుకొంటున్నాయి. అందుకనే ఈ యుద్ధాన్ని ఆపడం ఆ దేశాల వల్ల కావడం లేదు. అందుకే నీతి కావాలి. సత్వగుణంతో శక్తి వస్తుంది. ఐకమత్యంతో కూడా శక్తి వస్తుంది. భారతదేశాన్ని పరమ వైభవం వైపు సాగించ డానికి, విశ్వగురువు స్థానంపై నిలబెట్టడానికి సమయం పడుతుంది. అందుకు భారతీయులందరూ ఒక్కటి కావాలి–ఏ పూజా పద్ధతి దీనికి బంధనం కారాదు. ఏ పూజా విధానాన్ని వ్యతిరేకించవద్దు. అన్ని భాషలు మనవి. దేనినీ వ్యతిరేకించవద్దు. అన్ని ప్రాంతాల వారిని మనవారిగా భావించాలి. అందరినీ భరతమాత సంతానంగా అంగీకరించాలి. ఇక్కడి పూర్వీకులు భారతీయులందరికీ సమానం. 'స్వ' ఆధారిత సంస్కృతి అంటే ఇదే. ఇది మనకు వారసత్వంగా లభించింది. పూజతో, కర్మకాండలతో, ఆహారపు అలవాట్లు, ఆచార వ్యవహారాల నుండి ధర్మాన్ని వేరు చేయాలి. అపుడే ధర్మరక్షణ జరుగుతుంది. బంధుభావన, మానవత అనేది భారతదేశ 'స్వ'గా చెబుతాం. అదే భారత ప్రాచీన ధర్మం. అదే మానవత. దానినే నేడు హిందూధర్మం అంటున్నాం. వివిధత కూడా అదే. అది వేరు కాదు.

ఇప్పుడు జ్ఞాన్‌వాపి మసీదు వివాదం మొదలయింది. ఇది చరిత్రకు సంబంధించింది. నేడు హిందువులుగా చెప్పుకుంటున్న వారుగాని, ముస్లింలని చెప్పుకుంటున్నవారుగాని దీన్ని సృష్టించలేదు. గతంలో జరిగింది. ఇస్లాం బయట నుండి ఆక్రమణ ధోరణితో భారత్‌లోకి చొరబడింది. ఆ సంఘర్షణ సమయంలో భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నవారి మనో ధైర్యాన్ని సడలింప చేయడానికి వేలాది మందిరాలను కూలగొట్టారు. హిందువులకు అత్యంత పవిత్రమైనవి కొన్ని ఉన్నాయి. వాటి గురించి చర్చ వస్తున్నది. ఏ విధంగా చేయాలి, దీనిని ముస్లింలకు విరుద్ధంగా ఆలోచించ కూడదు. ఈనాటి ముస్లింల పూర్వీకులు కూడా హిందువులే! హిందుత్వ మూలాలున్న ఇలాంటి ముస్లింలందరినీ స్వాతంత్ర్యం వచ్చాక మోసానికి గురిచేస్తు, మనోధైర్యాన్ని సడలింపచేస్తూ వస్తున్నారు. కనుక ముఖ్యమైన మందిరాలు పునరుత్థానం గావించాలని హిందువులు కోరుకుంటున్నారు. మేము ఇప్పుడు ఏమీ చెప్పడం లేదు. రామజన్మభూమి ఉద్యమంలో ఆ రోజు ఉన్న పరిస్థితుల ఆధారంగా పాల్గొనాల్సి వచ్చింది. ఆ విషయం పూర్తయ్యింది. మరో ఉద్యమమేదీ చేపట్టేది లేదని 2019 నవంబర్ 9వ తేదీన చెప్పాం.

ఎవరు ఎవరికీ విరుద్ధం కాదు. ముస్లింలు కూడా విరుద్ధంగా భావించరాదు. హిందువులు కూడా ఆ విధంగా భావించవద్దు. ఇరువర్గాలు కలిసి కూర్చుని మాట్లాడుకొని అందరూ ఒకే అంగీకారంతో సమస్యకు పరిష్కారం కనుక్కోవాలి. కాని ప్రతిసారి ఇది సాధ్యం కాకపోవచ్చు. కోర్టుకు పోవాల్సి వస్తుంది. అపుడు కోర్టు ఏ నిర్ణయం ప్రకటిస్తే దానిని శిరసావహించాలి. మన రాజ్యాంగం అంగీకరించిన న్యాయవ్యవస్థను పవిత్రంగాను, సర్వశ్రేష్ఠమైనదిగాను భావించాలి. కోర్టు నిర్ణయాన్ని స్వీకరించాలి కాని ఆ నిర్ణయంపై ప్రశ్నించరాదు. సరే ఒకానొక ముఖ్యమైన స్థలాన్ని (కాశీ) కోరుకుంటున్నాం. దీనిపై తరతరాలుగా శ్రద్ధ ఉంది. అలాగని ప్రతి మసీదులో శివలింగం కోసం ఎందుకు వెతకాలి? ఇస్లాం పూజాపద్ధతి బయటి నుండి వచ్చినా అది కూడా ఒక పూజా పద్ధతి అని మనం గౌరవించాలి. అదే సమయంలో ముస్లింలు కూడా బయట నుండి వచ్చినవారు కారని, వారూ ఇక్కడి వారేనని గుర్తుంచుకోవాలి. ప్రతి పూజా పద్ధతి పట్ల మనకు గౌరవం ఉంది. అన్నిటినీ అంగీకరిస్తాం. కాని పూజా పద్ధతి ఏదైనప్పటికీ ఆ పద్ధతిని అనుసరిస్తున్న ప్రతి ఒక్కరు ఈ దేశంలోని రుషులు, మునులు, రాజుల వారసులే. మనందరికీ ఒకే పరంపర ఉంది. మనందరికీ సమాన శత్రు, మిత్ర భావన వుంది.

ఈ దేశ స్వాతంత్ర్యం కోసం హిందువులతోపాటు

ముస్లింలు కూడా పోరాడారు. ఉదా॥ అష్ఫాకుల్లా ఖాన్, ఇబ్రహీంఖాన్‌గార్గిల్ వంటి వారి మూలాలు ఇక్కడే ఉన్నాయి. ఇది ముస్లింలకు ఆదర్శం కావాలి. కనుక చరిత్రను అర్థం చేసుకోవాలి. భారత్ మనందరికి మాతృభూమి. వారి వారి విషయాలను ఏమీ మార్చుకోకుండా అందరినీ కలుపుకొనేదే భారతీయ సంస్కృతి. వారి పూజ, వారి పద్ధతి సర్వ శ్రేష్ఠమైనదే కాని అందరి పూజ, అందరి కొరకు సర్వ శ్రేష్ఠం. ఎవరి పద్ధతిని తప్పు పట్టవద్దు. 'నా పూజా పద్ధతే సరైనది' అనే పిడివాదం అవసరం లేదు. జనజీవనంలో అరమరికలు లేకుండా అందరితో కలవగలగాలి. పాకిస్తాన్ ఏర్పడినపుడు కొందరు వెళ్లిపోయారు. మిగిలినవారు వెళ్లలేదు. కారణం ఏమై ఉంటుంది? 'మన పూజా పద్ధతి వేరైనంత మాత్రాన మన మాతృభూమి వేరు కాదు' అనే భావనతోనే మిగిలిన వారంతా పాకిస్తాన్‌కు వెళ్లకుండా ఉండిపోయారు. కాబట్టి భారతదేశంలో కలసి జీవించారు. వేర్పాటువాదాన్ని ఆలపించరాదు. పూజా పద్ధతి వేరు కాబట్టి మేము వేరు అని భావించరాదు. సంపూర్ణ హిందూ సమాజం కూడా అర్థం చేసుకొని మన పూర్వీకులంతా ఒకటే, మన సంబంధాలు ఇక్కడి సమాజంతోనే, మన రక్తం ఒకటే అని ముస్లింలు భావించి తిరిగి వస్తామంటే హిందువులు రెండు చేతులు చాపి స్వాగతించాలి. అలా తిరిగి రాకపోయినా పరవాలేదు. మనకు 33 కోట్ల దేవతలున్నారు. వారిలో మరొకరు చేరినా ఇబ్బంది లేదు. ఎవరి పూజా పద్ధతిని వారు ఆచరించినా, దేశభక్తి కలిగి వుండి, హిందూ సంస్కృతి ఉదారత, అందరినీ కలుపుకుపోయే తత్వం, అందరినీ సమానంగా చూసే గుణం, అందరినీ తమవారిగా అనుభూతి చెందడం, అందరి వికాసంలో తమ వికాసం చూసుకోవడం, అనుభూతి చెందడం, తామే గొప్పగా అభివృద్ధి చెందాలని కాకుండా అందరి వికాసంలో తమ వికాసాన్ని చూసుకోగలగాలి. మనకు వారసత్వంగా లభించిన పూర్వీకుల పట్ల గౌరవం వుంచి కలిసి జీవించాలి. మన రాజ్యాంగ ప్రస్తావనలో కూడా ఇదే ఉంది.



డాక్టర్జీ స్మృతి మందిరాన్ని దర్శించుకుంటున్న భాగ్యనగర్ రామచంద్ర మిషన్ అధ్యక్షులు, మాననీయ శ్రీ కమలేశ్ పటేల్ (దాజీ)

సమాజంలోని ఇతరుల సంవేదన పట్ల కూడా దృష్టి సారించాలి. మనసు, మాట, కర్మలలో అతివాదం అవసరం లేదు. ఇరువైపుల నుండి రెచ్చగొట్టే మాటలు వినబడు తుంటాయి. ఇలాంటిది హిందువుల వైపు నుండి తక్కువే. ఐక్యత కోసం హిందువులు ఎంతో ఓర్పు వహించారు, ఎంతో కోల్పోయారు. చివరకు దేశ విభజనను కూడా అంగీకరించారు. రెచ్చగొట్టవద్దు. రెచ్చగొట్టేవారిని నియంత్రించాలి. హిందువులెవరైనా ఆ విధంగా మాట్లాడితే వారిని నియంత్రిస్తున్నారు. మేము మాట్లాడినా నియంత్రణ చేస్తున్న వారూ ఉన్నారు. హిందూ సమాజం అతివాదాన్ని అంగీకరించదు. అందుకనే హిందూ సమాజంలో అందరూ వచ్చిచేరారు. గ్రీకులు (యూదులు), పార్శీలు... ఇలా ఒకటేమిటి ప్రపంచంలోని ప్రతి దేశం దిగ్భ్రమకు గురై సత్యాన్ని కనుక్కోవడం కోసం ఈ భూమి వద్దకు చేరారు. వెనకబడ్డ ప్రతి ఒక్కరిని, ప్రతి పతితుడిని ఉద్ధరించింది ఈ భూమి. హిందూ జీవన పరంపర అయిన దీనిని అర్థం చేసుకొని హిందువు కూడా తమ ఆచరణను సరిచేసుకొంటూ శక్తిసంపన్నుడవ్వాలి. అంటే ఎవరినీ జయించవద్దు, ఎవరూ నిన్ను జయించలేనంత శక్తిమంతుడివి కావాలి. ఎవరినీ భయపెట్ట వద్దు-ఎవరికీ భయపడవద్దు. ఆ విధంగా హిందువు జీవించాలి. అందరినీ కలుపుకుంటూ సమృద్ధమైన ఒకే రాష్ట్ర జీవన ప్రవాహంలో అందరినీ కలపాలి. దీని కోసం అందరిలో అవసరమైన శక్తి, శీలం హిందువులు నింపాలని సంఘం ప్రయత్నిస్తున్నది. ఇది దేశానికి అత్యంత అవసరం.



శారీరిక ప్రదర్శనలు

భాష, ప్రాంతం ఇత్యాది విషయాలను ఆధారం చేసుకొని మనల్ని ఒకరి నుండి ఒకరిని దూరం చేసే ప్రయత్నంలో అగ్గి రాజేసి తమ స్వార్థమనే రొట్టెలను ఆ జ్వాలల్లో కాల్చుకొనే దేశ విరోధశక్తులు నేటికీ క్రియాశీలంగా ఉన్నాయి. ఇలాంటి వారు ప్రపంచం లోను, మన దేశంలోను ఉన్నారు. విజ్ఞులైనవారు ఇలాంటి కుతంత్రాలు చేసే వారి మాయలో పడరాదు. సంఘం చేస్తున్న పనికి సమయం పట్టవచ్చు. రేపటికి మార్పు వచ్చేస్తుందని అనుకో వచ్చు. అంత సులభం కాదు. మనం ఎంచుకొన్న దారి రాళ్లు, రప్పలతో కూడిన కఠినమైనది. అయినప్పటికీ ఈ దారిలోనే ప్రయాణించాలి. మనం భరతమాతకు జయకారం పలకాలని కోరుకొంటాం. మనం ఈ వ్రతాన్ని ధరించి ముందుకెళ్లాల్సి ఉంటుంది. సామర్థ్య, సంపన్న హిందూ సమాజం హిందువుల సచ్ఛీల ప్రవృత్తిపై ఆధారపడి దేశంలోనే కాదు యావత్ ప్రపంచ దేశాలను, కలహాలను సమాప్తం చేసి ఒక నూతన సుఖవంతమైన, సుందర మైన ప్రపంచాన్ని నిర్మించే క్షమతను పొందాలి. ఇలాంటి క్షమత, సద్గుణ సంపదను దేశంలోని యావత్ హిందూ సమాజంలో జాగృతం చేసే పనిని 1925 నుండి ఆర్ఎస్ఎస్ చేస్తున్నది. అప్పుడప్పుడు సంఘ కార్యక్రమం ఆగి ఉండవచ్చు. కానీ కార్యం ఆగలేదు. ఒక్కొక్క అడుగు ముందుకు పడుతోంది. ఈరోజు కాకపోతే రేపు మనం విజయం ప్రాప్తించేట్లు చేయగలం. ఈనాడు కనబడుతున్న పరిణామాలను బట్టి ఈరోజు కాకుంటే రేపు అని నేను అన్నాను అంటే మొత్తం హిందూ సమాజం తమలోని భేద భావాలను మరచిపోయి, తమ స్వార్థాలను త్యజించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లి ప్రపంచాన్ని సుఖ సమృద్ధి చేసే దిశగా అనుకూల పరిస్థితులు కనబడు తున్నాయి.

తృతీయ వర్ష సంఘ శిక్షావర్గలో దేశ వ్యాప్తంగా 733 (ఆంధ్రప్రదేశ్:24, తెలంగాణ:23) మంది శిక్షార్థులు పాల్గొన్నారు. ★




# జాతి హితం సంఘ లక్ష్యం

**వేదికపై దేవేందర్, దూసి రామకృష్ణ, చల్లా వివేకానందరెడ్డి, హెచ్.కె.నాగు, బూర్ల దక్షిణామూర్తి, పబ్బ సత్యనారాయణ**

**భాగ్యనగర్:** హిందువునని చెప్పుకోవడానికి ఎవరూ ఏమాత్రం వెనుకాడవద్దని, స్వాభిమానంతో ముందుకు సాగాలని తెలంగాణ అబ్కారీ శాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ చల్లా వివేకానందరెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రథమ, ద్వితీయ సంఘ శిక్షావర్గల సార్వజనికోత్సవం భాగ్య నగర్, అన్నోజిగూడలోని శ్రీ విద్యా విహార్ పాఠశాల (ఆర్‌వికె)లో జూన్ 3న సాయంత్రం జరిగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివేకానందరెడ్డి హాజరై ప్రసంగించారు. నాలుగు వేల సంవత్సరాల నాటి విష్ణుపురాణంలోనూ భారత్ ప్రస్తావన ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం మన దేశంలో విదేశీ మూలాలు ఉన్నవారు ఎవరూ లేరని, విదేశీ మతాలను అవలంబిస్తున్న వారి పూర్వీకులు కూడా హిందువులేనని అన్నారు. మన అమూల్యమైన నాగరికతను, పూర్వీకుల నుండి అందివచ్చిన వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి యువతపైనే ఉందని అన్నారు.

కార్యక్రమానికి ప్రధాన వక్తగా హిందూ జాగరణ్ మంచ్ పశ్చిమ, మధ్య (మహారాష్ట్ర, గోవా, గుజరాత్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల) క్షేత్రాల సంఘటన మంత్రి పి. దేవేందర్ మాట్లాడుతూ స్వయంసేవకుల శక్తి, సామర్థ్యాలను పెంపొందించి, సంఘ సిద్ధాంతం పట్ల అవగాహన పెంచుకునే అవకాశాన్ని సంఘ శిక్షావర్గ కల్పిస్తుందని అన్నారు. సమాజ హితాన్ని ఆకాంక్షిస్తూ మన దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చేలా స్వయంసేవకులు పని చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలందరూ బస్తీ, గ్రామం, నగరం, పట్టణాల్లో ప్రజల సమస్యల పరిష్కారంలో పాలు పంచుకోవాలన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం నుంచి నేటి వరకు నిరంతరాయంగా హిందూ ధర్మరక్షణ కోసం పనిచేస్తూ, ప్రతిఒక్కరూ ధైర్యంగా 'నేను హిందువు'నని చెప్పుకునేలా చేసిందన్నారు. మన సంస్కృతిని, ధర్మాన్ని కించపరిచే అనేక ప్రయత్నాలు నేడు జరుగుతున్నాయని, మన ధర్మానికి నష్టం కలిగించే విధర్మీయులను, విజాతి శక్తులను ఎదిరించేలా, ప్రశ్నించేలా స్వయంసేవకులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పని చేస్తుందని దేవేందర్ అన్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో హిందూ ఆలయాల ధ్వంసం జరుగుతున్నదని, కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కనీసం వారిపై చర్యలు తీసుకోకపోవడం విచారకరం అని అన్నారు. తెలంగాణలో ఎస్సీలపై, మహిళలపై ఒక మతంవారు దాడులు జరుపుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ఘటనల పట్ల హక్కుల కార్యకర్తలు, కమ్యూనిస్టు నాయకులు, కుహనా సెక్యులరిస్టులు, మేధావులు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని, ఇది వారి ద్వంద్వవైఖరికి నిదర్శనని దేవేందర్ ఆవేదన వ్యక్తంచేశారు.

సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు చేసినవారు ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాల్లో కావాలనే హిందువుల మీద దాడిచేసి, వారి దుకాణాలు ధ్వంసంచేస్తే కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. అంతేకాదు, మన దేశంలో హిందువుల సంఖ్యను తగ్గించే కుట్ర కూడా జరుగుతుందని.. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారమే చేస్తున్నట్లుగా తెలుస్తోందన్నారు. ఈ చర్యల్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత హిందువులందరి మీద ఉందని దేవేందర్ అన్నారు. మే 15 నుండి జూన్ 3 వరకు జరిగిన ప్రథమ వర్ష శిక్షావర్గలో 297 మంది (తెలంగాణ); ద్వితీయ వర్ష శిక్షావర్గలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి 173 మంది స్వయంసేవకులు శిక్షణ తీసుకున్నారు. ప్రథమ వర్ష వర్గాధికారిగా పబ్బ సత్యనారాయణ, ద్వితీయ వర్ష వర్గ సర్వాధికారిగా హెచ్. కె. నాగు వ్యవహరించారు.

కార్యక్రమంలో క్షేత్ర ప్రచారక్ సుధీర్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, ప్రాంత కార్యవాహ కాచం రమేష్, ఆంధ్రప్రదేశ్ ప్రాంత సహ కార్యవాహ యుగంధర్ ఇతర క్షేత్ర, ప్రాంత అధికారులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన స్వయంసేవకుల శారీరిక ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం తిలకించడానికి పురుషులు, మాతృమూర్తులు, యువతీయువకులు మొత్తం 1134 మంది హాజరయ్యారు. ★


శారీరిక ప్రదర్శనలు

# రక్తదానంపై

**రక్తదానం.. ఆధునిక సమాజంలో దీని ప్రాధాన్యం అనన్య సామాన్యం. ప్రమాదంలో గాయపడిన, ప్రాణాపాయ స్థితిలోని వ్యక్తికీ ఇది పరమౌషధంగా పనిచేస్తుంది. ఇంతటి ప్రాధాన్యం గల రక్తదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో అపోహలను తొలగించాల్సిన బాధ్యత కూడా సమాజంపైన ఉంది. అంతేకాక రక్తదానానికి ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాల్సిన, చైతన్య పరచాల్సిన సామాజిక బాధ్యత అధికార యంత్రాంగం, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలది. దీనివల్ల అంతిమంగా సమాజానికి మేలు కలుగుతుంది.**




2004లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించాల్సిన ఆవశ్యకతను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గుర్తించింది. 58వ వరల్డ్ అసెంబ్లీ–2005లో రక్తదాన ప్రాముఖ్యంపై అవగాహన కల్పించేందుకు ఏటా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జూన్ 14న అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తోంది. 2005 నుంచి ఈ కార్యక్రమం నిరంతరాయంగా నడుస్తోంది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్, రెడ్ క్రెసెంట్ సొసైటీ సంయుక్త చొరవతో సురక్షిత రక్తం, రక్త ఉత్పత్తుల ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపేందుకు తొలిసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏటా ఒక్కో నినాదంతో ప్రజల వద్దకు వెళుతున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. రక్తదానం ప్రాధాన్యాన్ని చాటి చెబుతున్నారు.

1868 జూన్ 14న జన్మించిన జీవశాస్త్ర వైద్యుడు డాక్టర్ కార్ల్ ల్యాండ్‌స్టీనర్ జన్మదినాన్ని అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవంగా గుర్తించారు. ఆయన ఆరోగ్య రంగానికి చేసిన సేవలను, మానవ రక్త వర్గాలను గుర్తించడంలో చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయన జన్మదినాన్ని ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా పాటిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కమిటీ 1930లో నోబెల్ బహుమతిని ప్రకటించింది.

రక్తదానం ప్రాధాన్యం గురించి ఒక్క మాటలో చెప్పలేం. ఆపద సమయంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను అది కాపాడుతుంది. పునర్జన్మ ఇస్తుంది. జీవితంపై ఆశలను కల్పిస్తుంది. పరోక్షంగా ఆ వ్యక్తిపైన ఆధారపడిన కుటుంబ సభ్యులనూ కాపాడుతుంది. వారి జీవితాల్లో వెలుగులు పూయిస్తుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం గల రక్తదానంపై ఇప్పటికీ సరైన ప్రచారం కొరవడింది. ప్రజల్లో అవగాహన లోపించింది. దాని ప్రాధాన్యాన్ని గుర్తించడంలో, వివరించడంలో వైఫల్యం కనపడుతోంది. ఏటా అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కొద్దిపాటి హడావిడి చేయడం, ఆ తరువాత మర్చిపోవడం సాధారణమైంది. ఇది ఎవరిని ఉద్దేశించి చేసిన విమర్శ కాదు, వాస్తవం. ఈ విషయాన్ని గుర్తించి సానుకూల దిశగా సాగడం మనందరి ముందున్న కర్తవ్యం. ఇప్పటికీ చాలామందిలో రక్తదానంపై అపోహలు ఉండటం ఆందోళన, ఆవేదన కలిగించే అంశం. రక్తదానం వల్ల తాము బలహీనపడతామని, అనారోగ్యానికి గురవుతామని, వ్యాధుల బారిన పడతామన్న భావన చాలామందిలో ఉంది. ఇది ఏదో పల్లెటూరి ప్రజల్లో ఉన్న అభిప్రాయం కాదు. పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులు, మేధావుల్లో, వివిధ రంగాల నిపుణులు చాలామందిలో ఇలాంటి అభిప్రాయం ఉంది. ఈ అపోహలను తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలవంతం కాలేదు. కాబట్టి ఈ ప్రయత్నాలను మరింత వేగవంతంగా, ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

గత ఏడాది ఇటలీ రాజధాని రోమ్ నగరంలో అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం జరిగింది. రక్తదానాన్ని ప్రేరేపించే విధంగా, ప్రోత్సహించే విధంగా 'రక్తాన్ని అందించండి.. ప్రపంచాన్ని కాపాడండి' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది (2022) 'రక్తదానం.. సంఘీబావ చర్య' అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. నేషనల్ బ్లడ్ సెంటర్ ద్వారా ఈ ఏడాది మెక్సికో రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించనుంది. రాజధాని నగరం మెక్సికో సిటీలో ఈ కార్యక్రమం జరగనుంది. రక్తదానంపై గల అపోహలను తొలగించి, దానివల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించినట్లయితే ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతమైనట్లు అని చెప్పవచ్చు.

వాస్తవానికి రక్తదానం వల్ల దాత బలహీనపడదు. ఆరోగ్యం మెరుగు పడుతుంది. రక్తదానం వల్ల వ్యక్తి శరీరానికి అవసరమయ్యే రక్తం తగ్గిపోతుందని, దానివల్ల దాత బలహీనపడే ప్రమాదం ఉందన్నది కేవలం అపోహే. రక్తదానం ఎంత చేసినా ఆ మేరకు సరిపడా రక్తాన్ని శరీరం మళ్లీ ఉత్పత్తి చేస్తుంది. వ్యాధుల నుంచి త్వరితగతిన కోలుకునే అవకాశం కలుగు తుంది. ఆరోగ్యకరమైన కాలేయం ఏర్పడుతుంది. గుండెపోటు, క్యాన్సర్ తదితర ప్రమాదాలను తగ్గిస్తుంది. మనిషి శరీరంలో ఐరన్ లోపాన్ని నివారిస్తుంది. ఎక్కువకాలం జీవిస్తారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు గల ప్రతి వ్యక్తి రక్తదానం చేయవచ్చు. ఆ వ్యక్తి 45 కిలోల బరువు కలిగి ఉండాలి. రక్తదానం చేసే రోజు ఆ వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలి. రక్తదానం చేసే వ్యక్తికి ఎలాంటి ఖర్చు ఉండదు. కానీ అది ఒక వ్యక్తి జీవితాన్ని కాపాడుతుంది. ఈ విషయాలను సమర్థవంతంగా, ప్రభావవంతంగా ప్రజలకు తెలియజేసినట్లయితే విరివిగా రక్తాన్ని సేకరించవచ్చు.

ప్రజల అవసరాల మేరకు రక్తాన్ని సేకరించడం అంత కష్టమేమీ కాదు. రెడ్‌క్రాస్ సొసైటీ, ఆర్ఎస్ఎస్

అనుబంధ సంస్థలు, ఇంకా పలు స్వచ్ఛంద సంస్థలు ఈ దిశగా ముందుకు సాగుతున్నప్పటికీ, ఈ ప్రయత్నానికి అందరూ కలసి రావాల్సిన అవసరం ఉంది. 2005 నుంచి ఏటా అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటికీ రక్త సేకరణ నామమాత్రంగా ఉంది. ఆస్పత్రిలో చేరే ప్రతి ఏడుగురిలో ఒకరికి రక్తం అవసరం. ఒక్కోసారి ఈ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం పదిశాతం మందే రక్తదానానికి ముందుకు వస్తున్నారు. వివిధ రకాల అపోహలు, అనుమానాల కారణంగా మిగిలిన 90 శాతం మంది ఈ ప్రక్రియకు దూరంగానే ఉండిపోతున్నారు. ఇది వెనకబడిన దేశాల్లో నెలకొన్న పరిస్థితి మాత్రమే కాదు. ప్రగతికి నిలువెత్తు నిదర్శనమని చెప్పుకునే పాశ్చాత్య దేశాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

అగ్రరాజ్యమైన అమెరికాలో 38 శాతం మంది రక్తదానానికి అర్హులు కాగా కేవలం 10 శాతంమంది ప్రజలే ముందుకు వస్తున్నారు. ఇక్కడే పరిస్థితి ఇలా ఉంటే వెనకబడిన దేశాల్లో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 2017లో అమెరికాలో 8 మిలియన్ యూనిట్ల రక్తాన్ని మాత్రమే సేకరించడం గమనార్హం. ఇండియాలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. 2016లో 12 మిలియన్ యూనిట్ల డిమాండ్

## అపోహాలొద్దు

ఉండగా, సేకరించింది 10.9 మిలియన్ యూనిట్లే. అయితే ఇప్పుడిప్పుడే ప్రజల్లో రక్తదానంపై అవగాహన కలుగుతుండటం స్వాగతించదగ్గ అంశం. 2006-07లో స్వచ్ఛంద రక్తదాతల శాతం 54.4 ఉండగా 2011-12 నాటికి 83 శాతం పెరగడం గమనార్హం. 2006-07లో సేకరించిన రక్తం యూనిట్ల సంఖ్య 4.4 మిలియన్ యూనిట్లు ఉండగా 2012-13 నాటికి 9.3 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. వెనకబడిన దేశాల్లో రక్తదాతల సంఖ్య పరిమితంగానే ఉంటోంది. పది శాతానికి మించడం లేదు. రక్తానికి సంబంధించి హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ విశేష సేవలు అందిస్తోంది. 1998 అక్టోబర్‌లో ప్రముఖ నటుడు చిరంజీవి ప్రారంభించిన ఈ సంస్థ అతికొద్ది కాలంలోనే ప్రాచుర్యం పొందింది. ఇప్పటివరకు దాదాపు 96 వేలమందికి రక్తాన్ని అందించినట్లు అంచనా. ఈ దిశగా మరికొన్ని సంస్థలు కృషిచేయాల్సిన అవసరం ఉంది.

**కేంద్ర ప్రభుత్వ చర్యలు**

ఈ ఏడాది, జూన్ 14 అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల్లో రక్త గ్రూపుల పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. రక్తదాతల సంఖ్యను పెంచడం, వారిని సన్మానించడం, గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజల చేత సర్పంచులు ప్రతిజ్ఞలు చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించింది. కేవలం పంచాయతీలోలనే కాకుండా బ్లాక్, జిల్లా స్థాయిల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించింది. రక్త పరీక్షల వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఏ గ్రూప్ రక్తం ఎవరికి ఉపయోగపడుతుందో తెలుస్తుంది. ఈ మేరకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేశారు. ఆ శాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాశారు. ★



# ధన్యజీవి అప్పాజీ



(1948-2022)

అందరూ ఆప్యాయంగా అప్పాజీ అని పిలిచే, పరిచయం అవసరం లేని చిరపరిచిత జ్యేష్ఠ ప్రచారక్ అప్పారావు (74) హాస్పిటల్‌లో చికిత్స పొందుచూ జూన్ 5న ఉదయం స్వర్గస్థులయ్యారు. 1948 ఆగస్టు 13న విజయవాడలో జన్మించిన ఆయన హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే స్వయంసేవక్ అయ్యారు. అప్పటి విజయవాడ విభాగ్ ప్రచారక్ భోగాది దుర్గా ప్రసాద్ వాత్సల్యంతో సంఘ కార్యంలో క్రియాశీలమయ్యారు. విద్యాభ్యాసం తర్వాత ప్రచారక్‌గా కొనసాగారు. జగిత్యాల ప్రచారక్‌గా పనిచేసిన తర్వాత ప్రాంత కార్యాలయం కేంద్రంగానే చివరి వరకు పనిచేశారు. కార్యాలయం పనులతో పాటు సేవా కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయించేవారు.

అందరినీ ఆత్మీయంగా పలకరించే మృదు సంభాషి, అందరి హృదయాలలో స్థానం సంపాదించిన స్నేహశీలి అప్పాజీ. అందరి బాధలను తన బాధగా భావించి నివారణోపాయాలను సూచించే వారు. వివిధ ఆరోగ్య సమస్యలపై ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నుండి భాగ్యనగర్‌కు వచ్చే స్వయంసేవకులకు, సంఘ అభిమానులకు చికిత్సకు సంబంధించి ఆయా ఆసుపత్రుల వివరాలు తెలియచెబుతూ మార్గదర్శనం చేసేవారు. ఆ సేవాభావంతోనే ఆసుపత్రుల్లో వైద్యులతో, ఆరోగ్య సిబ్బందితో సంఘానికి సత్సంబంధాలు ఏర్పడ్డాయి. స్వీయ ప్రేరణతో మొదలుపెట్టిన ఈ విధానం ప్రస్తుతం సేవాభారతి ఆరోగ్య సేవలకు స్ఫూర్తిదాయకమై, ఒక ప్రత్యేక విభాగంగా రూపు దిద్దుకుంది. వివిధ విభాగాల వైద్యుల వద్ద ఉన్న మందుల శాంపిళ్లను, స్వయంసేవకుల ఇళ్లలో వాడుతూ, మిగిలిన మందులను సేకరించి సేవాభారతి ఆధ్వర్యంలో 'సంజీవని మొబైల్ వ్యాన్' ద్వారా సేవా బస్తీలలో నిర్వహిస్తున్న చికిత్స కేంద్రాలకు పంపే ఏర్పాటును స్వయంగా చూసేవారు. సంజీవని మొబైల్ మెడికల్ వ్యాన్ ద్వారా భాగ్యనగర్‌లోని అనేక సేవా బస్తీలకు వైద్య చికిత్సను అందించే యోజనను డాక్టర్ సురేందర్‌రెడ్డి పర్యవేక్షణలో 1999-2005 మధ్య కాలంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది డాక్టర్లను, పారా మెడికల్ సిబ్బందిని భాగస్వాములను చేశారు. డాక్టర్లతో నడిచే సంఘ మండలి పనిని స్వయంగా పర్యవేక్షించేవారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించక అనేకమంది రోగుల ఇబ్బందులను గమనించిన అప్పాజీ స్వయంసేవకులకు రక్తదాన ఆవశ్యకతను వివరించి రక్తదానాన్ని ప్రోత్సహించారు. క్రమేపి రక్త గట సూచిని తయారుచేసి రోగులకు అందించడాన్ని వ్యవస్థీకృతం చేశారు. వారి కృషి ఫలితంగానే రక్తదాన భారతి ప్రారంభానికి నాంది పడింది. భాగ్యనగరంలోని మల్కాజిగిరిలో ఉన్న వారి స్వగృహాన్ని రక్తదాన భారతికి దానంగా ఇచ్చారు. అప్పాజీ గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యం వలన బయటకు రాలేక పోయినప్పటికీ కార్యాలయం కేంద్రంగానే రక్తదాన కార్యక్రమాన్ని ప్రోత్సహించేవారు. కార్యాలయానికి వచ్చిన స్వయంసేవకుల యోగక్షేమాలను విచారించేవారు. పరిచయం ఉన్న స్వయంసేవకుల కుటుంబాలతో నిరంతరం టెలిఫోన్ ద్వారా సంబంధాలు నడిపేవారు. ★

# నిరుద్యోగిత నిర్మూలనే అందరి లక్ష్యం




హైదరాబాద్‌లోని నారాయణగూడ కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలోని పటేల్ హాల్‌లో మే 29న స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో 'తెలంగాణ ప్రాంత కార్యశాల' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

స్వావలంబి భారత్ అభియాన్ ప్రాంత సమన్వయకర్త హరీష్‌బాబు కార్యశాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. దేశంలో నిరుద్యోగితను తొలగించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతృత్వంలో 12 సంఘ పరివార క్షేత్రాలైన– స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్, లఘు ఉద్యోగ భారతి, సహకార భారతి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ జనతా పార్టీ, అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్, విశ్వహిందూ పరిషత్, సేవాభారతి, గ్రామభారతి, వనవాసి కళ్యాణ పరిషత్‌లు ఒకే వేదికగా ఏర్పడి కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలో నిరుద్యోగిత నిర్మూలన కోసం భవిష్యత్‌లో తాము చేయబోయే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ గురించి కూడా వివరించారు.

గౌరవ అతిథిగా హాజరైన సేవాభారతి తెలంగాణ ప్రాంత ఎగ్జిక్యూటివ్ ఎక్కా రాజేందర్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులను, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని తెలియచేశారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ దక్షిణమధ్య క్షేత్ర కో–కన్వీనర్, స్వావలంబి భారత్ అభియాన్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ్ డాక్టర్ సత్తు లింగమూర్తి మాట్లాడుతూ 1857కి ముందు మనదేశంలో పేదరికం లేదని, బ్రిటిష్ దోపిడి కారణంగానే భారత్ ఆర్థికంగా కుదేలైందన్నారు. అయితే, ప్రస్తుతం దేశంలో స్వయంసమృద్ధి సాధించడానికి అనుకూల వాతావరణం ఉందన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తన వంతు ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి జిల్లా స్వయంసమృద్ధి సాధించడం కోసం సమాజ పరివర్తన చేయడమే స్వావలంబి భారత అభియాన్ ముఖ్య లక్ష్యమన్నారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వదేశీ జాగరణ్ మంచ్ అఖిల భారత సహ సంఘటక్, స్వావలంబి భారత్ అభియాన్ అఖిల భారత ప్రముఖ్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ రాకకు ముందు మనదేశంలో 'వ్యవసాయం ఉత్తమం, వ్యాపారం మధ్యమం, ఉద్యోగం అథమం' అని భావించేవారని, కానీ బ్రిటిషు పాలనలో మన వ్యవసాయ, వ్యాపార, కుటీర రంగాలు పూర్తిగా కుదేలయ్యాయని పేర్కొన్నారు. మన దేశాన్ని కేవలం ముడిసరుకు ఉత్పత్తి చేసేదిగా మార్చి ఆ ఉత్పత్తుల్ని తమ దేశానికి తరలించి, వాటికి మెరుగులద్ది అక్కడినుంచి మళ్లీ భారత్‌కు తీసుకొచ్చి మనకే అమ్మడం ద్వారా డబ్బు సంపాదించేవారన్నారు. బ్రిటిష్ పాలన నుండే మనదేశంలో నిరుద్యోగిత సమస్య మొదలైందని చెప్పారు. నిరుద్యోగిత సమస్యను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వాల పథకాల పట్ల యువకులకు, రైతులకు, అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించాలన్నారు. పారిశ్రామిక రంగంలో యువత రాణించేందుకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పేరాల శేఖర్‌రావు–కె.వి.ఐ.సి., గౌతం భానవత్–SIDBI, నర్సింగరావు–PMEGP,శివరామ ప్రసాద్–MSME, సతీష్‌చంద్ర కుమార్– Banking రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. నిరుద్యోగిత నిర్మూలనకు ఆయా సంస్థల ద్వారా తాము రూపొందించిన పథకాల గురించి వివరించారు. సమారోప్ (ముగింపు సమావేశం)లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ కార్యవాహ అన్నదానం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వావలంబి అభియాన్‌లోని అన్ని క్షేత్రాలు సమిష్టిగా, ఒక ప్రణాళికతో అందుబాటులో ఉన్న మనదేశ వనరులను ఉపయోగించుకొని పనిచేస్తే దేశం సమృద్ధ, స్వావలంబి భారత్‌గా అభివృద్ధి చెందుతుందని, విశ్వగురు స్థానాన్ని చేరుకుంటుందని అభిలషించారు.

కార్యశాలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సుమారు 260 మంది కార్యకర్తలు పాల్గొన్నారని బిఎంఎస్ ప్రాంత కార్యదర్శి, స్వావలంబి భారత్ అభియాన్ ప్రాంత సహ సమన్వయకర్త గోటూరి రమేశ్‌గౌడ్ తెలిపారు. ★



# టెన్నిస్ బాహుబలి నడాల్

అద్భుతాలు చేయడానికి, చరిత్ర సృష్టించడానికే కొందరు వ్యక్తులు క్రీడాకారుల రూపంలో జన్మిస్తూ ఉంటారు. రాయల్ గేమ్ టెన్నిస్‌లో స్పానిష్ బుల్ రాఫెల్ నడాల్ గత రెండు దశాబ్దాల కాలంగా కళ్లు చెదిరే విజయాలు, అనితర సాధ్యమైన రికార్డులతో వారేవ్వా! అనిపించుకొంటున్నాడు. 19 సంవత్సరాల చిరుప్రాయంలో తొలి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన నడాల్.. 36 సంవత్సరాల లేటు వయసులో సైతం 14వ సారి అదే టైటిల్ నెగ్గి రోలాండ్ గారోస్ ఎర్రమట్టి కోర్టులో బాహుబలిగా నిలిచాడు.





క్రీడా కృష్ణ, 84668 64969

నాలుగు రకాల (ఎర్రమట్టి, పచ్చిక, సింథటిక్ ఫైబర్, ఆస్ట్రోటర్ఫ్) కోర్టులలో జరిగే గ్రాండ్ స్లామ్ టెన్నిస్ టోర్నీలలో దేని ప్రత్యేకత దానిదే. అయితే, పారిస్‌లోని రోలాండ్ గారోస్ ఎర్రమట్టి కోర్టుల్లో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ అంటే మాత్రం సుదీర్ఘ ర్యాలీలతో జీడిపాకంలా గంటల తరబడి సాగే పోరాటాలు మాత్రమే గుర్తుకు వస్తాయి. మూడు నుంచి ఐదు గంటలపాటు సాగే ఫ్రెంచ్ ఓపెన్ పోరులో నెగ్గాలంటే నేర్పు, ఓర్పు, గంటల తరబడి ఆడగల శారీరక పటుత్వం ఉండి తీరాలి. జిడ్డాటగా సాగే ఫ్రెంచ్ ఓపెన్‌లో ఒక్కసారి విజేతగా నిలిస్తేనే జన్మధన్యమైనట్లుగా ఆటగాళ్లు భావిస్తారు. కానీ ఒకటి కాదు, రెండు కాదు, 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ విన్నర్‌గా నిలవడం అంటే ఊహకు అందని విషయం. మానవమాత్రుల వల్ల అయ్యే పనికాదని టెన్నిస్ విశ్లేషకులు తరచూ చెబుతారు. అయితే స్పానిష్ పోట్ల గిత్త రాఫెల్ నడాల్ మాత్రం ఈ అసాధారణ, అనూహ్య రికార్డును సృష్టించాడు.

2022 ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో నడాల్ ఎడమ కాలిపాదం గాయంతో బరిలోకి దిగాడు. అరకొర ఫిట్‌నెస్‌తో అదృష్టం పరీక్షించుకొన్నాడు. తన కెరియర్‌లోనే తొలిసారిగా 5వ సీడ్‌గా పోరుకు సిద్ధమైన నడాల్.. క్వార్టర్ ఫైనల్స్ దశలోనే ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జోకోవిచ్‌తో తలపడాల్సి వచ్చింది. నాలుగుసెట్ల పోరులోనే జోకోవిచ్‌ను కంగు తినిపించడం, సెమీఫైనల్లో ప్రత్యర్థి జ్వెరేవ్ గాయంతో ఉపసంహరించు కోవడంతో టైటిల్ సమరానికి అర్హత సాధించిన ఈ స్పానిష్ వండర్ ఫైనల్లో నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్‌ను వరుస సెట్లలో అలవోకగా చిత్తు చేసి రికార్డుస్థాయిలో 14వ ఫ్రెంచ్, 22వ గ్రాండ్ స్లామ్ టైటిల్ కైవసం చేసుకున్నాడు.

పదిహేను సంవత్సరాల క్రితం.. 19 సంవత్సరాల చిరుప్రాయంలో తన మొట్టమొదటి ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ ఆడిన నడాల్ ఆ తర్వాత మరి వెనుదిరిగి చూసింది లేదు. గత 17 సంవత్సరాలలో 14 సార్లు విజేతగా నిలవడం అంటే ప్రాణవాయువు లేకుండా పదే పదే ఎవరెస్టు పర్వతం అధిరోహించడం లాంటిదే. 2005 నుంచి ఫ్రెంచ్ ఓపెన్లో నడాల్ ఆడిన మ్యాచ్‌ల్లో 111 విజయాలు, మూడంటే మూడు పరాజయాలు మాత్రమే ఉండటం కూడా ఓ అసాధారణ రికార్డుగా మిగిలిపోతుంది.

## 85వ టైటిల్

తరచూ గాయాల కారణంగా కాలికి, వేలికి, మణికట్టుకు, భుజానికి శస్త్రచికిత్సలు చేయించుకుంటూ ఆటకు దూరమైనా; జోకోవిచ్, ఫెదరర్ లాంటి దిగ్గజ ఆటగాళ్లతో పాటు జ్వెరేవ్, మెద్వదేవ్, రూడ్ లాంటి నవతరం స్టార్ల నుంచి తీవ్రపోటీ ఎదురైనా.. 36 ఏళ్ల నడాల్ తన ప్రత్యేకత కాపాడుకుంటూ వస్తున్నాడు. 2022 ఫ్రెంచ్ ఓపెన్ విజయంతో తన కెరియర్ టైటిళ్ల సంఖ్యను 87కు పెంచుకోగలిగాడు. ఇందులో మొత్తం 22 గ్రాండ్ స్లామ్, 35 మాస్టర్స్‌తో సహా 10కి పైగా ఇటాలియన్ ఓపెన్ ట్రోఫీలతో కలసి 87 టైటిల్స్ సాధించాడు.

2005 నుంచి 2008 వరకు.. వరుసగా నాలుగుసార్లు, తిరిగి 2010 నుంచి 2014 వరకు వరుసగా ఐదుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన నడాల్.. 2014 తర్వాత రెండేళ్ల విరామంలోనే తిరిగి మరో ఐదుసార్లు టైటిల్ అందుకోడం ద్వారా తన ఫ్రెంచ్ టైటిళ్ల సంఖ్యను 14కు పెంచుకొని చరిత్ర సృష్టించాడు. కేవలం ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ నెగ్గడం ద్వారానే 200 కోట్ల రూపాయల వరకూ ఆర్జించాడు. గ్రాండ్ స్లామ్ టెన్నిస్ చరిత్రలో అత్యధికంగా 20 టైటిల్స్ సాధించిన ఫెదరర్, జోకోవిచ్‌లను నడాల్ మించిపోయాడు. 22 టైటిల్స్‌తో గ్రాండ్ స్లామ్ మొనగాడిగా నిలిచాడు. అంతేకాదు, గ్రాండ్ స్లామ్ టెన్నిస్ చరిత్రలో కనీసం ఒక్క సెట్ ఓడకుండా నాలుగుసార్లు టైటిల్స్ నెగ్గిన అసాధారణ రికార్డు నడాల్‌కు ఉంది. గతంలో ఇదే ఘనత సాధించినవారిలో ఫెదరర్, నస్టాసే, కెన్ రోజ్ వాల్ ఉన్నారు. క్లే కోర్టు టెన్నిస్‌లో 430కి పైగా విజయాల రికార్డు అందుకొన్న తొలి, ఏకైక ప్లేయర్ నడాల్ మాత్రమే. ఇటాలియన్, బార్సిలోనా క్లే కోర్టు టైటిల్స్‌ను డజనుసార్లు నెగ్గడం ద్వారా చరిత్ర సృష్టించాడు. మాంటేకార్లో క్లే కోర్టు టోర్నీలోనూ 11 టైటిల్స్ నెగ్గిన మొనగాడు నడాల్ మాత్రమే.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**నేడు మయన్మార్‌గా పిలుచుకుంటున్న నాటి బ్రహ్మదేశం భారతదేశానికి తూర్పున, ఈశాన్య రాష్ట్రాలు మిజోరమ్, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల ప్రదేశ్‌లతో 1624 కి.మీ. అత్యంత సుదీర్ఘమైన సరిహద్దును కలిగి ఉన్న దేశం.**




# మయన్మార్‌లో హైందవ

మయన్మార్ అనగానే మనందరికి రంగూన్ గుర్తుకు రావటం కద్దు. ఈ రోజుల్లో చదువుకుని జీవన వేటకు, డబ్బు సంపాదించడానికి ముఖ్యంగా యూరోప్, అమెరికా దేశాలకు వెళ్తున్నట్లు, ఒకప్పుడు వ్యాపార, ఉద్యోగాల కోసం మనవారు బర్మా (నేటి మయన్మార్) వెళ్ళేవారు. పాత సినిమాల్లో రంగూన్ (బర్మా ఒకప్పటి రాజధాని) గురించిన మాటలు వింటూ ఉంటాము. 'రంగూన్ రౌడీ' అనే సినిమా కూడా వచ్చింది. 'మెషియా గయా రంగూన్' అనే హిందీ సినిమా పాట కూడా బాగా పాపులరే. మన ఫర్నిచర్‌లో బర్మా టేకు ఉంటే దానికో విశేషత.

నాటి బ్రహ్మదేశం ఆంగ్లేయుల రాకతో బర్మాగా మారింది. 'బ్రహ్మదేశం' పేరు ఉచ్చారణ రాక ఆంగ్లేయులు 'బర్మా' అన్నారు. అప్పటినుండి ఆ పేరే స్థిరపడింది. 1989వ సంవత్సరంలో తిరిగి అది తన పేరును 'మ్యామ్మ'గా ప్రకటించుకుంది. 'బ్రహ్మ' పదం అపభ్రంశమే 'మ్యామ్మ'.అయితే ప్రస్తుతం ఆ దేశాన్ని మయన్మార్‌గా పిలుస్తున్నాం.

మయన్మార్‌తో మనకు గల సంబంధాలు అత్యంత ప్రాచీనమైనవి. ఆ దేశపు చరిత్ర పాఠాలతో ఒక విశేష వాక్యం 'మ్యామా అస్సాన్ ఢగోన్'గా (మ్యామా ఢగాంవ్ అనే ప్రదేశం నుండి ప్రారంభ మైందని అర్థం) నేర్పిస్తుంటారు. ఇందుకు సంబం ధించి ఇతిహాసం కూడా ఉంది. సుమారు 3000 సంవత్సరాలకు ముందు భారతదేశంలో ఉత్తరాన కోసల అనే గణరాజ్యం ఉండేది. దాని రాజు 'అభి' సాక్య వంశానికి చెందినవాడు. ఈ అభిరాజు గౌతమ బుద్ధుని కన్నా 300 సంవత్సరాల పూర్వంవాడు. కాలక్రమంలో ప్రక్కనే ఉన్న పాంచాల రాజ్యంతో జరిగిన యుద్ధంలో అభిరాజు పరాజయం పాలైయ్యాడు. దాంతో ఆయనలో విరక్తి భావాలు కలిగాయి, రాజ్యకాంక్ష, తిరిగి రాజ్యం సంపాదించా లన్న కోరిక నశించాయి. సన్యసించి, తపస్సు చేసుకుని తరించాలని హిమాలయాలకు వెళ్లాలని నిశ్చయించుకుంటాడు. విషయం తెలుసు కున్న సైన్యంలోని కొందరు తామూ రాజు వెంట వస్తామన్నారు. గుర్రాలపై ఉత్తరం వైపు బయలుదేరిన వీరు కొంత కాలానికి తూర్పువైపుగా ప్రయాణం సాగించారు. ఏదైనా సుందర, మనోహరమైన ప్రదేశంలో ఉంటూ తపస్సు కొనసాగించాలనుకున్న వీరంతా కొండలు, గుట్టలు, అడవులు, నదులు దాటుకుంటూ సుదూర ప్రదేశానికి చేరుకున్నారు. ఆ ప్రదేశమే 'ఢగాంవ్'. ఇది నేటి మాండలే నగరానికి 80 కి.మీ. దూరంలో ఉంది.

అక్కడకు చేరుకున్న రాజు అభి, ఆయన సైనికులు తపస్సు చేసుకు నేందుకు అది అనువైన స్థలంగా భావించి తగు ఏర్పాట్లు చేసుకో సాగారు. స్థానిక ఆటవిక జాతుల ప్రజలు వారిని చూసి ఆశ్చర్య పోయారు. కండలు తిరిగిన శరీరాలతో అత్యంత బలాఢ్యులైనవారు వేరొక రాజ్యం నుండి వచ్చారని, అక్కడి ప్రజలను ఈ రాజు పాలించేవాడని తెలిసి ఇంకా ఆశ్చర్యానికి గురైనారు. కారణం అక్కడి వారికి రాజ్యం, రాజు, సైనికులు, ప్రజలు అనేవి తెలియదు. ఆగంతకుల ద్వారా విషయాలు తెలుసుకున్న స్థానిక తెగలు తమకూ రాజ్యం కావాలని, రాజ్యం నిర్మాణం చేసి తమను పాలించాలని వేడుకున్నారు. వారి కోరిక మేరకు అభిరాజు రాజ్య నిర్మాణం చేసి పాలించ సాగాడు. అలా ఏర్పడ్డదే మయన్మార్‌లోని మొట్ట మొదటి రాజ్యం. ఆ స్థలం పేరు 'ఢగాంవ్' కాబట్టి 'ఢగాంవ్' నుండే మయన్మార్ ఏర్పడింది అని చెప్పు కుంటారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పాలన చేసిన తరువాత రాజా అభి స్వర్గస్తులైనారు. ఆయన ఇద్దరు పుత్రుల మధ్య రాజ్యాధికారం కోసం పోటీ ఏర్పడింది. మంత్రి విధించిన పోటీలో చిన్నకుమారుడు గెలిచి సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈ సంఘటన మయన్మార్‌లో నూతన రాజ్యాలు ఏర్పడడానికి కారణమైంది.

రాజ్యం దక్కని పెద్ద కుమారుడు తమ్ముడి పాలనలో ఉండలేక తన అనుచరులతో అక్కడి నుండి దక్షిణం వైపు ప్రయాణం చేశాడు. ప్రస్తుతం 'ప్యేయ్' లేదా 'ప్రోమ్'గా పిలుస్తున్న ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కడి ప్రజలు ఇతడిని తమకు రాజుగా ఉండి పాలించాలని వేడుకున్నారు. వారి కోరిక మేరకు అక్కడ రాజ్యస్థాపన చేసి ఆ రాజ్యాన్ని తన కుమారు నికి అప్పజెప్పి (ఆ రాజ్యమే చరిత్రలో 'శ్రీ క్షేత్రము'గా విలసిల్లింది) ధన్యావతి అనే రాజ్యానికి చేరుకున్నాడు. అప్పటికే రాక్షసుల కారణంగా రాజును కోల్పోయిన ప్రజలకు ఆతని రాక సంతోషాన్ని కలిగించింది. ప్రజలు అతనిని తమ రాజుగా చేసుకున్నారు. ఇలా నూతన రాజ్యాలు ఏర్పడడానికి కారణమైన ఆ సంఘ టలను మయన్మార్ ప్రజలు ఎప్పటికి మరచిపోరు.

ఇంకో చారిత్రాత్మక సంఘటన 5వేల సంవత్స రాలకు పూర్వం చోటుచేసుకుంది.దాని వివరాలు 'అరాకాన్ అర్కైవ్స్'లో లభిస్తాయి. భరతవర్షంలోని ప్రాగ్జ్యోతిషపురాన్ని నరకాసురుడను రాక్షసుడు పాలిస్తుండేవాడు. ఆతని పాలనలో కష్టనష్టాల పాలైన ప్రజలు, తమను రక్షించ వలసిందిగా ద్వారకాధిపతి శ్రీ కృష్ణుడికి మొరపెట్టుకున్నారు. తగిన సమయం చూసుకుని శ్రీకృష్ణుడు నరకుని రాజ్యానికి చేరి యుద్ధంలో ఆతడిని సంహరించాడు. నరకాసురుని వధ అనంతరం కృష్ణ బలరాములు జంబూద్వీపం లోని అనేక ప్రదేశాలను, రాక్షస విముక్తం చేసి స్వాధీనపరచుకున్నారు. ఆ రాజ్యానికి 'వైశాలి' అని నామకరణం చేసి ద్వారకకు వెళ్ళిపోయారు. వైశాలి రాజ్యాన్ని హైందవ రాజవంశీయులువ వేల సంవత్సరాలు పాలించారు. క్రీ.శ.1770 ప్రాంతంలో మయన్మార్‌లోని 'టౌన్‌గూ' రాజవంశీయుల చేతిలో ఓటమి చెందేవరకు వారికి బెంగాల్ రాజవంశీయుల తోనే సంబంధాలు ఉండేవి.

ఇలా అనేక హిందూ రాజ్యాలు ప్రాచీన మయన్మార్‌లో ఏర్పడి చక్కగా పాలించాయి. ఆ రాజ్యాల పేర్లు కూడా హైందవ సంప్రదాయాలకు

బండి జగన్మోహన్

అనుగుణంగా ఉండేవి. క్రీ.శ.837వ సంవత్సరంలో నిర్మాణమైన ఒక రాజ్యం పేరు రామావతి. ప్రస్తుతం ఆ నగరాన్ని 'టౌన్విన్‌జీ' అని పిలుస్తున్నారు. క్రీ.శ.11వ శతాబ్దంలోని 'బగాన్' హైందవ దేవాలయంలో శ్రీరామ, పరశురామ, హనుమాన్ విగ్రహాలు ఉన్నాయి. అవే కాకుండా 'విష్ణుపురం', హస్తినాపురం, అరిమర్ధనపురం, అమరపురం, ధన్యావతి, కలశపురం, రక్షపుర, మండల, రత్నపురం హంసావతి, రామన్నదేశం... ఇలా అనేక రాజ్యాలతో ప్రాచీన హైందవ సంస్కృతితో విలసిల్లిన దేశం మయన్మార్. త్రిమూర్తులు, గణపతి, దుర్గ, ఇంద్ర, సరస్వతి, లక్ష్మీ, నారసింహ, హయగ్రీవ వారి ఆరాధ్య దేవతలు. నిత్యము వేదపారాయణం జరుగుతుండేది.

ప్రస్తుతం మయన్మార్ థేరవాద బౌద్ధ బాహుళ్య దేశము. భగవాన్ బుద్ధుడు జీవించిన కాలంలోనే తపుస్స, బొల్లిక అనే ఇద్దరు వ్యాపారుల ద్వారా బౌద్ధం ప్రవేశించినా, సనాతన సంప్రదాయంలోని అనేక మతాలతో కలిసి అది కూడా ఒకటిగానే ఉంది. వెయ్యేళ్లకు పూర్వం సంపూర్ణ మయన్మార్‌ను పాలిం

# మూలాలు

చిన రాజు అనిరుద్ధుని వరకు రాజభాష సంస్కృతమే. రాజ్య వ్యవహారాలన్నీ ఆ భాషలోనే జరుగుతుండేవి. గడచిన వేయి సంవత్సరాలుగా థేరవాద బౌద్ధం ప్రధానంగా ఉన్నప్పటికీ, బ్రిటీషువారి ఆక్రమణకు పూర్వం వరకు బ్రాహ్మణుల ద్వారా పూజలు, స్తోత్ర పారాయణాలు, వేదపఠనం, విశేష కార్యక్రమాలు జరుగుతుండేవి. ముఖ్యంగా దేశంలోని అత్యధిక ప్రాంతాన్ని పాలించిన మండల (నేటి మాండలే) రాజులు మణిపూర్ నుండి బ్రాహ్మణ కుటుంబాలను




రప్పించుకున్నారు. రాజ్యాలు మారినా, రాజులు లేకున్నా ఆ మణిపూర్ బ్రాహ్మణులు ఇప్పటికీ తమ కట్టుబాట్లను పాటిస్తూ ఉండటం విశేషం.

మయన్మార్ ప్రజలకు జాతక చక్రాలు రాయించుకునే అలవాటు ఉంది. దేశమంతా తిరుగుతూ ఈ బ్రాహ్మణులే ప్రజలకు జాతక చక్రాలు రాసిస్తుంటారు. ఇప్పటికీ సంప్రదాయ పద్ధతిలో తాటాకు రెమ్మలపై మాత్రమే జాతక చక్రాలను రాయడం విశేషం. అంతేకాదు.. మయన్మార్ దేశ క్యాలెండర్‌ను కూడా వీరే తయారుచేస్తారు. తిథి, వారం, పక్షం, మాసాలను గణించి పర్వదినాలను నిర్ణయించేది కూడా వీరే. మయన్మార్ ప్రభుత్వం ఈ పంచాంగాన్నే అధికారికంగా గుర్తించింది.

బౌద్ధ ఆరామాలలో విద్యార్థులకు అష్టమి, పౌర్ణమి, అమావాస్య పఠనానికి నిషిద్ధ తిథులు. ఈ తిథులను గణించడానికి సూర్యసిద్ధాంత గ్రంథాన్నే ఆధారం చేసుకుంటారు. ఆ గ్రంథాన్ని ప్రాచీన కాలంలోనే బర్మా భాషలోకి తర్జుమా కూడా చేసుకున్నారు. ఉత్తర మయన్మార్‌లో ఆయా తిథి రోజులలో బౌద్ధ ఆరామాలు మాత్రమే కాక ప్రభుత్వ పాఠశాలలు, మార్కెట్లు కూడా మూసి ఉంటాయి.

భారతదేశంలో క్రీ.శ.78లో శాలివాహన శకం ప్రారంభమయిన రెండు సంవత్సరాలకే మయన్మార్‌లోని అప్పటి శ్రీక్షేత్ర రాజులు దానిని అధికారికంగా గుర్తించి అనుసరించసాగారు. అయితే క్రీ.శ.638లో అప్పటి శ్రీక్షేత్ర రాజు ఆ సంవత్సరాన్ని శూన్య సంవత్సరంగా ప్రకటించి అమలు పరిచిన కారణంగా ప్రస్తుతం నడుస్తున్న శాలివాహన శకం 1943, బర్మాలో 1305గా ఉంటుంది.

**మయన్మార్‌లో ప్రసిద్ధ దేవాలయాలు**

ప్రాచీన కాలంలో మయన్మార్‌లోని అనేక చోట్ల హైందవ దేవాలయాలు ఉన్నాయనడానికి పురావస్తు శాఖ వారి త్రవ్వకాలలో బయటపడుతున్న ఆధారాలే నిదర్శనం. 960 సంవత్సరాల నాటి ఒక దేవాలయం బగాన్‌లో కనబడుతుంది. అందులో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల విగ్రహాలు ఉన్నాయి.

వెయ్యి సంవత్సరాల పూర్వం రాజా అనిరుద్ధ్ 'బామో' అనే రాజ్యంపై దండయాత్రకు వెళ్లినపుడు అక్కడి ప్రజలు దుర్గామాతను ఆరాధించడాన్ని గమనించాడు.. తమ ఇహలోక కోరికలను తీర్చేదేవత ఆమె అని ఆ ప్రజలు రాజా అనిరుద్ధ్‌కు చెప్పారట.

**మయన్మార్‌లో రామాయణం**

మయన్మార్‌లో అత్యంత ప్రాచీన కాలం నుండే వ్యవహారంలో ఉన్న రామాయణం 13వ శతాబ్దంలో 'అవ' అనే రాజ్యంలో బర్మా భాషలోకి తర్జుమా అయినట్లు ఆధారాలు లభిస్తున్నాయి.ఆ కావ్యం ప్రజల వాణి ద్వారానే ఒక తరం నుండి ఇంకో తరానికి చేరువవుతోంది. 16-18 శతాబ్దాల మధ్య కాలంలో చాలామంది పాటల రూపంలోనూ గద్య



రూపంలోనూ రామాయణ రచనలు చేశారు. రామాయణం బౌద్ధ భిక్షువులకు కూడా ఇప్పటికీ అత్యంత పవిత్ర గ్రంథం. 1775లో 'ఊ అంగ్ ప్యో' 'ఊంజప్యో' రాసిన గేయ రామాయణం ప్రస్తుతం లభ్యమవుతోంది.

18వ శతాబ్దం నుంచే రామాయణంపై నాటకాలు ప్రారంభమయ్యాయి. 'యామాజెడ్డార్' అనే ఈ నాటకాన్ని మయన్మార్ విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రదర్శిస్తుండడం విశేషం. క్రీ.శ.1880 ప్రాంతంలో స్థానిక మోన్ భాషలో రామాయణం వెలువడింది. క్రీ.శ.1849లో నిర్మించిన 'మహాలోకా మారయిన్' అనే బౌద్ధ పగోడా (మందిరం)లో 347 శిలలపై రామాయణ ఘట్టాలను చెక్కించారు. ఐరావతి అనే రాష్ట్రంలోని ప్యాపోన్ నగరంలోని బౌద్ధ ఆరామం ఇప్పటికీ ప్రతి సంవత్సరం రామాయణ నాటకాలు వేస్తూ ఉంటుంది.

**తెలుగు లిపితో ప్రభావితమైన మయన్మార్ లిపి**

మయన్మార్‌లో వాడుతున్న భాషను బర్మీస్ అని అంటారు. బర్మీస్ భాష లిపికి / 'మోన్' భాష లిపి ఆధారం. ఈ మోన్ భాష తెలుగు బ్రాహ్మీ లిపితో ప్రభావంతో ఏర్పడింది. సుమారు 1400 సంవత్సరాల పూర్వం ఒక గొప్ప యుద్ధంలో ఓటమి చెందిన పల్లవులు తమ ప్రదేశాలను విడిచి తూర్పు వైపు సముద్రాన్ని దాటుతూ దక్షిణ మయన్మార్‌లోని 'థరోన్' అనే ప్రదేశాన్ని చేరారు. అక్కడ నివసిస్తున్న 'మోన్' జాతి ప్రజలతో మమేకమైపోయారు. ఇప్పటికీ ఆ జాతిలో 'తెలైన్' అన్న తెగ ఉండటం గమనార్హం. ఈ తెలైన్ తెగ కృష్ణా గోదావరి నదుల మధ్యన ఉన్న తెలంగాణ నుండి వెళ్లిన పల్లవులు అని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. ఈ పల్లవుల ద్వారానే 'మోన్' భాషకు లిపి ఏర్పడింది.

వ్యాసకర్త : ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్, విశ్వవిభాగ్

# బాలజాగృతి

## తెలుసుకుందాం రామనాథ స్వామి ఆలయం-రామేశ్వరం



తమిళనాడులోని రామేశ్వరం ద్వీపంలో నెలకొన్న ప్రసిద్ధ శైవ క్షేత్రం. 12 జ్యోతిర్లింగాల్లో ఒకటి. శైవులకు, వైష్ణవులకు, స్మార్థులకు ప్రసిద్ధ క్షేత్రంగా భాసిల్లుతోంది. ఇక్కడి ప్రధాన దైవం రామనాథస్వామి అంటే శివుడు. గర్భగుడిలో రెండు లింగాలుంటాయి. వాటిలో ఒకటి సీతమ్మవారు తయారుచేసిన ఇసుక లింగం, రెండవది హనుమంతుడు కైలాసం నుండి తెచ్చిన విశ్వలింగం అని పురాణోక్తి. ఈ ఆలయంలోని ముఖ్య విగ్రహాలను జఫ్నా రాజ్యానికి చెందిన జయవీర చింకైరియన్, గుణవీర చింకైయన్‌లు పునరుద్ధరించారు.

## కథ మంత్రదండం



పూర్వం మాళవ రాజ్యాన్ని జయభద్రుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతను మిక్కిలి సోమరి. ఎప్పుడూ చదరంగం ఆడుతూ కూర్చోవడం తప్ప రాజ్యాన్ని, ప్రజల కష్టనష్టాలను గురించి పట్టించు కునేవాడు కాదు. రాజు సోమరి కావడంతో ప్రజలందరూ సోమరులుగానే తయారయ్యారు. ఎవ్వరూ ఏ పని చేసేవారు కాదు. దాంతో పంటలన్నీ ఎండిపోయాయి. రాజ్యమంతటా దారిద్ర్యం విలయతాండవం చేయ సాగింది. ప్రజలు ఆకలికి అల్లాడిపోతున్నారు.

అప్పుడు జయభద్రుడు అరణ్యానికి వెళ్లి భగవం తుని గురించి తపస్సు చేశాడు. దేవుడు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమనగానే "నా రాజ్యంలో దారిద్ర్యం పెరిగిపోయింది. ప్రజల కష్టాలు తీర్చడానికి నాకో మంత్ర దండం కావాలి" అని ప్రార్థించాడు. వెంటనే భగవంతుడు ఒక మంత్రదండం ఇచ్చి అదృశ్యమైపోయాడు.

జయభద్రుడు ఆనందంగా తిరిగివచ్చి "నా వద్ద ఒక అద్భుతమైన మంత్రదండం ఉంది. దాంతో ఎవరు ఏమి కోరుకుంటే అవి ఇస్తాను" అని ఊరంతా చాటింపు వేయించాడు. ఊరులోని ప్రజలందరూ రాజసౌధం వద్దకు చేరుకున్నారు. రాజు భటులను పిలిచి "ఇంకా రాని వాళ్లు ఎవరైనా ఉంటే వెళ్లి పిలుచుకు రండి" అని ఆజ్ఞాపించాడు.

భటులు వెతుకుతూ వెళ్లగా ఒక చోట ఒక వ్యక్తి కట్టెలను చిన్న చిన్న మోపులుగా కడుతూ కనిపించాడు. భటులు కళ్లెర్ర చేసి, రాజాజ్ఞను ధిక్కరిస్తావా? అంటూ అతనిని రాజు వద్దకు ఈడ్చుకుని వచ్చారు.

## పద్యం

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నకఁజేయువాఁడె నేర్పరి సుమతీ!

**భావం :** ఓ సుమతీ! మనకు ఉపకారం చేసిన వారికి తిరిగి ఉపకారం చేయుట మంచి లక్షణం. అందులో ప్రత్యేకత ఏం లేదు. కానీ అపకారం చేసిన వారిపై నెపములెన్నక తిరిగి వారికే ఉపకారం చేయగలిగినవాడే 'నేర్పరి' అనిపించుకుంటాడు.

## శ్లోకం

న చోరహార్యం న చ రాజహార్యం
న భ్రాతృభాజ్యం న చ భారకారి।
వ్యయే కృతే వర్ధత ఏవ నిత్యం
విద్యాధనం సర్వధనప్రధానమ్॥

**భావం :** విద్యాధనం– దొంగలు దోచుకోలేరు. ప్రభుత్వాలు స్వాధీన పరచుకోలేవు. అన్నదమ్ములు పంచుకోలేరు (పంచుకున్నా తరగనిది). (భవనం వలె) భుజాల మీద బరువుగా ఉండదు. ఖర్చుచేసిన కొద్దీ ఎల్లప్పుడూ పెరుగుతూనే ఉంటుంది. విద్యాధనం అన్ని ధనాల్లో కెల్లా ప్రధానమైనది.

## జత పర చండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| జలుబు | మైక్రోబాక్టీరియంలెప్రె |
| పోలియో | అల్ఫావైరస్ |
| చికెన్‌గన్యా | విబ్రియోకలరా |
| కలరా | రినోవైరస్ |
| కుష్టు | ఎంటిరోవైరస్ |

సమాధానాలు: జలుబు–రినోవైరస్; పోలియో–ఎంటిరోవైరస్; చికెన్‌గన్యా– అల్ఫావైరస్; కలరా–విబ్రియోకలరా; కుష్టు–మైక్రోబాక్టీరియమ్ లెప్రె.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### జతీంద్రనాథ్ దాస్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. జతిన్‌దాస్‌గా సుపరిచితుడైన ఈయన అక్టోబరు 27, 1904న కలకత్తాలో జన్మించారు. చిన్న వయసులోనే బెంగాల్‌లోని అనుశీలన్ సమితి సంస్థలో కీలకంగా పనిచేశాడు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1925 నవంబర్‌లో అరెస్ట్ అయ్యారు. జైల్లో ఖైదీల పట్ల బ్రిటిషు అధికారుల దురుసు ప్రవర్తనకు నిరసనగా ఇరవైరోజులు కఠిన నిరాహార దీక్ష చేశారు. భగత్‌సింగ్ వంటి విప్లవవీరులకు బాంబులు తయారుచేసి ఇచ్చారు. సెప్టెంబర్ 13, 1929న చిన్న వయసులోనే తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. 'విశ్వదాత' అంటే ఏ గ్రూప్ రక్తం గలవారు?
2. తెలంగాణ విశ్వవిద్యాలయం ఏ జిల్లాలో ఉంది?
3. 'వ్యవహారిక భాషా పితామహుడు' అని బిరుదు కలిగిన వ్యక్తి?

జవాబులు : 1. ఓ, నెగిటివ్; 2. నిజామాబాద్; 3. గిడుగు రామమూర్తి

## మెదడుకు మేత

లక్కబుడ్డి నిండా లక్షల వరహాలు. తినేవారే గాని, దాచిపెట్టుకొనే వారు లేరు?

జవాబు: నక్షత్రాలు



"కోరుకున్న వాళ్లకు కోరుకున్నవన్నీ మంత్రదండంతో ఇస్తానంటే రాకుండా కట్టెలు కొట్టుకుంటున్నావెందుకు?" అని రాజు ప్రశ్నించాడు.

అందుకా వ్యక్తి "రాజా! నా మంత్రదండం నా గొడ్డలే. దీంతో కట్టెలు కొట్టి, పొరుగూరికి తీసుకెళ్లి అమ్ముకుని, అక్కడినుంచి నాకు కావాల్సిన ఆహారపదార్థాలు తెచ్చుకుంటాను. నాకు హాయిగా గడిచిపోతుంది. కష్టపడి పని చేయకుండా మంత్రదండం సృష్టించే సంపదలు నాకు అవసరం లేదు" అన్నాడు వినయంగా.

అతని మాటలతో రాజు వాస్తవం గ్రహించాడు. తన చేతిలోని మంత్రదండం పైకి విసిరి వేయగానే అది మాయం అయిపోయింది. ఆనాటి నుండి రాజు సహా రాజ్యంలోని ప్రజలందరూ తమ శక్తి మేరకు కష్టపడి పనిచేసి సిరిసంపదలతో జీవించసాగారు.

*(నీతి : కష్టించి పని చేయడాన్ని మించిన మంత్ర దండం లేదు.)* ★

## మంచిమాట

ఓడిపోతున్నామని తెలిసినా ఉత్సాహాన్ని కోల్పోనివారే నిజమైన ధైర్యవంతులు..




# వారఫలాలు

13-19 జూన్ 2022




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వివాదాల పరిష్కారంలో చొరవ చూపుతారు. భూములు, వాహనాల కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు బాధ్యతలు పెరిగినా సమర్థతను చాటుకుంటారు. పారిశ్రామిక వర్గాలు, రచయితలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 13, 14 తేదీల్లో అనుకోని ఖర్చులు. అనారోగ్యం. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదనపు ఆదాయం సమకూరి ఉత్సాహంగా సాగుతారు. వాహన, గృహ యోగాలు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు మరింత ప్రోత్సాహం. రాజకీయవర్గాలు, రచయితలు అనుకున్న విజయాలు సాధిస్తారు. 15, 16 తేదీల్లో బంధువిరోధాలు. ఆరోగ్యభంగం. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అనుకున్న రాబడి దక్కి అవసరాలు తీరతాయి. ఏ పని చేపట్టినా విజయమే. ఆలోచనలు కలసివస్తాయి. కొన్ని వివాదాల నుంచి బయట పడతారు. ఇంటి నిర్మాణయత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు లాభాలు తథ్యం. ఉద్యోగులు విధి నిర్వహణలో ఆటంకాలు అధిగమించి ముందుకు సాగుతారు. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు గుర్తింపు పొందుతారు. 18,19 తేదీల్లో ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. గణేశాష్టకం పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. వాహనాలు, ఆభరణాల కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఉండవచ్చు. రాజకీయ వర్గాలకు ఉత్సాహ వంతంగా ఉంటుంది. రచయితలు, పరిశోధకులకు కొత్త ఆశలు. 17,18 తేదీలలో శారీరక రుగ్మతలు, బంధువులతో తగాదాలు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

పట్టుదలతో ఎంతటి కార్యక్రమాన్నైనా పూర్తి చేస్తారు. గృహం, వాహనాల కొనుగోలులో ఆటం కాలు తొలగుతాయి. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. వ్యాపారులు మెరుగైన లాభాలు అందుకుంటారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కాస్త ఊరట లభిస్తుంది. 14,15 తేదీల్లో దూర ప్రయాణాలు. అనుకోని ఖర్చులు. దేవీఖడ్గమాల స్తోత్రం పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

అనుకోని విధంగా ఆదాయం మెరుగుపడు తుంది. విద్యార్థులకు ఫలితాలు అనుకూలిస్తాయి. నూతన ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. వ్యాపారులకు మరింత అనుకూల సమయం. ఉద్యోగులకు పనిభారం నుంచి కొంత విముక్తి లభిస్తుంది. 16,17 తేదీల్లో శారీరక రుగ్మతలు. విష్ణుసహస్ర నామ పారాయణ చేయండి..

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

కొన్ని కార్యక్రమాలు నత్తనడకన సాగుతాయి. నిర్ణయాలలో మరింత నిదానం పాటించండి. బంధు వులతో ఆస్తి వివాదాలు నెలకొంటాయి. ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఖర్చులు పెరుగు తాయి. వ్యాపారులకు లాభాలు స్వల్పంగా అందు తాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంత రాలు ఎదురుకావచ్చు. 15,16 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. కనకధారా స్తోత్రం పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆస్తి వివాదాల పరిష్కారం. ఇంటిలో శుభ కార్యాలపై చర్చిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వాహన సౌఖ్యం. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రోత్సాహ కరంగా ఉంటుంది. రాజకీయవర్గాలకు ఊహించని అవకాశాలు. 18,19 తేదీల్లో బంధువులతో వివాదాలు. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయి. ఆర్థికంగా అనుకూల సమయం. రుణబాధలు తొలగుతాయి. జీవిత భాగస్వామి ద్వారా ధన, ఆస్తిలాభాలు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగు లకు సంతోషం కలిగించే సమాచారం అందుతుంది. పారిశ్రామిక వర్గాల యత్నాలు సఫలం. 13, 14 తేదీల్లో ఆస్తి వివాదాలు. శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆశించిన ఆదాయం సమకూరుతుంది. రుణాలు చాలా వరకూ తీరుస్తారు. భూముల కొనుగోలు యత్నాలు సానుకూలం. ఉద్యోగ యత్నాలు ఫలి స్తాయి. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు అదనపు విధులు మీద పడవచ్చు. రాజకీయ, పారిశ్రామిక వర్గాల కృషి ఫలిస్తుంది. 18,19 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో తగాదాలు. హనుమాన్ చాలీసా పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఒక ప్రకటన విద్యార్థులను ఆకట్టుకుంటుంది. భూములు కొంటారు. వ్యాపారు లకు లాభాలు. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు. రాజకీయ వర్గాలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. రచయితలు, క్రీడాకారులకు ఊరట లభిస్తుంది. 16,17 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో సమస్యలు. హయగ్రీవ స్తోత్రం పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కొత్త కార్యక్రమాలు చేపడతారు. పరిస్థితులు అనుకూలిస్తాయి. విద్యార్థులకు అనుకూల పరిస్థితు లుంటాయి. వాహనాలు, భూముల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. రాజకీయవర్గాలు, రచయితలకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. 17,18 తేదీల్లో శారీరక రుగ్మతలు. మానసిక ఆందోళన. విష్ణుధ్యానం చేయండి. ★

# పదరసం-370

## ఆధారాలు

**అడ్డం**

1. చివరకు మిగిలేది నవలా రచయిత (4)
3. శ్రీరాముని మామగారు (4)
6. ఇది కొంచెమే గానీ కూత ఘనంట! (2)
8. అలోవిరా ముందే వద్దు (3)
9. కాటకము, క్షామము (3)
11. వణుకు (2)
12. శ్రీకృష్ణుడిది ఏ వంశం (4)
13. మాటలు మధ్యలో పోయాక (2)
14. శ్రీశ్రీ కవిత్వంలో ఈ ప్రతీకలు ఉన్నాయి (3)
16. కుసుమములు (2)
19. ఓ జానపద వాద్య పరికరం శ్రీకాకుళం ప్రాంతం (2)
21. రసం, సాంబారు బాపతుదే! (3)
22. బురద (2)
24. పొగరు, అహంకారం (2)
25. ప్రపంచం, దీని పోకడ వింతయినది (2)
26. శివుని చేతి వాద్యం (3)
27. పొట్టి (3)
29. కౌపీనము (2)
31. మీరు మేమూ కలిస్తే, మనస్సు (3)
32. శ్రీశ్రీ కావ్య సంకలనమే ఇదీను (5)

**నిలువు :**

1. పెళ్లి కూతురుని మంటపానికి మేనమామ తరలించు పద్ధతి (5)
2. వేదవ్యాసుడు (5)
4. కంట్లో పడితే ఎదుటివాడు ఊదగలిగింది (3)
5. ప్రథమావిభక్తి (4)
7. ఆకిశం నుంచి రాత్రి తొంగి చూసేది (4)
10. నీట లేని నీరు మాటలు (3)
15. తెలుగు సినిమా ఒకనాటి ప్రసిద్ధ నర్తకీమణి (6)
17. నరకంలో శిక్షలెవరికి? (4)
18. సాంబ్రాణి పొగ (2)
20. సరస్వతి (3)
23. నల్లటి ఓ దుక్క చీమ (4)
28. లక్ష్మి (2)
30. ఆగ్రహము (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక,
3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

పదరసం - 370

పేరు : ......................................................................................

చిరునామా:......................................................................................

......................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 జూన్ 27 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 366 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 గౌ | త | 2 ము | డు | ✠ | 3 య | 4 శో | ధ | 5 ర |
| 6 జ | ర | ✠ | దా | ✠ | 7 క | ✠ | క | ✠ | జ |
| ✠ | 8 వ | లు | వ | ✠ | ద | ✠ | 9 ము | 10 రు | కు |
| 11 శ్మ | త్ర | ✠ | 12 హ | వ | న | ము | ✠ | 13 మా | డు |
| ✠ | 14 దం | 15 డ | ము | ✠ | ము | ✠ | 16 పూ | లు | ✠ |
| 17 అ | ✠ | మ | ✠ | 18 నా | ✠ | 19 గో | రీ | ✠ | 20 క |
| 21 మ | ల్లు | రు | ✠ | 22 కం | 23 చి | ✠ | ✠ | 24 చ | లం |
| వ | ✠ | 25 క | త్తి | ✠ | 26 రు | క్మ | వ్వ | ✠ | జ |
| 27 స | 28 ర | మ | ✠ | 29 యో | గా | ✠ | ✠ | 30 ము | ✠ |
| ✠ | 31 మ | ణి | క | ✠ | 32 లి | మ | రు | క్కు | లు |

**విజేతలు:** బి.ఇందుశేఖర్, సి.హెచ్.నాగేందర్ రెడ్డి-హైదరాబాద్, వి.రామలింగాచారి, ఐ.పద్మ-యాదగిరిగుట్ట, డా॥ప్రణీతరావు-కామారెడ్డి, సి.హెచ్.మహేశ్వరశర్మ-జగిత్యాల, డా॥బి.ధన్వంతరి-మచిలీపట్నం, ఎస్.రాజు-కర్నూలు, కె.అల్లీరాణి, పి.సీతామహాలక్ష్మి-తిరుపతి, టి.శ్రీలక్ష్మి నాగజ్యోతి, టి.పి.ఎం.కె.ప్రసాద్-నెల్లూరు, ఎన్.సుభాష్ చంద్ర బోస్-విశాఖపట్నం, కె.కాంతామణి-భువనేశ్వర్, ఎ.ప్రథిత్-బెంగుళూరు.

**బహుమతి పొందిన విజేత:**
**డా॥ ప్రణీత రావు-కామారెడ్డి.**

అరుణ

నవంబర్ 26, 2008న జరిగిన ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో హిందీలో నాలుగైదు చిత్రాలు తెరకెక్కాయి. అయితే ఆ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించి, తన ప్రాణాలను పణంగా పెట్టిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్‌కు ప్రాధాన్యమిచ్చిన చిత్రాలు వాటిలో లేవనే చెప్పాలి. ఆ లోటును తీర్చుతూ అడివి శేష్ హీరోగా శశికిరణ్ తిక్క తెర కెక్కించిన సినిమా 'మేజర్'. అనురాగ్, శరత్‌చంద్రతో పాటు హీరో మహేశ్ బాబు, సోనీ సంస్థ కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామ్యం కావడం విశేషం. దాంతో తెలుగు, హిందీ భాషల్లో నిర్మించిన ఈ సినిమాను మలయాళంలోనూ డబ్ చేసి విడుదల చేశారు.



# తప్పక చూడాల్సిన చిత్రం

# మేజర్

పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న ముంబైలోకి చొరబడి వందలాది మందిని నిర్దయగా హతమార్చారు. అంతటితో ఆగకుండా తాజ్ హోటల్‌లో బస చేసిన యాత్రికులపై దాడికి దిగారు. ఎంతమంది ఉగ్రవాదులు ఈ దాడిలో పాల్గొన్నారో, వారిదగ్గర ఎలాంటి ఆయుధాలు ఉన్నాయో, వారి పన్నాగం ఏమిటో.. ఇవేవీ తెలియ కుండానే మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ నేతృత్వంలోని 51 నేషనల్ యాక్షన్ గ్రూప్ రంగంలోకి దిగింది. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ ట్రైనర్‌గా ఉన్న సందీప్ ఉన్నికృష్ణన్ ఓ అడుగు ముందుకేసి స్వయంగా ఆపరేషన్‌లో పాల్గొన్నాడు. టూరిస్టులను రక్షించే క్రమంలో ప్రాణాలను కోల్పోయాడు. ముంబై ఉగ్ర దాడిని వివిధ ఛానెళ్లు ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ఆ రెండు రోజులు ముంబైలోని తాజ్ హోటల్‌లో ఏం జరిగిందనే విషయం అందరికీ తెలిసిందే. అందుకే ఆ సంఘటనలకు పూర్తిస్థాయిలో ప్రాధాన్యం ఇవ్వకుండా దర్శకుడు శశికిరణ్ తిక్క.. 'మేజర్' చిత్రంలో సందీప్ ఉన్నికృష్ణన్ జీవిత కథను తెలియ చేసే ప్రయత్నం చేశాడు.

దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టడానికి వెనుకాడని మనస్తత్వం సందీప్‌కు ఎలా అలవడింది? బాల్యంలో జరిగిన కొన్ని సంఘటనలు ఏ విష యంలో అయినా ముక్కుసూటిగా పోయే తత్వాన్ని అతనికి ఎలా అలవాటు చేశాయి? అనేది చూపిం చారు. నేవీలో చేరాలనే సందీప్ చిరకాల వాంఛ నెరవేరకపోయినా, తాను ప్రేమించిన క్లాస్‌మేట్ ఈషా సలహాతో అతను ఎలా ఆర్మీలో చేరాడో తెలి పారు. ఆర్మీలో అంచెలంచెలుగా ఎదిగి ఎన్.ఎస్.జి. ట్రైనర్‌గా అతను ఎంతోమందిని సిసలైన జవాన్లుగా ఎలా తయారు చేశాడో చూపారు. ఈ క్రమంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య అపార్థం చేసు కోవడం, అతనికి విడాకులు ఇవ్వాలని అనుకోవడం, అంతలోనే ముంబైలో దాడులు జరగడం, తన బాధ్యత కాకపోయినా దేశం ప్రమాదంలో పడినప్పుడు చూస్తూ ఊరుకోలేక సందీప్ స్వయంగా రంగంలోకి దిగడం, అక్కడ ఉగ్రవాదులను ఎదుర్కొనే క్రమంలో ప్రాణాలు కోల్పోవడం వంటి అంశాలను ఆసక్తి కరంగా తెరకెక్కించారు.

సందీప్ తండ్రి, ఇస్రోలో పనిచేసిన ఉన్నికృష్ణన్ తన కొడుకు గురించి చెబుతున్నట్టుగా ఈ చిత్రాన్ని మలిచారు. సందీప్ చిన్నప్పటి చిలిపి పనులు, బాల్యంలోనే అతని మదిలో నాటుకున్న దేశభక్తి, కాలేజీ రోజుల్లో పరిచయం అయిన అమ్మాయితో ప్రేమలో పడటం, ఆ సమయంలో కూడా సైన్యంలో చేరడం కోసమే ప్రాధాన్యం ఇవ్వడం ఇవన్నీ కూడా మనసుకు హాయిని కలిగించే సన్నివేశాలే. అయితే చాలామంది వైవాహిక జీవితాల్లో ఎలాంటి ఒడిదొడుకులు ఉంటాయో అలానే సందీప్ జీవితం సాగిందని, ఎలాంటి దాపరికాలు లేకుండా సినిమాలో చూపించడం విశేషం. తన వైవాహిక బంధాన్ని నిలుపుకోవడానికే అతను చివరి వరకూ ప్రయత్నించి నట్టు ఇందులో చూపారు.

ఈ మధ్యకాలంలో రకరకాల వ్యక్తులపై బయోపిక్స్ వస్తున్నాయి. క్రీడా నేపథ్యంలో వచ్చే బయోపిక్స్ ఆ రంగం పట్ల మక్కువ ఉన్నవారికే నచ్చుతాయి. కానీ అశోకచక్ర అవార్డుకు ఎంపికైన సందీప్ జీవితం అందరిలోనూ ఉత్తేజం కలిగించేదే. దానిని దృష్టిలో పెట్టుకునే ఓ మధ్యతరగతి మనిషి ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని ఆర్మీలోకి రావడం, అక్కడ తన శౌర్యప్రతాపాలను చూపడం, ఆపైన దేశం కోసం ప్రాణత్యాగం చేయడం అనేదాన్ని ఆసక్తి దాయంగా చూపారు. నిజానికి ఇలాంటి కథలను తెరకెక్కించడానికి గట్స్ ఉండాలి. ఈ తరహా చిత్రాలను సైతం ప్రజలు ఆదరిస్తారనే విశ్వాసం ఉండాలి. ఈ రెండు తమకు ఉన్నాయని అడివి శేష్, శశికిరణ్ తిక్క నిరూపించారు. దానికి తోడు నిర్మాతలు వారికి దన్నుగా నిలిచారు. అడివి శేష్ కేవలం చిత్ర నిర్మాణం, రూపకల్పనలో పాల్గొనడమే కాకుండా నటుడిగానూ చక్కని అభినయం ప్రదర్శించాడు. సందీప్ పాత్రలో ఒదిగిపోవడానికి విశేషమైన కృషి చేశాడు. అలానే అతని భార్యగా సాయి మంజ్రేకర్, తాజ్ హోటల్‌లో బస చేసిన యువతిగా శోభిత దూళిపాళ, సందీప్ తల్లిదండ్రు లుగా రేవతి, ప్రకాశ్ రాజ్, ఆర్మీ అధికారిగా మురళీశర్మ చాలా బాగా నటించారు. అలానే శ్రీచరణ్ పాకాల సంగీతం, వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ మూవీని మరో స్థాయికి తీసుకెళ్లాయి. సినిమా గ్రాఫ్ మధ్యమధ్యలో కాస్తంత డౌన్ అయినా, దర్శక నిర్మాతలు ఎంచుకున్న కథ, దాని ద్వారా సమాజానికి వారు చెప్పాలనుకున్న అంశాలను దృష్టిలో పెట్టుకుంటే ఇవన్నీ చిన్నవిగా అనిపిస్తాయి. నిజానికి ఈ కథను మరింత ఎమోషనల్‌గా, మరింత బలంగా చెప్పి ఉండాల్సింది. ఏదేమైనా.. ఇవాళ సమాజాన్ని పక్కదోవ పట్టించే సినిమాలే అధిక శాతం వస్తున్న నేపథ్యంలో ఓ దేశభక్తుని గాథను తెరకెక్కించిన నిర్మాతలను, నటుడు అడివి శేష్‌ను అభినందించాలి. ఈ తరహా చిత్రాలను ఆదరించినప్పుడే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.599/-




వెల : ₹.349/-




వెల : ₹.695/-




వెల : ₹. 799/-




వెల : ₹.50/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

